అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

ఆదివారం 01-01-2023 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 8 | సంచిక : 317 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | www.navatelangana.com | 10 పేజీలు + సోపతి (వెరసి) | వెల : 8.00





రైతుల ఆదాయం

రెట్టింపేది..?

2022 నాటికి రెట్టింపుచేస్తానన్న మోడీ

- వాస్తవానికి రైతుల ఆదాయంలో క్షీణత
- రైతులపై పెరుగుతున్న రుణ భారం
- ఐదేండ్లలో 28,572 మంది రైతుల ఆత్మహత్యలు
- పీఎం కిసాన్ నుంచి రెండు కోట్ల మంది రైతులు తొలగింపు

'2022 నాటికి దేశంలోని రైతులందరి ఆదాయం రెట్టింపు చేస్తాం. అదే ప్రభుత్వం ఉద్దేశం. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 2022 నాటికి 75 ఏండ్లు పూర్తి అవుతుంది. అప్పటికి... రైతుల ఆదాయం రెట్టింపు అవ్వాలి. అందుకనుగుణంగా మా ప్రభుత్వం పని చేస్తుంది' అని 2016 ఫిబ్రవరి 28న ఉత్తరప్రదేశ్‌లోని బరేలీలో జరిగిన రైతు ర్యాలీలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ హామీ ఇచ్చారు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామనే లక్ష్యం స్వాగతించదగినది. ప్రభుత్వ అధికారులు అనేకసార్లు పునరుద్ఘాటించినప్పటికీ 'రైతు' అంటే ఎవరు? రైతు ఆదాయం అంటే ఏమిటి? అనే దానిపై ప్రభుత్వం వద్ద స్పష్టత లేదు.



న్యూఢిల్లీ : 2022 ముగిసింది. 2023లోకి అడుగు పెట్టాం. సంవత్సరాలు మారుతున్నా.. రైతులు కన్నీళ్లు మాత్రం కారుతూనే ఉన్నాయి. పండిన పంటకు కనీస మద్దతు ధర లేకపోవడం, మరోవైపు పంట పండించడానికి పెట్టుబడి వ్యయం ఏడాదికి ఏడాది పెరగడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనివల్ల అప్పుల భారం పెరుగుతున్నది. జూలై 2018 - జూన్ 2019 ఏడాదిలో దేశంలో సగటున ఒక్కో కుటుంబంపై రూ.74,121 రుణభారం ఉందని కేంద్రమే తెలిపింది. మరోవైపు ఏడాదికి ఏడాది రైతుల ఆత్మహత్యలు కూడా పెరుగుతున్నాయి. ప్రధాని మోడీ రైతులకు రెట్టింపు ఆదాయం చేస్తామని ప్రకటించిన తరువాతే దేశంలో 28,572 (2017-2022) మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు.

రైతులకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే సహాయంలో భారీ కోత విధించింది. ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎంకిసాన్) పథకం నుంచి ఈ ...9లో

జనంలో ఉండాల్సిందే..

పోరాడాల్సిందే...

మతవిద్వేషాలతో పబ్బం గడుపుకుంటున్న బీజేపీ

- పాలకుల వైఫల్యాలను ఎండగట్టాలి
- క్షేత్రస్థాయిలో పోరాటాలను బలోపేతం చేయాలి : అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్



ఖమ్మం నుంచి అచ్చిన ప్రశాంత్

వర్గపోరాటంలో విజయం సాధించాలంటే నిరంతరం జనం ఉండాల్సిందేననీ, సమస్యలపై వారి పక్షాన నిలబడి పోరాడాల్సిందేనని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ నొక్కిచెప్పారు. ఖమ్మంలోని వేదగిరి శ్రీనివాసరావు(భక్తరామదాసు కళాక్షేత్రం)లోని అమరవీరుల ప్రాంగణంలో జరుగుతున్న రాష్ట్ర మూడో మహాసభలో ప్రతినిధులనుద్దేశించి ఆయన ప్రసంగించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మత విద్వేషాలతో పబ్బం గడుపుకుంటున్నదని విమర్శించారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రజలకు, వ్యవసాయ కార్మికులకు ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరంతరం ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ఒకప్పుడు భూస్వాముల చేతుల్లో భూమి కేంద్రీకృతం అయ్యి ఉండేదనీ, అనేక పోరాటాల ఫలితంగా కొంతమేరకు భూమి పేదలకు దక్కిందని తెలిపారు. మళ్లీ ఇప్పుడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ వ్యవసాయం పేరుతో భూమిని కొందరి వద్దనే కేంద్రీకృతం చేసే కుట్రకు పూనుకుంటున్నదని విమర్శించారు. రానున్న రోజుల్లో భూ సమస్య తీవ్రం కాబోతున్నదన్నారు. పేదల పక్షాన ...9లో





తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా

జి.నాగయ్య, ఆర్.వెంకట్రాములు

వివరాలు 9లో..

ఎన్ఐఏ కేసుల పెరుగుదలలో

ఆల్‌టైమ్ రికార్డు

ఏడాదిలో 19.67 శాతం పెరుగుదల

- 2021లో 61 కేసులు, 2022లో 73 కేసులు నమోదు
- 368 మందిపై 59 చార్జిషీట్లు



9లో..

డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన

అంజనీకుమార్

ఘనంగా మహేందర్‌రెడ్డికి వీడ్కోలు పలికిన ఐపీఎస్ అధికారులు

నవతెలంగాణ- ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్ర నూతన డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు (డీజీపీ) అంజనీకుమార్ శనివారం బాధ్యతలను స్వీకరించారు. మధ్యాహ్నం 12.50 గంటలకు ఆయన.. రిటైర్ అవుతున్న డీజీపీ మహేందర్‌రెడ్డి నుంచి బాధ్యతలను స్వీకరించారు. అంతకుముందు ఏసీబీ కార్యాలయం నుంచి డీజీపీ కార్యాలయానికి వచ్చిన అంజనీకుమార్‌కు సీనియర్ ఐపీఎస్ అధికారులు స్వాగతం పలికి లోనికి తీసుకెళ్లారు. లోపల అప్పటికే ఆయన కోసం వేచి ఉన్న మహేందర్‌రెడ్డి డీజీపీ చాంబర్‌లోకి అంజనీకుమార్‌ను సాదరంగా ఆహ్వానించి నేరుగా డీజీపీ సీటు వద్దకు తీసుకెళ్లి కూర్చోబెట్టారు. అనంతరం అధికారిక ఫైలులో అంజనీకుమార్ డీజీపీగా సంతకం చేశారు. అనంతరం రిటైరైన డీజీపీ మహేందర్‌రెడ్డిని సుందరంగా అలంకరించిన వాహనంలో కూర్చొబెట్టి దానికి ఇరువైపులా కట్టిన తాళ్లను సీనియర్ ఐపీఎస్ అధికారులు లాగుతూ డీజీపీ కార్యాలయ ప్రాంగణం నుంచి మేయిన్ గేటు వరకు తీసుకెళ్లారు. అక్కడ ప్రత్యేక వాహనం నుంచి దిగిన మహేందర్‌రెడ్డి తన కారులో కూర్చొని నివాసానికి బయలుదేరి వెళ్లారు. గత కొన్నేండ్లుగా రిటైరైన డీజీపీలను ప్రత్యేక వాహనంలో కూర్చోబెట్టి తాడుతో లాగుతు తీసుకెళ్లి మేయిన్ గేటు వద్ద వీడ్కోలు పలకటం ఆనవాయితీగా వస్తున్నది. ఈ మారు వాహనం తాడును లాగిన వారిలో సీనియర్ ఐపీఎస్ అధికారులు సీవీ ఆనంద్, శివధర్‌రెడ్డి, సందీప్ శాండిల్య, సంజయ్ జైన్, శిఖాగోయల్,



స్టీఫెన్ రవీంద్ర, మహేష్ భగవత్ తదితర ఉన్నతాధికారులు ఉన్నారు. డీజీపీగా ఛార్జి తీసుకున్న తర్వాత తన చాంబర్‌లో వేద మంత్రాల మధ్య పూజలు చేసిన అంజనీకుమార్.. తర్వాత ముఖ్యమంత్రిని కలువడానికి వెళ్లారు. అంజనీకుమార్ డీజీపీగా బాధ్యతలను స్వీకరిస్తున్న సమయంలో డీజీపీ కార్యాలయంలోని అదనపు డీజీలు, ఐజీలు, డీఐజీలు, జిల్లాల ఎస్పీలు, నగర పోలీసు కమిషర్లు, డీజీపీ కార్యాలయ అధికారులు అక్కడే ఉండి ఆయనకు శుభాకాంక్షలు తెలియ చేశారు.

'పది' ప్రశ్నాపత్రంలో అన్ని సెక్షన్లకూ

ఛాయిస్ ఇవ్వాలి

రోజువిడిచి రోజు పరీక్షలు నిర్వహించాలి

- విద్యాశాఖ కార్యదర్శికి టీఎస్‌యూటీఎఫ్ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పదో తరగతి ప్రశ్నాపత్రంలో అన్ని సెక్షన్లలోని ప్రశ్నలకూ ఛాయిస్ ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఏప్రిల్ మూడో తేదీ నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలను రోజువిడిచి రోజు నిర్వహించాలని కోరింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి, పాఠశాల విద్యా డైరెక్టర్, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్‌ను టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి శనివారం వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు సమర్పించారు. ఒక ప్రకటన విడుదల చేశారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలను 11 పేపర్లకు బదులుగా ఆరు పేపర్లతోనే నిర్వహించాలని నిర్ణయించటం అభినందనీయమని తెలిపారు. ప్రస్తుతం విడుదలైన మోడల్ పేపర్లు సగటు, అంతకంటే తక్కువ స్థాయి గల విద్యార్థులకు చాలా క్లిష్టంగా ఉన్నాయని పేర్కొన్నారు. తొలిసారిగా పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థుల స్థాయికి తగిన విధంగా ప్రశ్నాపత్రం రూపొందించటం అవసరమని సూచించారు. రెండేండ్ల కోవిడ్ మహమ్మారి కారణంగా భౌతికంగా తరగతులు జరగలేదని గుర్తు చేశారు. విద్యార్థులు ఆన్‌లైన్ ...9లో

సమానత్వం కోసం సమైక్యతతో పోరాటం

ఐద్వా అఖిల భారత మహాసభ నినాదం

- జనవరి 6 నుండి 9 వరకు తిరువనంతపురంలో నిర్వహణ
- 850 మందికి పైగా ప్రతినిధులు

తిరువనంతపురం : 'సమానత్వం కోసం సమైక్యతతో పోరాటం' నినాదంతో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) 13వ మహాసభ నిర్వహించనున్నట్టు ఐద్వా జాతీయ ఉపాధ్యక్షులు, మహాసభ ఆహ్వాన కమిటీ చైర్మెన్ పికె శ్రీమతి తెలిపారు. కేరళలోని తిరువనంతపురంలో ఈ నెల 6 నుంచి 9 వరకు ఐద్వా మహాసభ జరగనున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా శనివారం ఇక్కడ ఏర్పాటు చేసిన



మీడియా సమావేశంలో ఐద్వా కేంద్ర కమిటీ సభ్యులు, ఆహ్వాన కమిటీ కన్వీనర్ టిఎస్ సీమ, రాష్ట్ర కార్యదర్శి, జనరల్ కన్వీనర్ సిఎస్ సుజాతతో కలిసి పికె శ్రీమతి మాట్లాడారు. ఈ మహాసభకు దేశం నలుమూలల నుంచి దాదాపు 850 మంది పైగా ప్రతినిధులు హాజరుకానున్నట్టు ఆమె తెలిపారు. తిరువనంతపురం ఐద్వా మహాసభకు ఆతిథ్యమివ్వడం ఇది రెండోసారి అని, 36 ఏళ్ళ క్రితం 1986లో మొదటిసారిగా జాతీయ మహాసభ ఇక్కడ జరిగిందని తెలిపారు. 1981లో ఐద్వా ఏర్పడిన సంగతి విదితమే. "సమానత్వం కోసం సమైకత్యతతో పోరాటం" అనుది ఈ జాతీయ మహాసభ ప్రధానాంశంగా ఉండనున్నట్టు పికె శ్రీమతి పేర్కొన్నారు. బాల్య నృత్య కళాకారిణి, కేరళ కళా మండలం ఛాన్సలర్ మల్లికా సారాభారు జనవరి 6న ఠాగూర్ థియేటర్‌లో జరిగే ప్రతినిధుల సమావేశాన్ని ప్రారంభిస్తారని, సిపిఎం పొలిట్‌బ్యూరో ...9లో

కురవిలో ఘోర రోడ్డు ప్రమాదం...

- ఆటోను ఢీకొట్టిన గ్రానైట్ లారీ
- గ్రానైట్ రాళ్లు ఆటో మీద పడటంతో ఇద్దరు మృతి

నవతెలంగాణ-మహబూబాబాద్

మహబూబాబాద్ జిల్లా కురవి మండలం శివారు అయ్యవారిపెల్లి గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై శనివారం రాత్రి ఘోర ప్రమాదం జరిగింది. ఆటోను గ్రానైట్ లారీ ఢీకొట్టడంతో బండరాళ్లు మీద పడి ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. మరో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం రాత్రి 7:30 గంటల సమయంలో మహబూబాదాద్ వైపు నుంచి భారీ బండరాళ్లతో గ్రానైట్ లారీ మరిపెడ వైపు వెళ్తోంది. ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టింది. దీంతో గ్రానైట్ రాళ్ల తాళ్లు తెగి రాళ్లు ఆటోపై పడ్డాయి. ఆ సమయంలో ఆటోలో డ్రైవర్‌తోపాటు ఎనిమిది ...9లో



పని పరిస్థితులు అధ్వాన్నం..

గిగ్ కార్మికులకు కనీస వేతనాల్లేవు..

ఆరోగ్యం దెబ్బతింటే ఇక అంతే

- కార్మికుల గోడు వినేందుకు కంపెనీలు విముఖత
- ఓలా, ఉబర్, డుంజో, ఫార్మాఈజీ, అమెజాన్‌ల స్కోర్ జీరో
- పరిశోధనా సంస్థ 'ఫెయిర్‌వర్క్ ఇండియా' నివేదిక

న్యూఢిల్లీ : బహుళజాతి సంస్థలకు, దేశీయ కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా కేంద్రంలోని పాలకులు వ్యవహరిస్తు న్నారు. కార్మిక చట్టాలేవీ తమకు వర్తించవన్నట్టుగా ఓలా, ఉబర్, డుంజో, ఫార్మాఈజీ, అమెజాన్, జొమాటో, ఫ్లిప్‌కార్ట్..తదితర ఈ-కామర్స్ కంపెనీలు వ్యవహరిస్తున్నాయి. ఇష్టమున్నట్టుగా ఉద్యోగ నియామకాలు, తొలగింపులు, వేతనాలు ఇవ్వటం సర్వసాధారణమై పోయింది. గిగ్ కార్మికులంతా ఒక యూనియన్‌గా ఏర్పడి.. ఆందోళనకు దిగితే సంబంధిత కంపెనీలు స్పందించటం లేదు. కనీస వేతనాల్లేవు. సరైన పని పరిస్థితుల్లేని కోట్లాది మంది గిగ్ కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నా..ప్రభుత్వాలు పట్టించుకోవటం లేదని పరిశోధన సంస్థ 'ఫెయిర్ వర్క్ ఇండియా' తెలిపింది. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలోని ఐటీ, పబ్లిక్ పాలసీ



విభాగంతో కలిసి సంయుక్తంగా జరిపిన పరిశోధనకు సంబంధించి తాజాగా నివేదికను విడుదల చేసింది.

పార్లమెంట్‌లో ప్రస్తావన

భారత్‌లో గిగ్ కార్మికుల సంఖ్య ప్రతిఏటా పెరుగుతోంది. దేశవ్యాప్తంగా కోట్లాది మంది ఆన్‌లైన్ వేదికలపై, ఈ-కామర్స్ కంపెనీల్లో పనిచేస్తున్నారు. వీరి న్యాయమైన కోరికలు, హక్కుల్ని పరిరక్షించాలని ప్రభుత్వాలు ఆలోచించటం లేదు. కార్మికుల రక్షణ, భద్రతపై విధానపరమైన నిర్ణయాలు చేయటం లేదు. ఏ ఒక్క కార్మికుడికీ కనీసం ఆరోగ్య బీమా వర్తించటం లేదు. కార్మికుడు హఠాత్తుగా తీవ్రమైన ఆరోగ్య సమస్యబారిన పడితే, అతడ్ని ఆదుకునే ఆర్థిక భద్రతా సేవలు లేవు. ఈ-కామర్స్ కంపెనీలు కార్మికుల శ్రమను దోచుకుంటున్నాయనే ఆరోపణలున్నాయి. గిగ్ కార్మికుల సమస్యలపై పార్లమెంట్‌లో ప్రతిపక్ష ఎంపీలు ఎన్నోమార్లు ప్రస్తావించారు. హక్కుల ఉల్లంఘన, వివక్ష నెలకొందని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. ఈ రంగంలో సరైన విధానాల్ని తీసుకురావాలని కోరారు. అయినా కేంద్ర ప్రభుత్వం నుంచి సరైన స్పందన లేదని 'ఫెయిర్‌వర్క్ ఇండియా' పరిశోధన వెల్లడించింది.

యాజమాన్యం ఇష్టారాజ్యం

భారత్‌లోని ఈ-కామర్స్ ...9లో

806 పోస్టుల భర్తీకి మరో నాలుగు నోటిఫికేషన్లు

- డిగ్రీ కాలేజీల్లో అధ్యాపక పోస్టులు 544
- 31 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- టీఎస్‌పీఎస్సీ వెల్లడి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో కొలువుల భర్తీ ప్రక్రియ కొనసాగుతూనే ఉన్నది. 2022, డిసెంబర్ 31న ఏడాది చివరి రోజు 806 పోస్టుల భర్తీకి తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) మరో నాలుగు నోటిఫికేషన్లను జారీ చేసింది. కళాశాల విద్యాశాఖ పరిధిలోనే 544 అధ్యాపక, ఫిజికల్ డైరెక్టర్, లైబ్రేరియన్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. ఈ మేరకు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి అనితా రామచంద్రన్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇందులో అధ్యాపక పోస్టులు 491, ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు 29, లైబ్రేరియన్ పోస్టులు 24 ఉన్నాయని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఈనెల 31 నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. వాటి సమర్పణకు వచ్చేనెల 20వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు గడువుందని వివరించారు. మల్టీజోన్-1 పరిధిలో 246, మల్టీజోన్-2 పరిధిలో 298 కలిపి మొత్తం 544 పోస్టులను భర్తీ చేస్తున్నామని పేర్కొన్నారు. మే లేదా జూన్‌లో నియామక పరీక్ష ఉంటుందని ప్రకటించారు. ఇతర వివరాలకు ఆ్ఞ్.ంఞా౦ఎ.ౕశ్రీజ.అఅ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

సబ్జెక్టుల వారీగా పోస్టుల వివరాలు

ఇంగ్లీష్-23, తెలుగు-27, ఉర్దూ-2, సంస్కృతం-5, స్టాటిస్టిక్స్-23, మైక్రో బయాలజీ-5, బయో టెక్నాలజీ-9, అప్లయిడ్ న్యూట్రిషన్-5, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్-311, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్-39, కామర్స్-బిజినెస్ అనలిటిక్స్ (స్పెషలైజేషన్)- 8, డెయిరీ సైన్స్-8, క్రాప్ ప్రొడక్షన్-4, డేటా సైన్స్-12, ఫిషరీస్-3, కామర్స్ ఫారిన్ ట్రేడ్ (స్పెషలైజేషన్)-1, కామర్స్ టాక్సేషన్ (స్పెషలైజేషన్)-6, ఫిజికల్ డైరెక్టర్-29, లైబ్రేరియన్-24.

పురపాలక శాఖలో 78 పోస్టులు

పురపాలక శాఖలో 78 పోస్టుల భర్తీకి టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఇందులో 64 సీనియర్ అకౌంటెంట్, 13 జూనియర్ అకౌంటెంట్, ఒక అకౌంట్స్ ఆఫీసర్ పోస్టులున్నాయని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి అనితా రామచంద్రన్ తెలిపారు. ఈనెల 20 నుంచి వచ్చేనెల 11 వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు ఆ్ఞ్.ంఞా౦ఎ.ౕశ్రీజ.అఅ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

విద్యాశాఖలో 71 లైబ్రేరియన్ పోస్టులు

విద్యాశాఖ పరిధిలో 71 లైబ్రేరియన్ పోస్టుల భర్తీకి మరో నోటిఫికేషన్‌ను విడుదల చేసినట్టు కార్యదర్శి అనితా రామచంద్రన్ తెలిపారు. ఇంటర్ కమిషనరేట్ పరిధిలో 40 లైబ్రేరియన్ పోస్టులు, సాంకేతిక విద్యాశాఖ పరిధిలో 31 లైబ్రేరియన్ పోస్టులను భర్తీ చేయనున్నట్టు పేర్కొన్నారు. ఈనెల 21 నుంచి వచ్చేనెల పదో తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని పేర్కొన్నారు. ఇతర వివరాలకు www.tspsc.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

113 ఏఎంవీఐ పోస్టులు

113 అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ (ఏఎంవీఐ) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ను జారీ చేశామని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి అనితా రామచంద్రన్ తెలిపారు. ఫిబ్రవరి ఒకటి నుంచి ఏప్రిల్ 23 వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని వివరించారు. మే లేదా జూన్‌లో నియామక పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు www.tspsc.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

డాటా ప్రొటక్షన్ బిల్లుతో పౌరులపై నిరంతర నిఘా

ప్రభుత్వానికి అపరిమిత అధికారాలు : హక్కుల కార్యకర్తలు

- చిన్న పిల్లల సమాచారమూ సేకరించొచ్చు..
- నిఘా కార్యకలాపాలపై ప్రభుత్వ శక్తిని పెంచే బిల్లు ఇది : హ్యూమన్ రైట్స్ వాచ్

న్యూఢిల్లీ : పాత చట్టాల్ని మారుస్తూ, కొత్త చట్టాలు చేస్తూ..పౌరుల ప్రాథమిక హక్కులకు మోడీ సర్కార్ తూట్లు పొడుస్తోంది. మొన్న సాగు చట్టాలు, నిన్న లేబర్ కోడ్స్, ఇప్పుడు 'పౌరుల వ్యక్తిగత సమాచార రక్షణ బిల్లు'. దేశ పౌరుల వ్యక్తిగత సమాచారానికి రక్షణ కల్పించే ఉద్దేశమని పైకి చెబుతున్నా, బిల్లు అసలు లక్ష్యం..ప్రభుత్వ నిఘా శక్తిని అపరిమితం చేయటమే. కేంద్రం తాజాగా తెరపైకి తీసుకొచ్చిన ముసాయిదా బిల్లు 'డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్లు-2022'పై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా హక్కుల కార్యకర్తలు ఈ బిల్లుపై ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు. ఈ చట్టం ద్వారా ప్రభుత్వానికి దఖలుపడుతున్న నియంత్రణలు, ప్రత్యేక మినహాయిం పులపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. ప్రభుత్వానికి కల్పించిన ప్రత్యేక వెసులుబాట్లతో పౌరుల వ్యక్తిగత సమాచారానికి ముప్పు వాటిల్లడమేగాక, పౌరులపై నిరంతరం నిఘాకు ఆస్కారం ఏర్పడుతుందని హ్యూమన్ రైట్స్ వాచ్, గ్లోబల్ రైట్స్ బాడీ ఆరోపించాయి. ప్రతిపాదిత బిల్లు ఎట్టి పరిస్థితుల్లో చట్టరూపం దాల్చరాదని హక్కుల కార్యకర్తలు చెబుతున్నారు. "ఇది పౌరుల వ్యక్తిగత డేటాకు భద్రత కల్పించటం కాకుండా, ప్రభుత్వానికి అపరిమిత అధికారాల్ని కట్టబెట్టింది. ప్రభుత్వ నిఘాను ప్రశ్నించడానికి వీల్లేకుండా బిల్లును రూపొందించారు" అని తన వెబ్‌సైట్‌లో హ్యూమన్ రైట్స్ వాచ్ పేర్కొంది. 'గ్లోబల్ రైట్స్ బాడీ' కూడా బిల్లులోని అంశాలపై ఆందోళన వ్యక్తం చేసింది. పౌర హక్కుల సంఘాలను లక్ష్యంగా చేసుకొని బిల్లును తీసుకొస్తున్నారని ఆరోపిం చింది. డాటా ప్రొటెక్షన్ నిపుణులు, పౌర సంఘాల కార్య కర్తలు బిల్లుపై పెదవి విరుస్తున్నారు. "పౌరులపై నిఘా చేపట్టడానికి ప్రభుత్వ శక్తిని పెంచేదిగా ఉంది. పౌరుల గోప్యత, భద్రత, ప్రాథమిక హక్కులను బలహీన పరుస్తోంది. డిజిటల్ వేదికల్లోనూ పౌరుల గోప్యత, భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి" అని హ్యూమన్ రైట్స్ వాచ్ దక్షిణాసియా డైరెక్టర్ మీనాక్షి గంగూలీ అన్నారు.

ప్రభుత్వానికి అనేక మినహాయింపులు

ఈ ఏడాది ఆగస్టులో రద్దు చేసిన డేటా భద్రత బిల్లు స్థానంలో కొత్త బిల్లును కేంద్రం తీసుకొచ్చింది. దీనిపై సలహాలు, సూచనలను పంపేందుకు 2023 జనవరి 2 వరకు అవకాశం కల్పించింది. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో ఈ బిల్లులోని నిబంధనల నుంచి ప్రభుత్వానికి మినహాయింపులున్నాయి. చట్టపరమైన కార్యకలాపాల కోసం ఈ మినహాయింపుల్ని ఉపయోగించుకునే వెసులుబాట్లు కల్పించారు. బిల్లు ప్రకారం, ప్రత్యేక సందర్భాల్లో సమాచారాన్ని సేకరించడానికి గల కారణాన్ని ప్రభుత్వం వ్యక్తులకు తెలియజేయాల్సిన అవసరం లేదు. అలాగే పిల్లలకు సంబంధించిన సమాచారాన్ని కూడా అవసరాన్ని బట్టి సేకరించొచ్చు. శాంతిభద్రతల అంచనా కోసం సమాచారాన్ని ఉప యోగించుకోవచ్చు. డేటా ఆడిటర్‌ను నియమించడం లోనూ ప్రభుత్వానికి ప్రత్యేక మినహాయింపులు ఉన్నాయి. ఒకవేళ ఏవరైనా సమాచార హక్కు చట్టం కింద ప్రభుత్వాన్ని కోరినా..ఆ సమాచారం ఇవ్వాల్సిన అవసరం లేదని బిల్లులో ప్రతిపాదించారు.

స్వతంత్ర లేని ప్రొటక్షన్ బోర్డు

బిల్లులో ప్రతిపాదించినట్టుగా, డేటా ప్రొటక్షన్ బోర్డును ఏర్పాటుచేస్తామని కేంద్రం చెబుతోంది. అయితే ఈ బోర్డులోని సభ్యులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నియ మితు లవుతారు. అలాగే తీసేస్తారు. బోర్డు పనితీరు స్వతంత్రంగా ఉండాలని లేదు. పర్యవేక్షణకు పాలకులు అనుమతించరు. దీనివల్ల ప్రభుత్వ నిఘా మరింత సులభతరం అవుతుం దని హ్యూమన్ రైట్స్ వాచ్ ఆరోపించింది. జర్నలిస్టులు, హక్కుల కార్యకర్తలు, ప్రతిపక్ష నాయ కులను లక్ష్యంగా చేసుకొని ప్రభుత్వ నిఘాకు అడ్డుఅదుపు ఉండదన్నది బిల్లు ద్వారా అం స్పమవుతోంది. పౌరుల వ్యక్తిగత డాటాను సేకరించే ప్రభుత్వసంస్థలను బిల్లు రక్షిస్తోందని హక్కుల కార్య కర్తలు విమర్శిస్తున్నారు.

విధాన నిర్ణయాలపై సంఘాలతో చర్చించండి

- ప్రయివేటు స్కూళ్లతో పోటీపడేలా షెడ్యూల్
- మంత్రి సబితకు టీఎస్‌జీహెచ్‌ఎంఏ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విధాన నిర్ణయాలు తీసుకునే సందర్భంలో క్షేత్రస్థాయిలో పనిచేసే ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులతోపాటు, ఉపా ధ్యాయ సంఘాలతో చర్చించాలని తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ హెడ్మాస్టర్ల సంఘం (టీఎస్‌జీహెచ్‌ఎంఏ) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డిని శనివారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి రాజభాను చంద్రప్రకాశ్, ప్రధాన కార్యదర్శి ఆర్ రాజగంగారెడ్డి, కోశాధికారి బి తుకారాం కలిసి వినతి వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వమే ఆశిస్తున్న జాయ్ ఫుల్ లెర్నింగ్ విధానానికి విరుద్ధంగా షెడ్యూల్ ఉందని తెలిపారు. ప్రయివేటు పాఠశాలలు అనుసరిస్తున్న నిర్బంధ విద్యా బోధనా విధానాన్ని నియంత్రించాల్సిన అధికారులు వాటితో ప్రభుత్వ పాఠశాలలు పోటీ పడడానికి తయారుచేసిన షెడ్యూల్‌లా ఉందని పేర్కొన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం నిబంధనలను అతిక్రమించి తయారు చేసిన షెడ్యూల్ అని తెలిపారు. పాఠశాలల పని వేళలు, సెలవు రోజుల్లో పాఠశాలల నిర్వహణ తదితర అంశాలను నిబంధనల ప్రకారం రీ షెడ్యూల్ చేయాలని కోరారు. ప్రయివేటు పాఠశాలలకు పంపే విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లలకి రెండు/మూడు రకాల టిఫిన్ బాక్సులు పెట్టి పంపిస్తారని తెలిపారు. కానీ ప్రభుత్వ పాఠశాలకు వచ్చే విద్యార్థులకు ప్రభుత్వమే మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నదని గుర్తు చేశారు. ఒకవేళ ఇదే షెడ్యూల్ పాటించాలనుకుంటే ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఉదయం అల్పాహారం, సాయంత్రం స్నాక్స్ అందించాల్సి ఉంటుందని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు ముఖ్యంగా విద్యార్థినులకు రవాణా సౌకర్యం, భద్రత కల్పించాలని తెలిపారు. పరీక్షల మధ్య విరామం లేకుండా ఒకదానివెంట మరొకటి నిర్వహించడం పూర్తిగా అశాస్త్రీయమని విమర్శించారు. ప్రశ్నల ఛాయిస్ విధానం కూడా ఎక్కువ కఠినతరంగా ఉందనీ, తరగతి స్థాయికి తగినట్టుగా దానిని మార్చాలని కోరారు. ప్రశ్నల సంఖ్యను కూడా పరీక్ష సమయానికి అనుగుణంగా సరి చేయాలని పేర్కొన్నారు.

'పది' ప్రశ్నాపత్రాల కూర్పుతో విద్యార్థులకు ఇబ్బందులు

- 2,3 మార్కుల ప్రశ్నలకు 30 శాతం ఛాయిస్ ఇవ్వాలి
- మంత్రి సబితకు పీఆర్టీయూటీఎస్ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పదో తరగతి ప్రశ్నాపత్రాల కూర్పుతో విద్యార్థులు పలు ఇబ్బందులకు గురయ్యే అవకాశముందని పీఆర్టీయూటీఎస్ తెలిపింది. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డిని శనివారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు, ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ కలిసి వినతిపత్రం సమర్పించారు. గతంలో రెండు పేపర్లు ఉన్న సబ్జెక్టులను ఒకే పేపర్‌గా మార్చారని తెలిపారు. రెండు, మూడు మార్కులకు చెందిన ప్రశ్నలకు ఛాయిస్ లేకుండా చేయడం ఇబ్బందికరమని పేర్కొన్నారు. వాటికి కూడా 30 శాతం ఛాయిస్ ఇవ్వాలని కోరారు. వ్యాసరూప ప్రశ్నల సంఖ్య ఎక్కువగా ఉన్నందువల్ల సమయాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ సంఖ్యను నాలుగుకు తగ్గించాలని సూచించారు. భౌతిక, రసాయన శాస్త్రాలు, జీవశాస్త్రం పేపర్లను ఒకేరోజు కాకుండా వేర్వేరు రోజుల్లో నిర్వహించాలని తెలిపారు. సగటు, అంతకన్నా తక్కువ స్థాయి విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని మార్పులు చేయాలని కోరారు.

లెఫ్ట్‌ఫ్రంట్ అధికారంలోకి రాగానే
రిట్రెంచ్ టీచర్లందరికీ నియామకాలు

- మాణిక్ సర్కార్ హామీ

అగర్తలా : బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత త్రిపురలో మొత్తంగా 10,323 మంది ఉపాధ్యాయులను తొలగించారని, వామపక్ష సంఘటన (లెఫ్ట్‌ఫ్రంట్) తిరిగి అధికారంలోకి వస్తే ఆ ఉపాధ్యాయులందరినీ వారి ఉద్యోగాల్లో నియమిస్తామని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు, త్రిపుర అసెంబ్లీలో ప్రతిపక్ష నేత మాణిక్ సర్కార్ హామీ ఇచ్చారు. ఉద్యోగాలు కోల్పోయిన టీచర్లకు బాసటగా నిలవాలని తమ పార్టీ భావించిందని చెప్పారు. కుమార్‌ఘాట్‌లో జరిగిన పార్టీ కార్యక్రమానికి శుక్రవారం హాజరైన ఆయన ఒక పత్రికా సమావేశంలో మాట్లాడారు. గతంలో ప్రజల సమస్యలను పరిష్కరించింది వామపక్ష ప్రభుత్వమేనని, భవిష్యత్తులో కూడా అదే జరుగుతుందని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రజలు ఆలోచిస్తున్న తీరుతో ముఖ్యమంత్రి, ఆయన పార్టీ ఆందోళన చెందుతున్నారని అన్నారు. రిట్రెంచ్ అయిన ఉపాధ్యాయుల్లో మరో టీచర్ దీపికా దాస్ చౌదరి (53) తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం తెల్లవారు జామున మరణించారు. బిజెపి దీపికా దాస్ లాంటి ఉపాధ్యాయులందరినీ తొలగించిన నాటి నుంచి వారంతా తీవ్రమైన మనోవేదనకు గురై అస్వస్థతకు గురౌతున్న సంగతి తెలిసిందే. దీపికా మరణంతో ఇప్పటి వరకు మరణించిన లేదా ఆత్మహత్య చేసుకున్న రిట్రెంచ్ ఉపాధ్యాయుల సంఖ్య 148కి చేరింది.

మోసపూరిత బిజెపిని సాగనంపుదాం..

త్రిపురలో వామపక్ష సంఘటన అధికారంలో వుండగా, ఏ ఒక్కరూ కూడా ప్రతిపక్ష నేతలపై దాడికి దిగలేదని, అటువంటిది ఇప్పుడు సిపిఎం, ఇతరులపై బిజెపి ఎందుకు దాడి చేస్తోందో చెప్పాలని సిపిఎం త్రిపుర రాష్ట్ర కార్యదర్శి జితేంద్ర చౌదరి ప్రశ్నించారు. కొత్త ఏడాదిలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఈ మోసపూరిత ప్రభుత్వాన్ని సాగనంపాలని ఆయన ప్రజలను కోరారు. వైష్ణవ్‌పూర్, మనుఘాట్‌ల్లో జరిగిన రెండు బహిరంగ సభల్లో ఆయన ప్రసంగించారు. లోక్‌సభ, అసెంబ్లీ, పంచాయితీ ఎన్నికలేవైనా బిజెపి అభ్యర్థులు బల ప్రయోగంతో గెలుస్తున్నారని విమర్శించారు.

బిజినెస్

విమానయాన రంగానికి కరోనా బెంబేలు

- విస్తరణ ప్రణాళికలు రద్దు



న్యూఢిల్లీ : కరోనా కొత్త వేరియంట్ల భయాలు విమానయాన రంగ కంపెనీలను బెంబేతెత్తిస్తు న్నాయి. కొత్త ఏడాది ఎలా ఉంటుందోననే ఆందోళనలు నెలకొన్నాయి. దీంతో ఆ రంగంలోని కంపెనీలు కొత్త పెట్టుబడులు, విస్తరణపై ఆచీతూచి వ్యవహరిస్తున్నాయి. అంతర్జాతీయ ప్రయాణికులపై ఆంక్షలు మొదలవుతున్న నేపథ్యంలో ఆయా కంపెనీలు వ్యయాలపై ఆలోచనలో పడ్డాయని విమానయాన రంగ నిపుణులు పేర్కొంటున్నారు. కరోనా కాలంలో భారీ నష్టాలను ఎదుర్కొన్న కంపెనీలు గత ఎడెనిమిది నెలల నుంచి రాణిస్తున్నాయి. కాగా.. 2023 ఈ కంపెనీలాకు లాభదాయకంగా ఉండొచ్చనే విశ్వాసం ఉన్నప్పటికీ.. మరోవైపు భయాలు నెలకొన్నాయని ఏవియేషన్ నిపుణులు అమెయా జోషి పేర్కొన్నారు. 2021 చివరి మాసంలో అంతర్జాతీయ విమానాల రాకపోకలపై తీవ్ర ఆంక్షలు ఉన్న విషయం తెలిసిందే. ప్రస్తుత ప్రతికూల పరిస్థితులను కూడా డిజిసిఎ అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.


ద్రవ్యలోటు లక్ష్యంలో 59 శాతానికి చేరిక



న్యూఢిల్లీ : దేశ ద్రవ్య లోటు పెరుగుతుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం పెట్టుకున్న లక్ష్యంలో నవంబర్ ముగింపు నాటికి 59 శాతానికి చేరింది. 2023 మార్చి ముగింపు నాటికి రూ.16.61 లక్షల కోట్లు ఉండాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. జిడిపిలో ఇది 6.4 శాతం. నవంబర్ ముగిసే నాటికి ఇది 9.78 లక్షల కోట్లకు చేరింది.

కెఎస్‌ఆర్‌టిసికి ఓలెక్ట్రా తొలి ఇవి బస్ డెలివరీ

- 50 వాహనాలను అందించనున్న కంపెనీ



హైదరాబాద్ : దక్షిణాదిలోనే తొలి ఇంటర్ సిటీ ఎలక్ట్రిక్ బస్సు శనివారం బెంగళూరులో ప్రారంభమైంది. 12 మీటర్ల ఓలెక్ట్రా ప్రీమియం లగ్జరీ ఎలక్ట్రిక్ బస్సు సర్వీసును కర్ణాటక రవాణా శాఖ మంత్రి బి శ్రీరాములు లాంచనంగా ప్రారంభించారు. ఎయిర్ కండిషన్డ్, ఒలెక్ట్రా ఇ-బస్ ప్రీమియం లగ్జరీ ఎలక్ట్రిక్ బస్సు ఆవిష్కరణ కార్యక్రమంలో కెఎస్‌ఆర్‌టిసి చైర్మన్ ఎం చంద్రప్ప, ఎండి వి అన్బు కుమార్, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓలెక్ట్రా సిఎండి కెవి ప్రదీప్ మాట్లాడుతూ.. "దేశంలో 2021లో ఇంటర్‌సిటీ ఎలక్ట్రిక్ లగ్జరీ కోచ్ బస్సులను ప్రవేశపెట్టిన మొదటి కంపెనీ తమదేనని అన్నారు. "మేక్ ఇన్ ఇండియా" ద్వారా, ఓలెక్ట్రా ఫేమ్ 2 పథకం కింద 50 ఎలక్ట్రిక్ బస్సులను సరఫరా చేస్తుందని అన్నారు. ఈ ఇ-బస్సులు రాష్ట్రవ్యాప్తంగా ప్రతిరోజూ 7 డిపోల నుండి బయలుదేరుతాయి. ఇది ప్రజా రవాణాలో ఒలెక్ట్రా ప్రస్థానాన్ని మరింత బలోపేతం చేస్తుందని అన్నారు. ట్రాఫిక్, ప్రయాణికుల సంఖ్యా ఆధారంగా ఇ-బస్సులు ఒకే ఛార్జ్‌పై 300 కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తాయన్నారు.

రూ.2వేల కోట్ల టర్నోవర్ లక్ష్యం

- మూవర్స్.కమ్ సిఇఒ వెల్లడి



హైదరాబాద్ : వచ్చే నాలుగేళ్లలో రూ.2వేల కోట్ల టర్నోవర్ సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మూవర్స్.కమ్ వ్యవస్థాపకులు, సిఇఒ విద్యాధర్ గారపాటి అన్నారు. రీలొకెటెడ్ (పునరావాస) పోర్టల్ మూవర్స్.కమ్‌ను నిర్వహిస్తున్న ఈ సంస్థ హైదరాబాద్‌లో 20వ వార్షికోత్సవాన్ని నిర్వహించుకుంది. ఈ సందర్భంగా విద్యాధర్ మాట్లాడుతూ.. మూవర్స్.కమ్ లీడ్ అగ్రిగేటర్ నుంచి రీలొకేషన్ మేనేజ్‌మెంట్ కంపెనీగా మారడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. గత రెండు దశాబ్దాల్లో 35 లక్షల మంది వినియోగదారులకు సేవలందించామన్నారు. అపార్ట్‌మెంట్‌లోని ఒక గదిలో ప్రారంభమై తమ సంస్థ ఇప్పుడు 75 సిబ్బంది గల కంపెనీగా ఎదిగిందన్నారు. ఏడాదికి రూ.165 కోట్ల టర్నోవర్‌ను నమోదు చేస్తుందన్నారు. దేశంలోని ఇతర ప్రాంతాలకు తన కార్యకలాపాలను విస్తరించాలని కూడా యోచిస్తోందన్నారు. వద్ధికి చాలా అవకాశాలు ఉన్నాయన్నారు. అదే విధంగా బీమా, గృహ మెరుగుదల, గృహ భద్రత మొదలైన క్రాస్ సెల్లింగ్ సేవలలోకి ప్రవేశించడంపై దృష్టి కేంద్రీకరిస్తున్నామన్నారు.

కోవిడ్ కట్టడిలో కొత్త దశలోకి చైనా

- సమైక్యంగా వుండాలని జిన్‌పింగ్ పిలుపు

బీజింగ్ : కరోనా వేళ ప్రజల ప్రాణాలను కాపాడడానికే అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నది చైనా విధానమని అధ్యక్షులు జీ జిన్‌పింగ్ చెప్పారు. కొత్త సంవత్సరం 2023 లోకి ప్రవేశిస్తున్న సందర్భంగా శనివారం ఆయన టివిలో జాతినుద్దేశించి ప్రసంగించారు. కరోనా మహమ్మారి పట్ల దృక్పథంలో 'కొత్త దశ' లోకి ప్రవేశిస్తున్నందున మరింత ఐక్యత, కృషి అవసరమని పిలుపిచ్చారు. కోవిడ్‌కు వ్యతిరేకంగా సాగిన పోరులో అనూహ్యంగా ఎదురైన కష్టాలను, సవాళ్ళను చైనా విజయవంతంగా అధిగమించిందని పేర్కొన్నారు. అవసరమైన పరిస్థితులు తలెత్తినపుడు ఆ సమయం ఆసన్నమైనపుడు కరోనా విధానాలు గరిష్ట స్థాయిలో తీసుకున్నట్లు తెలిపారు. జీరో కోవిడ్ విధానాన్ని రద్దు చేసిన తర్వాత కోవిడ్ కట్టడి కొత్త విధానాలకు సంబంధించి జిన్‌పింగ్ బహిరంగంగా వ్యాఖ్యలు చేయడం ఇదే ప్రథమం. దాదాపు మూడేళ్ళుగా అనుసరిస్తూ వచ్చిన మూకుమ్మడి పరీక్షలు, కేంద్రీకృత క్వారంటైన్, లాక్‌డౌన్ వంటి చర్యల ప్రాతిపదికన కఠినంగా జీరో కోవిడ్ విధానాన్ని అమలు చేసిన చైనా ఆ తర్వాత ఆ విధానాన్ని రద్దు చేసింది.

ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్‌ను వేర్వేరుగా నిర్వహించండి : ట్రస్మ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పదో తరగతి పరీక్షలను 11 నుంచి 6 పేపర్లకు కుదించడం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ట్రస్మ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు యాదగిరి శేఖర్‌రావు, ప్రధాన కార్యదర్శి ఎస్ మధుసూదన్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పూర్తి భిన్నమైన సబ్జెక్టులైన ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్ పరీక్షలను వేర్వేరు తేదీల్లో నిర్వహించాలని కోరారు. ప్రశ్నాపత్రాలలో రెండు, మూడు మార్కుల సెక్షన్లలో అదనపు ప్రశ్నలను జోడించి వాటికి కూడా ఛాయిస్ ఇచ్చేలా చూడాలని తెలిపారు. సమయాభావ పరిస్థితులను అర్థం చేసుకుని నాలుగు మార్కుల ప్రశ్నల సంఖ్య తగ్గించాలని పేర్కొన్నారు.



వ్యవసాయ కార్మికుల్లో ప్రశ్నించే ధైర్యాన్ని నింపాలి

రాజకీయ చైతన్యం కల్పించాలి

- ప్రభుత్వ పథకాలపై పాలకులను నిలదీయాలి
- క్షేత్రస్థాయి నుంచి వ్యవసాయ కార్మిక పోరాటాలు ఉధృతం కావాలి
- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎంపీ తమ్మినేని వీరభద్రం

ఖమ్మం నుంచి నవ తెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

వ్యవసాయ కార్మికుల్లో ప్రశ్నించే ధైర్యాన్ని నింపాలనీ, వారికి ఏ సమస్య వచ్చినా వ్యవసాయ కార్మిక సంఘం ముందుండి పోరాడాలని రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎంపీ తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. ఖమ్మంలోని వేదగిరి శ్రీనివాసరావు నగర్(భక్తరామదాసు కళాక్షేత్రం)లోని అమరవీరుల ప్రాంగణంలో జరుగుతున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలో ఆయన శనివారం ప్రసంగించారు. గ్రామాల్లో వారు ఆత్మగౌరవంతో బతికేలాగా రాజకీయ చైతన్యం కల్పించాలని సూచించారు. ఆర్థిక పోరాటాలపై పరిమితం చేయకుండా సామాజిక, సాంస్కృతిక పోరాటాల్లో కలిసి వచ్చేలాగా కషి చేయాలన్నారు. కూలీల్లో కుల,మత, ఎక్కువ, తక్కువ అనే భావనను పోగొట్టాలన్నారు. వారంతా ఒక్కతాటిపైకి వచ్చి పోరాడేలా చైతన్యపరచాలన్నారు. ప్రతి పోరాటం వర్గ పోరాటం కాదన్నారు. గ్రామాల్లో భూస్వాములు చేతుల్లో ఉన్న మిగులు భూములను వెలికి తీసి పేదలకు పంచేలాగా పోరాటం చేయాలన్నారు. వర్గ పోరాటాల ద్వారానే ఉద్యమాలు బలపడతాయన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ఒక వర్గ పోరాటం అన్నారు. ఆనాడు భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడి లక్షలాది ఎకరాల భూమిని పేదలకు పంచడం వల్లనే నేటికీ ఆ పోరాటం స్ఫూర్తిదాయకంగా ఉందన్నారు. అలాంటి పోరాటాలు నేడు చేయాల్సిన అవసరం ఉందని ఆకాంక్షించారు. బిజెపి అనుబంధ సంఘాలు స్వతంత్రంగా తమ భావజాలాన్ని ప్రజల్లోకి ఎక్కిస్తున్నాయన్నారు. దీన్ని వ్యవసాయ కార్మిక సంఘం తిప్పి కొట్టేలాగా కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. పోడు భూముల సమస్య పరిష్కారం కోసం పోరాటాలను ఉధృతం చేయాలన్నారు. ఇతర ప్రజా, వ్యవసాయ కార్మిక సంఘాలను కలుపుకొని ఐక్య పోరాటాలను నిర్మించాల్సిన ఆవశ్యకత ఉందని నొక్కిచెప్పారు.

మహిళల అణచివేత తీవ్రం : మల్లు లక్ష్మి

కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలపై దాడులు, లైంగిక దాడులు తీవ్రం అయ్యాయని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలో ఆమె సౌహార్ద్ర సందేశాన్ని ఇచ్చారు. మనుస్మృతిని తీసుకొచ్చి మళ్లీ మహిళలను వంటింటికి పరిమితం చేసే తిరోగమన విధానాల వైపు బీజేపీ నాలన ఉందని విమర్శించారు. వ్యవసాయ కూలీల్లో మహిళలే ఎక్కువ అన్నారు. ఖమ్మంలో జరిగిన బహిరంగ సభ విజయవంతం అయిందనీ, పేదలు కమ్యూనిస్టుల వైపు ఉంటారని నిరూపితం అయిందని తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం చేసే పోరాటాల్లో తమ వంతు సహకారం ఉంటుందని హామీనిచ్చారు.

రిజర్వేషన్లను ఎత్తివేసే కుట్ర : స్కైలాబ్‌బాబు

దేశంలో రిజర్వేషన్లను ఎత్తివేసే కుట్రకు మోడీ సర్కారు పూనుకున్నదని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు విమర్శించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలనుద్దేశించి ఆయన శనివారం సౌహార్ద్ర సందేశాన్ని ఇచ్చారు. రిజర్వేషన్లను ఎత్తివేస్తే ఎక్కువగా నష్టపోయేది వ్యవసాయ కార్మికులేనన్నారు. రాష్ట్రంలో 76 కులదురంహకారం హత్యలు జరిగాయన్నారు. మరోవైపు ఉత్తర తెలంగాణలోని నిజామాబాద్, నిర్మల్, కామారెడ్డి, తదితర జిల్లాల్లో వీడీసీల పేరుతో దళితులను అణచివేస్తున్న, గ్రామ బహిష్కరణ చేస్తున్న తీరును వివరించారు. వ్యవసాయ కార్మిక సంఘం చేసే పోరాటాల్లో కేవీపీఎస్ కూడా కలిసి వస్తుందని హామీనిచ్చారు.

వలస పక్షుల్లా వ్యవసాయ కార్మికులు..

- కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులను అమలు చేయాలి
- ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు దడాల సుబ్బారావు

ఖమ్మం నుంచి నవ తెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

తెలంగాణలో చేస్తున్నట్టు ఏపీలోనూ 245 కేంద్రాల్లో 40 వేలకు పైగా ఎకరాల్లో భూ పోరాటం చేస్తున్నామని ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు చెప్పారు. ఏపీలో పాలకులు అనుసరిస్తున్న విధానాలు, యాంత్రీకరణతో వ్యవసాయ కార్మికులు వలస పక్షుల్లా మారిపోయారని వాపోయారు. ఖమ్మంలోని వేదగిరి శ్రీనివాసరావు నగర్(భక్తరామదాసు కళాక్షేత్రం)లోని అమరవీరుల ప్రాంగణంలో జరుగుతున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలో ఆయన శనివారం ప్రసంగించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో కోటి 20 లక్షల ఎకరాల మిగులు భూమి ఉందని దాన్ని పేదలకు పెంచాలని కోనేరు రంగారావు కమిటీ సూచించిందని తెలిపారు. ఆ కమిషన్ సిఫారసులను వెంటనే అమలుపరచాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులు కూలిపోరాటాలకు ఆటంకంగా మారుతున్నాయని చెప్పారు.

వ్యవసాయ కూలీలకు కనీస వేతన చట్టం అమలు చేయాలి

పలు కమిషన్ల రిపోర్టులను సమర్పించిన కమిటీలు

ఖమ్మం నుంచి నవతెలంగాణ ప్రతినిధి

వ్యవసాయ కూలీలకు కనీస వేతనాల చట్టాన్ని అమలు చేయాలనీ, వాటి కోసం పోరాటాలను ఉధృతం చేయాలని రాష్ట్ర మహాసభ నిర్ణయించింది. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మూడో మహాసభలో పలు కమిషన్‌లను మహాసభ ముందు పెట్టారు. వేతన కమిషన్‌ను ఆ సంఘం రాష్ట్ర నాయకులు సాంబశివ మహాసభలో ప్రవేశపెట్టారు. వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పులు, వలస కార్మికులు, తదితర కారణాల వల్ల వ్యవసాయ కూలీల పనిదినాలు తగ్గిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. నాట్లు, కోతల సమయంలో తప్ప కూలీల కొరత అనేదే ఉండట్లేదన్నారు. సగటున ఒక్కో వ్యవసాయ కార్మికునికి 100 నుంచి 120 రోజుల పనిదినాలే దక్కుతున్నాయని చెప్పారు. భూ సమస్యల కమిషన్ రిపోర్టును మచ్చా వెంకటేశ్వర్లు సమర్పించారు. పోడు భూముల హక్కు పత్రాల కోసం పోరాటాలను ఉధృతం చేయాలన్నారు. ధరణి పోర్టల్ సమస్య తీవ్రంగా ఉందని చెప్పారు. భూపోరాటాలను తీవ్రం చేయాలని సూచించారు. ఉపాధి హామీ చట్టంపై బత్తుల వెంకటేశ్వర్లు కమిషన్‌ను ప్రవేశపెట్టారు. ఆ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రం నిధులను తగ్గిస్తూ పోతున్నదనీ, అమలు విషయంలో అనేక కొర్రీలు పెడుతూ తెలంగాణ అన్యాయం చేస్తున్నదని చెప్పారు. ఆ చట్టాన్ని రక్షించుకునేందుకు పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. పెండింగ్ వేతనాల విడుదల కోసం పోరాటాలు చేయనున్నట్టు తెలిపారు. సేవా, సాంస్కృతిక రంగాల్లో వ్యవసాయ కార్మిక సంఘం మునుముందు చేయాల్సిన కార్యక్రమాల గురించి చెబుతూ కమిషన్‌ను గడ్డం స్వామి ప్రవేశపెట్టారు. మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ప్రచారం చేయాలన్నారు. గ్రామాల్లో చాపకింద నీరులా విస్తరిస్తున్న మనువాద భావజాలాన్ని ఎక్కడికక్కడ అడ్డుకట్ట వేయడంలో వ్యవసాయ కార్మిక సంఘం తన వంతు పాత్ర పోషించాలన్నారు. సాంస్కృతిక రంగంలోనూ వర్గపోరాటం చేయాలన్నారు. సామాన్య సమస్యలపై కమిషన్‌ను సమర్పిస్తూ జగన్ మాట్లాడారు. మోడీ సర్కారు హయాంలో పెరుగుతున్న నిత్యావసర ధరలు, తగ్గుతున్న నిజవేతనాలతో వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. నిర్మాణరంగ కమిషన్‌ను కొండమడుగు నర్సింహ్మ, సోషల్‌మీడియా కమిషన్‌ను శ్రీనివాసరావు సమర్పించారు. మహిళల సమస్యలపై వినోద కమిషన్‌ను ప్రవేశపెడుతూ మాట్లాడారు. సమాన పనికి సమాన వేతనం ఎక్కడా అమలు కావడం లేదన్నారు. కూలిరేట్ల విషయంలో మహిళలకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదని చెప్పారు. పనిప్రదేశాల్లో మహిళలపై దాడులు జరుగుతున్న తీరుపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశాలపై సుదీర్ఘ పోరాటాలు చేయాలని మహాసభ నిర్ణయించింది.

నూతన విద్యావిధానంతో అందరికీ విద్య అందదు

ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



ఖమ్మం నుంచి నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యావిధానంతో అందరికీ విద్య అందదని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. ఖమ్మంలోని వేదగిరి శ్రీనివాసరావు నగర్ లోని అమరవీరుల ప్రాంగణం లో జరుగుతున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మూడో మహాసభలో ఆయన మాట్లాడారు. ఒకటెంద్రు రూముల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ, బాలింతలకు, గర్భిణీలకు ఆహారం అందించడం, వంట చేయడం ఎలా సాధ్యం అవుతుందని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ తర్వాత అత్యధిక జాబ్‌చార్టు ఉన్నదని బహుశా అంగన్‌వాడీకేనని చెప్పారు. ఇప్పటివరకు నిబంధనలకు విరుద్ధంగా ప్రయివేటు రంగంలో కొనసాగుతున్న పూర్వప్రాథమిక విద్య చట్టబద్ధం చేసి కార్పొరేట్లకు అప్పగించే యత్నంలో భాగంగానే నూతన విద్యావిధానం వచ్చిందన్నారు. పాఠ్యపుస్తకాల్లో చరిత్రను వక్రీకరించి రాయడం దుర్మార్గమన్నారు. అందరికీ ఒకే గౌరవం అనేది దేశంలో ఎక్కడ అమలవుతున్నదని ప్రశ్నించారు. మనకు తెలియకుండానే నూటికి 90 శాతం ప్రయివేటు పాఠశాలల్లో మనువాద భావజాలాన్ని విద్యార్థులకు జొప్పిస్తున్న పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ పోస్టులను భర్తీ చేయకుండా, మౌలిక సదుపాయాలు కల్పించకుండా మెరుగైన విద్య అందించడం ఎలా సాధ్యం అవుతుందని పాలకులను నిలదీశారు. ప్రభుత్వ విద్య, వైద్య వ్యవస్థలను కాపాడుకునేం దుకు జరుగుతున్న పోరాటాల్లో వ్యవసాయ కార్మిక సంఘం కూడా కలిసి రావాలని పిలుపునిచ్చారు. బస్తీదవాఖానాల పేరుతో హడావిడి చేయడం మానేసి ప్రతి పీహెచ్‌సీలోనూ ముగ్గురు డాక్టర్లను పెట్టి 24 గంటలు పనిచేసేలా చేయాలని పాలకులను డిమాండ్ చేశారు. దేశంలో కొత్తవాటి పేరుతో ఉన్న హక్కులను కాలరాస్తున్న పరిస్థితి ఉందని చెప్పారు.

ఓయూ అభివృద్ధిలో పూర్వ విద్యార్థులు

- ఓయూ వీసీ ప్రొ. రవీందర్ యాదవ్
- యూనివర్సిటీలో యాంఫీ థియేటర్‌కు శంకుస్థాపన



నవతెలంగాణ-ఓయూ

ఓయూ అభివృద్ధికి పూర్వ విద్యార్థులు ముందుకు రావటం అభినందనీయమని వీసీ ప్రొఫెసర్ రవీందర్‌యాదవ్ అన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో డా.గుర్రం నాగయ్య ఓపెన్ ఎయిర్ థియేటర్ త్వరలో అందుబాటులోకి రానుంది. ఓయూ పూర్వ విద్యార్థి, సిద్ధార్థ గ్రూప్ విద్యాసంస్థల చైర్మెన్ డా.నాగయ్య తన పేరు మీద 'యాంఫీ థియేటర్' నిర్మించేందుకు ముందుకొచ్చారు. ఈ మేరకు ఠాగూర్ ఆడిటోరియం పక్కనే ఈ థియేటర్ నిర్మించేందుకు వీసీ రవీందర్ యాదవ్, రిజిస్ట్రార్ ప్రొ. పి.లక్ష్మీనారాయణ, డాక్టర్ నాగయ్యతో కలిసి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నాగయ్య మాట్లాడుతూ.. సుమారు రూ.50 లక్షలతో ఈ నిర్మాణం చేపడుతున్నామని వెల్లడించారు. తనకు విద్యాబుద్ధులు నేర్పి తనను ఇంతటివాడిని చేసిన ఓయూకు తిరిగి ఏదైనా చేయాలనే కోరిక ఉండేదని, ఓపెన్ ఎయిర్ థియేటర్ కట్టేందుకు అవకాశం వచ్చినందుకు ఆనందంగా ఉందని అన్నారు. వీసీ రవీందర్‌యాదవ్ మాట్లాడుతూ.. పూర్వ విద్యార్థులు ఉస్మానియా అభివృద్ధికి ముందుకు రావటం సంతోషంగా ఉందన్నారు. గ్లోబల్ అలుమ్నీ మీట్‌కు ముందే ఓపెన్ ఎయిర్ థియేటర్ నిర్మాణానికి డాక్టర్ జి.నాగయ్య ముందుకు రావటం తొలి మెట్టని చెప్పారు. ఇంకా ఎంతో మంది ఉన్నత శిఖరాలు అధిరోహించారని, అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ ఉస్మానియా పునఃవైభవానికి తోడ్పాటును అందించాలని కోరారు. ఈ సందర్భంగా నాగయ్యను అభినందించారు. ఉస్మానియా సమగ్ర అభివృద్ధికి నాగయ్య లాంటి వ్యక్తులు ముందుకు వస్తున్నారని, గ్లోబల్ అలుమ్నీ మీట్ ద్వారా దశాబ్దాలుగా ఎక్కడెక్కడో స్థిరపడిన పూర్వ విద్యార్థులు కలుసుకోవాలని రిజిస్ట్రార్ ప్రొ. లక్ష్మీనారాయణ అన్నారు. విద్యార్థులకు మౌలిక వసతుల అభివృద్ధి కోసం పూర్వ విద్యార్థులు చేయూతనివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్.సి.డి.సి డైరెక్టర్ ప్రొ.స్టీవెన్‌సన్, డాక్టర్ ప్రకాశ్ రెడ్డి, సిద్ధార్థ గ్రూప్ విద్యా సంస్థల డైరెక్టర్లు వంశీకృష్ణ, మోహన్ రావు, కార్తీక్, ప్రిన్సిపాల్ జి.గోవర్ధిని, త్రివేణి, సిద్ధార్థ్, పలువురు సీనియర్ అధ్యాపకులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

బైరి నరేష్‌పై భౌతిక దాడులు, అరెస్టులను ఖండించండి: కేవీపీఎస్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అశాస్త్రీయ పురాణ కథను విమర్శించినందుకు భారత నాస్తిక సమాజం నాయకుడు హేతువాది బైరి నరేష్, ఆయన మద్దతుదారులపై భౌతిక దాడులు చేయడమే గాక అక్రమంగా అరెస్ట్ చేయటాన్ని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవిపిఎస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాన్‌వెస్లీ, టి స్కైలాబ్‌బాబు శనివారం ఒక ప్రకటనలో ఖండించారు. భావ ప్రకటన స్వేచ్ఛను హరించే చర్యగా కేవీపిఎస్ భావిస్తున్నదని తెలిపారు. అయ్యప్ప స్వాములు ముసుగులో ఆర్ఎస్ఎస్, మత విద్వేషాలు రెచ్చగొట్టడానికి ఈ తరహా కుట్రలు చేస్తున్నదని పేర్కొన్నారు. ఆధ్యాత్మిక భావాలు ప్రబోధించే చిన్న జీయర్ స్వామి సమ్మక్క సారలమ్మలు అసలు దేవుళ్లే కారని కించపరుస్తూ మాట్లాడిన సంఘటనను గుర్తుచేశారు. అక్రమంగా అరెస్ట్ చేసిన బైరీ నరేష్ ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

పొదల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

- 15 మందికి తీవ్ర గాయాలు
- ప్రమాదం సమయంలో బస్సులో 45 మంది ప్రయాణికులు



నవతెలంగాణ-గండిపేట

ఆర్టీసీ బస్సుకు సడన్‌గా కారు అడ్డు రావడంతో బస్సు అదుపు తప్పి పొదళ్లలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో 15 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా బండ్లగూడ జాగిర్ కార్పొరేషన్ పరిధిలోని హైదర్ షాకోట్ విలేజ్‌కు సమీపంలోని టిప్పుఖాన్ బ్రిడ్జి వద్ద శనివారం జరిగింది. ప్రయాణికులు, స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెహిదీపట్నం డిపోకు చెందిన బస్సు మొయినాబాద్ మండలం చిన్న మంగళవారం నుంచి మెహిదీపట్నానికి వస్తోంది. బస్సులో మొత్తం 45 మంది ప్రయాణికులు ఉన్నారు. హైదర్‌షాకోట్ విలేజ్‌కు సమీపంలోకి రాగానే అకస్మాత్తుగా కారు అడ్డు వచ్చింది. వెంటనే అప్రమత్తమైన బస్సు డ్రైవర్ కారును తప్పించబోయి రోడ్డు దించాడు. ఈ క్రమంలో బస్సు రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి ఢీకొట్టి వెళ్లి పొదళ్లలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. బస్సు అద్దాలు పగలగొట్టుకుని ప్రయాణికులు బయటకు వచ్చారు. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, ట్రాఫిక్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని నగరంలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. అకస్మాత్తుగా కారు అడ్డు రావడం వల్లే బస్సును రోడ్డు కిందికి దించినట్టు డ్రైవర్ చెప్పాడు. కేసు దర్యాప్తులో ఉంది.

కార్పొరేట్ సేద్యం దేశానికి ప్రమాదం

అంబానికి వ్యవసాయం.. అదానికి గోదాములు

- ప్రాంతీయ పార్టీల వైఖరీపైనా చర్చిస్తున్నాం
- వ్యకాస పార్టీ కాదు.. రాజకీయాలకు అతీతం కాదు
- జర్నలిస్టుల సమస్యలపైనా మహాసభలో తీర్మానం
- ముదిగొండలాంటి మరో భూ పోరాటానికి సమాయత్తం : వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బి.వెంకట్, పక్కన తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు నాగయ్య, నున్నా, కనకయ్య తదితరులు

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ఆహార భద్రతను దెబ్బతీసి.. కార్పొరేట్ల చేతుల్లో వ్యవసాయాన్ని పెట్టేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని, అది దేశానికి అత్యంత ప్రమాదకరమని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐఏడబ్ల్యూయూ) ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ అన్నారు. కార్పొరేట్ వ్యవసాయం అంటే ధనికుల సాగు ఒక్కటే కాదు.. ఇప్పుడు ఇది అంబానీ వ్యవసాయం అన్నారు. భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)ని రద్దు చేస్తున్నామని అదానికి సంకేతం ఇవ్వడమే కాకుండా రూ.వేల కోట్లు గోదాముల నిర్మాణానికి సైతం రుణాలిచ్చారని ఆరోపించారు. భారత వ్యవసాయాన్ని కాపాడు కోవడంతోపాటు ఆహార భద్రతను నిలబెట్టుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మూడో మహాసభ ముగింపు సందర్భంగా శనివారం ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలోని వేదగిరి శ్రీనివాసరావు నగర్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

భారత రాజ్యాంగం ఉండాలని తాము కోరుకుంటుంటే.. దాని స్థానంలో ఆర్ఎస్ఎస్ ఎజెండా ఉండాలని బీజేపీ కోరుకుంటోందన్నారు. రాష్ట్రపతి భద్రాచలం వస్తే ప్రజాసంఘాల నాయకులు ఆమెను కలవకుండా వ్యవసాయ కార్మిక సంఘం సీనియర్ వర్కింగ్ కమిటీ మెంబర్ మచ్చా వెంకటేశ్వర్లును నిర్బంధించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పోడు భూములపై రాష్ట్రపతి స్పందించి వుంటే బాగుండేద న్నారు. రాజ్యాంగ ప్రథమ పౌరురాలిగా ఉన్న రాష్ట్రపతి విధులను సైతం బీజేపీ ఆటంకపరుస్తోంద న్నారు. అంటరానితనం నిర్మూలనకు కేరళలో దళితులను పూజారులుగా నియమించారని, ఇదే స్ఫూర్తితో తమిళనాడులోనూ నియమించిన విషయాన్ని ప్రస్తావించారు. వ్యవసాయంలో సాధించిన సమృద్ధిని దెబ్బతీసేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందన్నారు. విద్యుత్ బిల్లు విషయంలో ఆంధ్రప్రదేశ్ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆ రాష్ట్రాన్ని తాకట్టుపెట్టారని విమర్శించారు.

కార్పొరేట్ వ్యవసాయానికి వ్యతిరేకంగా ఫిబ్రవరి 20 నుంచి ఏప్రిల్ 5 వరకు దేశవ్యాప్త కాంపెయిన్ తీసుకుంటున్నామని తెలిపారు. దీనిలో భాగంగా తెలంగాణలో నాలుగు దశల్లో కాంపెయిన్ ఉంటుందన్నారు. దేశవ్యాప్తంగా పది కోట్ల కుటుంబాలను కలవాలని టార్గెట్‌గా పెట్టుకున్నా మన్నారు. తెలంగాణలో కనీసం 75 లక్షల కుటుం బాలను కలవాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని తెలిపారు. నెలరోజులపాటు పాదయాత్రలు చేస్తూ కార్పొరేట్ వ్యవసాయాన్ని రద్దు చేయాలి, వ్యవసాయ కార్మికులను కాపాడుకోవాలి, కార్మిక కోడ్‌లు రద్దు కావాలనే డిమాండ్‌తో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు తెలిపారు. మార్చిలో దేశవ్యాప్తంగా విస్తృతంగా సభలు నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ఏప్రిల్ 5న లక్షల మందితో 'మార్చ్ టూ పార్లమెంట్' చేపట్టనున్నట్టు చెప్పారు. వ్యవసాయం, భూములు, ఉపాధిహామీ చట్టాన్ని కాపాడుకోవడానికి ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. ప్రాంతీయ పార్టీల వైఖరీపైనా మహాసభలో చర్చిస్తున్నామన్నారు.

వ్యవసాయ కార్మిక సంఘం రాజకీయ పార్టీ కాదని, అయితే రాజకీయాలకు తాము అతీతం కాదన్నారు. తమ సంఘం ప్రధాన కర్తవ్యాల్లో కేంద్రంలో బీజేపీని ఓడించటం ఒకటన్నారు. ప్రాంతీయ పార్టీలు వ్యవసాయ కార్మికుల కొనుగోలు శక్తిని పెంచే చర్యలు చేపట్టడం లేదన్నారు. రెండెకరాల భూమి ఇవ్వండి.. రూపాయి బియ్యాన్ని వ్యవసాయ కార్మికులు వదులుకుంటారని చెప్పారు. ఇప్పటికీ తెలంగాణలో 28శాతం భూమి 2శాతంగా ఉన్న ధనికుల చేతిలో ఉందన్నారు. హైదరాబాద్‌లో ఉన్న కంపెనీకి ఖమ్మం జిల్లాలో ఐదెకరాలు ఎందుకని ప్రశ్నించారు. హైదరాబాద్ చుట్టూ ఉన్న 5 లక్షల ఎకరాలు ప్రస్తుతం రాజకీయ నాయకులు, పెట్టుబడిదారులకు చెందిన కంపెనీల చేతిలో ఉన్నాయన్నారు. కేసీఆర్, జగన్ కంపెనీలకు భూములు ఇస్తారా? పేదలకు ఇస్తారా? తేల్చాలని పాలకులను నిలదీశారు. ఏప్రిల్ 5వ తేదీ తర్వాతగానీ, ఆలోపుగానీ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ముదిగొండ తరహా మరో భూపోరాటానికి సిద్ధం చేస్తున్నామని చెప్పారు. భూపోరాటాలు, ఇండ్లస్థలాల పోరాటాలు, కూలి పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వం భూమిని పంచుతుందా? లేక తమని పంచుకోమంటారా? అని ప్రశ్నించారు. జర్నలిస్టుల సమస్యలపైనా మహాసభలో చర్చించినట్టు తెలిపారు. సీఎం కేసీఆర్ వెంటనే జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. సాగుదారులకే రైతుబంధు ఇవ్వాలని కోరారు. వ్యవసాయ కూలీలకూ కూలిబంధు పెట్టాలని డిమాండ్ చేశారు.

సాదాబైనామా మీద కొనుగోలు చేసిన భూములకు 58, 59 జీవో ప్రకారం పట్టాలు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాగయ్య డిమాండ్ చేశారు. రాష్ట్రంలో డబుల్‌బెడ్రూం ఇండ్లకు 40 లక్షల దరఖాస్తులు వస్తే ఇప్పటి వరకు 36వేలు మాత్రమే ఇచ్చారన్నారు. రాష్ట్రంలో 30 లక్షల మందికి ఇండ్లస్థలాలు లేవన్నారు. పేదలందరికీ భూములు పంచాలి, కనీస వేతనాల చట్టాన్ని సవరించాలి, రూ.600 కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం మహాసభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ఏఐఏడబ్ల్యూయూ కేంద్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు, నారి ఐలయ్య, రైతు సంఘం రాష్ట్ర నాయకులు నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు అన్నవరపు కనకయ్య, సీఐటీయూ నాయకులు బుగ్రి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు : చాడ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రజలకు సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణపై కక్ష ధోరణితో వ్యవహరిస్తున్నదని శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. తెలంగాణ ప్రజలకు ద్రోహం చేస్తున్నదని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో పేర్కొన్న ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదని పేర్కొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ స్థానాలు పెంచాలంటూ పార్లమెంటు చెప్పినా కేంద్రం పెంచడం లేదని తెలిపారు. ఈ ఏడాదిలోనైనా తెలంగాణ పట్ల కేంద్రం కక్షపూరిత వైఖరి మానుకుని హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు, కేంద్ర మంత్రులు తెలంగాణకు రావలసిన నిధుల కోసం, అభివృద్ధి పనుల కోసం కేంద్రంపై ఒత్తిడి పెంచాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా స్థానిక సంస్థలకు విధులు, నిధులు వెంటనే ఇవ్వాలని, పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

బైరి నరేష్‌కు 14 రోజుల రిమాండ్

- పరిగి సబ్ జైల్‌కు తరలింపు
- జైల్ వద్ద ఉద్రిక్తత, అయ్యప్ప స్వాములను అడ్డుకున్న పోలీసులు



నవతెలంగాణ-కొడంగల్, పరిగి

అయ్యప్ప స్వాములపై అనుచిత వ్యాఖ్యలు చేసిన భారత నాస్తిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు బైరి నరేష్‌కు వికారాబాద్ జిల్లా కొడంగల్ కోర్టు జడ్జి 14రోజుల రిమాండ్ విధించారు. అతన్ని పరిగి సబ్ జైలుకు తరలించారు. పరిగి సీఐ, కొడంగల్ ఎస్ఐ రవిగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. కొడంగల్ మండలం రావులపల్లి గ్రామంలో అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములపై బైరి నరేష్ అనుచిత వ్యాఖ్యలు చేశాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో బైరి నరేష్‌పై చర్యలు తీసుకోవాలని అయ్యప్ప స్వాములు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేశారు. దీంతో శుక్రవారం బైరి నరేష్‌పై 153ఏ, 295ఏ, 298, 505 సెక్షన్ల కింద కొడంగల్ పోలీసులు కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న బైరి నరేష్‌ను అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు నాలుగు టీంలను ఏర్పాటు చేశారు. వరంగల్ జిల్లా జనగామలో శనివారం ఆయనను అరెస్టు చేశారు. అక్కడి నుంచి కొడంగల్‌కు తరలించారు. బైరి నరేష్‌తోపాటు అంబేద్కర్ యువజన సంఘం రావులపల్లి గ్రామ అధ్యక్షులు హనుమంతును కోర్టులో హాజరుపరిచారు. వీరికి కోర్టు జడ్జి 14 రోజుల రిమాండ్ విధించారు. భారీ బందోబస్తు మధ్యన పోలీసులు వారిని పరిగి సబ్‌జైల్‌కు తరలించారు.

పరిగి సబ్‌జైల్ వద్ద ఉద్రికత్త

బైరి నరేష్‌ను సబ్ జైల్‌కు తరలించే క్రమంలో జైల్ వద్ద ఉద్రికత్త నెలకొంది. పోలీసులు కొడంగల్ నుంచి పరిగి జైల్‌కు తీసుకొచ్చే క్రమంలో అయ్యప్ప స్వాములు ఆందోళనలు చేశారు. బైరి నరేష్‌ను తమకు అప్పగించాలని జైలు గేటు ఎదుట నిరసన వ్యక్తం చేస్తూ చొచ్చుకొచ్చే ప్రయత్నం చేశారు. అప్రమత్తమైన పోలీసులు వారిని అడ్డుకున్నారు.

సంపాదకీయం

కొత్త ఆచరణలోకి...

మనసకే ఈ కొత్తవన్నీ, నూతన ఆలోచనలకు వేసుకునే ప్రణాళికలన్నీ, ఒక గీతను, ఒక వత్సరాన్ని దాటి మరో అడుగు కొత్తగా వేయాలని, మళ్లీ మళ్లీ మనల్ని మనం పునర్విమర్శించుకుని, వివేచించుకుని పునర్లిఖించుకుంటాం కొత్త భావాల తోరణాలు కట్టుకుని. ఇది మనుషులుగా మనకే దక్కిన అవకాశం. ఆశల్నీ కలల్నీ పండించుకునే కృషి

> మనం కొత్త సంవత్సరంలోకి అడుగుపెడుతున్నాము. ఇది కేవలం రాజకీయ సమస్యనే కాదు, మనందరి బతుకు సమస్య భవిష్యత్తు సమస్య. అయితే ఈ సవాళ్లపై ప్రతిఘన కూడా మొదలవుతున్నది. రైతులు, కార్మికులు, పేద ప్రజలు, ఉద్యోగులు, సామాన్యులూ పోరాటంలోకి వస్తున్నారు. ఈ సమాజ దుష్టత్వంపై సమరం సాగించే సంవత్సరంగా నూతన సంవత్సరానికి ఆహ్వానం పలుకుదాం. మన భవిష్యత్తు మన చేతుల్లోనేవుంది. పదండి ముందుకు!

వలులం మనమే. ఆకాంక్షల నెరవేర్చుకోనేందుకు అడుగులు వేసే ఆచరణా మనదే. కాలం కదలుతూ ఉంది. ప్రకృతీ కదులుతోంది. వీటితో పాటుగానే సమాజమూ చలనంలోనే ఉంది. ఈ చలనంలోని మార్పులను అవగాహన చేసుకునే మేధస్సును కలిగున్నదీ మనమే. అందుకే ఈ మూల్యాంకనాలు, మళ్లీ కొత్తగా మొదలవ్వడాలు. పరిణామాల పరిశీలనలో పాఠం, జ్ఞాన రూపమై మేల్కొంటుంది. కొత్త అడుగును కంటుంది. అంతిమంగా ఆచరణే మనిషి మనుగడను నిలబెడుతుంది.

ట్వంటీ ట్వంటీత్రీలోకి అడుగుపెడుతున్న సందర్భాన మళ్లీ ఒకసారి మన స్థితిని మననం చేసుకోవాలి. అప్పుడు మాత్రమే భవిష్యత్తును ఎలా తీర్చుకోవాలో ఎరుకపడుతుంది. కాలం సహజమైనది. ప్రకృతీ సహజమైనదే. కానీ సమాజం మనం నిర్మించుకున్నది. మనకు మనమే మార్చుకొంటున్నది. అది బాగున్నా బాగాలేకపోయినా అది మన చైతన్య ఫలితం. ఇప్పుడు మనకెదురయ్యే సవాళ్లను ఎలా ఎదుర్కోవాలో తెలియాలి. ఒక ఉన్నత మానవ జీవనం సాగించడానికి సమాజాన్ని ఎలా నిర్మించుకోవాలో తెలియాలి. అందుకోసం ఆలోచన చేసే సందర్భమే కొత్త ఏడాది ఆరంభ దినం. అందరం మంచి జరగాలనే కోరుకుంటాం. ఆశలు నెరవేరాలని, చదువులో ఉత్తీర్ణులవ్వాలని, ఉద్యోగం దొరకాలని, ఆరోగ్యం బాగుండాలని, దారిద్ర్యాలు పోవాలని, హింసా విధ్వంసాలులేని ప్రశాంత జీవనం గడపాలని, యుద్ధం ముగిసి శాంతి వెల్లివిరియాలని, మమతానురాగాలు, మానవీయ పరిమళాలు ప్రసరించాలని, ప్రేమ గెలవాలని, సత్యం విజయం పొందాలని... ఇలా అన్నీ జరగాలనే మనం కోరుకుంటాము. కానీ ఇవన్నీ యేండ్లుగా ఎందుకు సాధించలేకపోయామనే ఆలోచనా చేయాలి. కొందరికి కొన్ని సమకూరి ఉండవచ్చు. ఇంకొందరికి అనుకున్న దానికంటే ఎక్కువా దక్కవచ్చు. కానీ దక్కనివాళ్లే అధికం. దుఃఖమే అధికం, బాధలే అధికం, కన్నీళ్లే అధికం. మనకు దక్కాల్సిన సంతోషాలను, ఆనందాలను ఎవరో తన్నుకుపోతున్నారే విషయాన్ని తెలుసుకోవాలి. గత సంవత్సరాలలో – దేశంలో కరోనా, ఆర్థిక సంక్షోభాల కారణంగా జీవితాలు అతలాకుతలమైపోయాయి. నిరుద్యోగం పెరిగింది. పనికోల్పోయాము.. అసమానతలు పెరిగాయి. ద్రవ్యోల్బనం పెరిగి రూపాయి విలువ దారుణంగా పడిపోయింది. దేశానికి అన్నం పెట్టే రైతన్న



గొంతుకు ఉరితాళ్ళు ముసురుకున్నాయి. దారిద్ర్యం పెరిగింది. ఆకలి పెరిగింది. అనారోగ్యమూ పెరిగింది. నేరం పెరిగింది. అణచివేత, ప్రకృతి విధ్వంసమూ పెరిగింది. మరో ప్రక్కన సంపదంతా ఒకవైపునకు పోగుపడుతున్నది. ఒక్కశాతంగా ఉన్న జనాభా దగ్గర నలభైశాతం సంపద పోగుపడింది. గౌతమ్ ఆదానీ ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద సంపన్నుడుగా ఎదిగాడు. బడా కార్పొరేటు సంస్థలకు పదిలక్షల కోట్ల రూపాయల రుణాలను ప్రభుత్వం రద్దు చేసి, వారిని కాపాడుకున్నారు. కానీ రైతులు అప్పులతో తిప్పలు పడుతున్నారు. ప్రజలు నిర్మించుకున్న ప్రభుత్వ సంస్థలను ప్రయివేటుకు అప్పనంగా అప్పజెపుతున్నది. ధనవంతులకు దోచిపెడుతూ పేదల, అశేష ప్రజలపై భారాలను ప్రభుత్వాలు మోపుతున్నాయి.

ఈ చర్యలే సమాజంలో అశాంతికి, అలజడికి కారణమవుతున్నది. వీటిపై మాట్లాడటమో, పరిష్కరించడమో చేయకుండా పాలకులు కబుర్లు చెబుతున్నారు. ఉద్వేగాలను రెచ్చగొట్టి ప్రజల మధ్య విభజనను సృష్టిస్తున్నారు. సాంస్కృతిక జీవనంపైన దాడులను నిర్వహిస్తున్నారు. మనదేశ రాజ్యాంగ సూత్రాలను, విలువలను తుంగలో తొక్కుతున్నారు. 'నూతన భారతం' అనే అందమైన నినాదంతో మెజారిటీ వాదాన్ని ముందుకు తెచ్చి భిన్నత్వంలో ఏకత్వమనే భారతీయ జీవన సారాన్ని ధ్వంసమొనరుస్తున్నారు. ఇక న్యాయదేవత కండ్ల మూతతోపాటు నోటినీ కట్టేస్తున్నారు. ఎన్నికలు, ప్రజాస్వామ్యం ఒక ఈవెంట్ మేనేజ్‌మెంట్‌గా మార్చేసారు. ఓటు, నాయకుడు, ప్రభుత్వము అన్నీ ఇప్పుడు సరుకుగా మారిపోయి, అమ్మకాలు, కొనుగోళ్లుగా మారిపోయాయి. ఇప్పుడు నిలిచి వెలుగుతున్నది జ్ఞానం కాదు, ధనమూ, మత ద్వేషమూ.

ఈ పరిస్థితుల నుండి మనం కొత్త సంవత్సరంలోకి అడుగుపెడుతున్నాము. ఇది కేవలం రాజకీయ సమస్యనే కాదు, మనందరి బతుకు సమస్య భవిష్యత్తు సమస్య. అయితే ఈ సవాళ్లపై ప్రతిఘన కూడా మొదలవుతున్నది. రైతులు, కార్మికులు, పేద ప్రజలు, ఉద్యోగులు, సామాన్యులూ పోరాటంలోకి వస్తున్నారు. ఈ సమాజ దుష్టత్వంపై సమరం సాగించే సంవత్సరంగా నూతన సంవత్సరానికి ఆహ్వానం పలుకుదాం. మన భవిష్యత్తు మన చేతుల్లోనేవుంది. పదండి ముందుకు!

2023 స్వాగతగీతం... చైతన్య ప్రభాతం

కరిగిపోయిన కాలానికి వీడ్కోలు... అరుదెంచే రోజులకు ఆహ్వానం... ఇదో నిరంతర ప్రక్రియ. ప్రవాహం. కాలం విసిరే సవాళ్లకు జవాబు కూడా కాలమే. కాలమంటే కార్యాచరణే. మన కార్యక్రమాలే. ఎవరు కదలినా లేకున్నా కాలం కదలిపోతుంటుంది. గతవారం ముగిసిన 2022ను సమీక్షించుకుంటే ఈ వారం రాబోయే 2023ను స్వాగతించాలి. ఎలావుంటుందో అంచనా వేసి ఎలావుండాలో నిర్వచించుకోవాలి. నిర్ణయించుకోవాలి. "మంచి గతమున కొంచెమేనేయ్ మందగించక ముందుకడుగెయ్" అన్న గురజాడ మాటలైనా "పదండిముందుకు" అని చెప్పే శ్రీశ్రీ కవిత్వమైనా సందేశమదే. మనుషులు ఎప్పుడూ గతం కన్నా భవిష్యత్తు బాగుండాలని ఆశిస్తారు. అందుకోసం యథాశక్తి అడుగులు వేస్తారు. ఆశ ఆత్మవిశ్వాసం ఆశయబద్ధమైన ఆచరణ ఇవే మానవాళిని ముందుకు నడుపుతాయి. అందుకే ప్రపంచమంతా 2023 ఆగమన వేడుకలు చూస్తాం. అయితే ఈ వేళలో మనదేశంలో మాత్రం మతఛాందస సంస్థలు ఇది మనకు సంబంధంలేని వ్యవహారమని ప్రకటిస్తున్నారు. నూతన సంవత్సర వేడుకలపై నిఘా వేస్తామంటున్నారు. 2022 ఏళ్లుగా సాగుతున్న వాటిని కాదని అంతకన్నా వెనక్కు వెళ్లాలనుకోవడం దేనికి సంకేతం? ఏవో సూక్తులు... సుభాషితాలు... వల్లించి మారేకాలంతో మనకు సంబంధంలేదని చెప్పడం, రాతియుగంలో పాతేయాల్సిన పాతకాలపు సరీసృపాలను నెత్తిన పెట్టుకోవడం దేశాన్ని ముందుకు నడిపించదు. ఇంకా ఇంకా ఇంకా వెనక్కు నెడుతుంది. ఇక్కడే మన కొత్త



తెలకపల్లి రవి

> అభ్యుదయం, ప్రజాస్వామ్యం లౌకిక తత్వం, సామ్యవాదం, శ్రామిక చైతన్యం వంటి మహత్తర ఆశయాలను అవహేళన చేస్తూ ఆలోచనా పరులను నిరుత్సాహ పరిచేందుకూ ప్రజలను తమ చుట్టూనే తిప్పుకోవడానికి పాలకవర్గాలు పొంచికూచుని ఉంటాయని గుర్తిస్తే ఇందులో ప్రతి అంశం ఎంత ముఖ్యమైందో బోధపడుతుంది. సరైన ప్రారంభమే సగం విజయం. "దేశమంటే మట్టి కాదోయ్... దేశమంటే మనుషులోయ్..." అన్నట్టే ఏడాది మొదట్లోనే సరైన దిశా నిర్దేశం చేసుకోగలిగితే దేశాన్ని సమాజాన్ని సంరక్షించుకోగల సత్తా సంతరించుకోగలం.

సంవత్సర కర్తవ్యాలు మొదలైపోయినట్టు చెప్పాలి. వాస్తవికతతో పొంతనలేని చాందసాలనూ వొంటెత్తు పోకడలను వదిలించుకోవడం మొదటి కర్తవ్యం.

విశాల భారత వికాసం

మతచాందసం అన్నాక ఒకటేవుండదు. భారతదేశం భిన్నమతాలకు విశ్వాసాలను నిలయం. పల్లె పట్టుల నుంచి పాలనా వ్యవస్థ వరకూ కూడా మతసామరస్యం మన దేశానికి దిక్సూచిగా నిలిచింది. హిందూ ముస్లిం తేడా లేకుండా ఉమ్మడి వేడుకలు ఇక్కడ సామరస్యాన్ని సహజీవనాన్ని చాటిచెప్పాయి. బ్రిటిష్‌వారి పాలనకుముందే ఇక్కడకు క్రైస్తవమూ ప్రవేశించింది. బౌద్ధం, జైనం, సిక్కు వంటివి అంతకుముందే ఉన్నాయి. ఈ భిన్న మతాల నిలయంగా ఈ దేశ సంస్కృతిని చరిత్రను అర్థం చేసుకోకపోతే ఈ దేశానికి భవిష్యత్తు ఉండదు. మతాలు అనేకం ఉన్నాయి గనకనే రాజ్యాంగ నిర్మాతలు మతాతీతమైన లౌకికతత్వం ఎంచుకున్నారు. కులం, మతం, ప్రాంతం, స్త్రీ, పురుష తేడాలు వంటివి పాటించని లౌకికతత్వం ఎంచుకున్నారు. రాజ్యాంగం 14వ అధికరణం నుంచి 25వరకూ ఈ సమానతాభావన మనకు గోచరిస్తుంది. ఏది ఎక్కువ ఏది తక్కువ అని గాక రాజ్యాంగం ప్రకారం నడుచుకోవడమే దేశానికీ మనుషులకూ శ్రేయస్కరం. స్వార్థరాజకీయాల కోసం ఇందుకు భిన్నమైన వాదనలు తెచ్చి అత్యధికంగా ఉన్న మతమే ఆధిక్యత వహించాలని అసహనానికి గురి కావడం అర్థరహితం. రాజకీయంగా ఇలాంటి సిద్ధాంతాలు ఎవరు చెప్పినా తోసిపుచ్చడం ప్రజాస్వామ్య స్పృహగల ప్రతివారి బాధ్యత. తాత్కాలిక అవకాశవాదాలకు ఆవేశకావేశాలకు గురై తమ మతాన్ని ఇతరులమీద రుద్దాలని చూడటం ప్రజల మధ్య చిచ్చు పెడుతుంది. తెలియకుండానే నిన్నటి మిత్రుడు లేదా ఇరుగు పొరుగు కూడా విడిపోయే విషమ పరిస్థితి దాపురిస్తుంది. దానివల్ల ఎవరికీ శాంతి సౌఖ్యాలు లేకుండా పోతాయి. కాబట్టి ప్రజల మధ్య ఐక్యతను సామరస్యాన్ని కాపాడుకోవడం కీలకం. ఇటీవలి అనుభవాలు ముఖ్యంగా గత ఏడాది చేసిన కొన్ని ఘటనలు చెబుతున్నదే. చాపకింద నీరులా చొరబడిన మతతత్వ రాజకీయాలను తోసిపుచ్చాల్సి ఉంటుంది. ఏ ఆధారంలేని కట్టుకథలు, విద్వేష వివాదాలకు మనం లోబడిపోకూండా జాగ్రత్త వహించాలి.

వాళ్లచుట్టే తిరగొద్దు

రాజకీయ రంగంలో ఏవో కొన్ని పాలక పార్టీలు (బీజేపీ, కాంగ్రెస్, వైసీపీ, తెలుగుదేశం, బీఆర్ఎస్... వంటివి) మాత్రమే శరణ్యమన్న భావన పోవాలి. పౌరులెవరైనా తమకూ దేశాన్ని మలచే హక్కు ఉంటుందని గుర్తించాలి. రాష్ట్రాలలోగాని, కేంద్రంలో గాని ఒకరిద్దరు నాయకులు, ఒకటి రెండు పార్టీలు, కొన్ని కులాల చుట్టూనే తిప్పుతూ అసలు సమస్యలు పక్కదోవ పట్టించే కుట్రలను అర్థం చేసుకోవాలి. బడా పార్టీల ఆధ్వర్యంలోని మీడియా సోషల్ మీడియా సంస్థలు పథకం ప్రకారం గుడుగుడు గుంచంలా అవే కథనాల చుట్టూ పరిభ్రమణం చేయిస్తున్నారనేది ప్రజలకు తెలియజెప్పాలి. రైతాంగం కార్మికులు ఉద్యోగులు మహిళలు సామాజికంగా దళితులు వెనకబడినవారిని తమ వలయంలో బందీలను చేయడం తప్ప సమగ్రంగా ఆలోచించే అవకాశం లేకుండా చేయడాన్ని ఛేదించాలి. వృథా వివాదాలు, బూతు పురాణాలు, కులాల కుంపట్లు రగలేసే రాజకీయాలను నిరసించాలి. సామాజిక న్యాయం సాధికారతతో పాటు మౌలిక సమస్యలపై సమిష్టిగా పోరాడకుండా ఒరిగేది ఉండబోదని తెలియజెప్పాలి.

సంక్షేమ పథకాలు స్వాగతించినా సమూలమైన పరిష్కారం భూమి, ఉపాధి, జీవిత భద్రత, హక్కుల రక్షణతోనే ముడిపడి ఉంటుందని గుర్తించాలి. కుల, మత విభేదాలు ఏ పరిష్కారం సూచించలేవని స్పష్టంగా తెలుసుకోవాలి. గొప్పలెన్ని చెప్పుకున్నా పాలకపార్టీలు, నాయకులు అంతిమంగా అధికారం కోసం అర్రులు చాచేవారే. మౌలిక సమస్యలపై వారు ఎలాంటి నిర్దిష్ట ప్రతిపాదనలు చేయడం లేదనే వాస్తవాన్ని తెలుసుకోవాలి. సంక్షేమ పథకాలను అవహేళన చేయడం సరికానట్టే వాటిని ఏ ఒక్కరి దయాభిక్షగానో, వ్యక్తిగత ఉదారతగానో చిత్రించే ప్రయత్నాలనూ తోసిపుచ్చాలి. కేంద్ర రాష్ట్రాల పథకాలేవైనా అన్నీ ప్రజాధనంతో జరిగేవి ఈ పథకాలను ఇష్టానుసారం కుదించడం, కోతలకూ వడపోతలకూ గురిచేయడం నిలదీయాలి. పాలక పార్టీలన్నీ బీజేపీ, వైసీపీ, బిఆర్ఎస్, టీడీపీ, కాంగ్రెస్ వంటిపార్టీలతో సహా అధికారంలో ఉన్నప్పుడు లేనప్పుడు రెండు రకాలుగా మాట్లాడే ద్వంద్వనీతిని దుయ్యబట్టాలి. ఇటీవల ఏపీ ప్రజాస్వామ్య పునరుద్ధరణ సభలో సీపీఐ(ఎం) కార్యదర్శి శ్రీనివాసరావు చెప్పినట్టు హక్కుల హరింపు విషయంలో టీడీపీ పాలనా కాలం దృష్టిలో పెట్టుకుంటే భవిష్యత్తులో తాము ఏ విధంగా



వాటిని కాపాడేందుకు కట్టుబడివుంటామో స్పష్టం చేయాలి. తెలంగాణలోనూ బీజేపీపై పోరాటంలో బిఆర్ఎస్‌తో కలసి వ్యవహరించినా ప్రజల సమస్యలపై రాజీ ఉండబోదని సీపీఐ(ఎం) కార్యదర్శి తమ్మినేని వీరభద్రం చెప్పిందీ అదే. దేశమంతటా ప్రజా ఉద్యమాలపై, రాష్ట్రాల హక్కులపై దాడి చేసే బీజేపీని పల్లెత్తుమాట అనకపోతే అది ఏ విధంగానూ పరిష్కారం కాదన్నది సత్యం. నిరంతర ప్రయివేటీకరణ, బడా సంపన్నులకు లక్షలకోట్ల రాయితీలు బ్యాంకు సొమ్ముల ధారదత్తం, ఆర్థిక అంతరాల తగ్గింపు లక్ష్యాన్ని వమ్ము చేస్తున్నాయి. ఆర్థిక సామాజిక సాంస్కృతిక అణచివేతలు దోపిడీ పీడనలపై జమిలిగా పోరాడాలి తప్ప పెద్ద పార్టీల ప్రచారాలు నేతల కపట వాక్కులతో మోసపోకూడదు. మేడిపండులాంటి గ్లోబల్ మార్కెట్ బుడగలు వరుసగా పగిలిపోతుంటే వాటిపై శృతిమించిన ఆశలు పెంచుకోవడం అర్థరహితమని గ్రహించాలి. అమెరికా ఉపగ్రహం కావడం కాదు, స్వావలంబన తప్ప దేశానికి మరో ప్రత్యామ్నాయం ఉండదనే మెళకువ ఉండాలి. తక్షణ సమస్యగా సవాలు

> మౌలిక సమస్యలపై వారు ఎలాంటి నిర్దిష్ట ప్రతిపాదనలు చేయడం లేదనే వాస్తవాన్ని తెలుసుకోవాలి. సంక్షేమ పథకాలను అవహేళన చేయడం సరికానట్టే వాటిని ఏ ఒక్కరి దయాభిక్షగానో, వ్యక్తిగత ఉదారతగానో చిత్రించే ప్రయత్నాలనూ తోసిపుచ్చాలి. కేంద్ర రాష్ట్రాల పథకాలేవైనా అన్నీ ప్రజాధనంతో జరిగేవి ఈ పథకాలను ఇష్టానుసారం కుదించడం, కోతలకూ వడపోతలకూ గురిచేయడం నిలదీయాలి. పాలక పార్టీలన్నీ బీజేపీ, వైసీపీ, బిఆర్ఎస్, టీడీపీ, కాంగ్రెస్ వంటిపార్టీలతో సహా అధికారంలో ఉన్నప్పుడు లేనప్పుడు రెండు రకాలుగా మాట్లాడే ద్వంద్వనీతిని దుయ్యబట్టాలి.

విసురుతున్న కోవిడ్ వేరియంట్‌లు, ఐటి కుదుపులను తట్టుకోగల వ్యూహం కావాలి. ఇప్పటికే వెనకబడిన ఆర్థికాభివృద్ధి ఉత్పత్తి రంగం, పెరిగిపోయిన దిగుమతులు ,కేంద్ర రాష్ట్రాల రుణ ఊబి గురించి జాగ్రత్త వహించాలి తప్ప మోడీ సర్కారు భజన కీర్తనల బుట్టలో పడకూడదు.

దేశమంటే మనుషులోయ్!

సాంకేతిక మార్పుల యాజమాన్య పద్ధతుల మార్పులు, ప్రభుత్వ ప్రయివేటు నిఘాలలో చిక్కిన వ్యక్తిగత గోప్యత, స్వేచ్ఛ, నిర్వహణా స్వేచ్ఛ వంటివి కాపాడుకోవడం ఇక ప్రతివారికి పెద్ద అగ్నిపరీక్ష కాబోతున్నది. భావ ప్రకటనా స్వేచ్ఛ అనేది రాజకీయ సామాజిక కార్యకర్తలకో మీడియా వారికో మాత్రమే గాక గొప్ప రచయితలు కళాకారులకు కూడా మృగ్యమైపోతున్నది. ఇంకా విడుదల కాని పఠాన్ సినిమాలో నాయిక బికినీ ఏ రంగులో ఉన్నదనేదాన్ని బట్టి ముందస్తుగా నిషేధించడం గడచిన ఏడాది చివరపాదంలో చూసిన విపరీతం. ఇందుకు తలవంచడం మొదలెడితే ఇంకా ఇంకా అణచివేత తప్పదు. కనుకనే అన్ని తరగతుల ప్రజలూ అన్ని స్రవంతుల సంఘాలూ సృజనకారులూ కూడా తమ హక్కులను తామే రక్షించుకోవడానికి సిద్ధం కావలసిందే. విద్యార్థులు విద్యా హక్కుకోసం అధ్యాపకులు బోధనా హక్కు కోసం కూడా ఉద్యమించవలిందే. ఉద్యోగ భద్రతకు ఘోరంగా కోతవేసి చాకిరీ పెంచే కొత్తకోడ్‌లపై కార్మికులు వేతన జీవులు కార్మికులు ఎలుగెత్తవలసిందే. వీటికి సమర్థనగా తెలివైన వాదనల తెచ్చే పరాన్న భుక్కు మేధావుల ప్రచారాలనూ తిప్పికొట్టవలసిందే. అభ్యుదయం, ప్రజాస్వామ్యం లౌకిక తత్వం, సామ్యవాదం, శ్రామిక చైతన్యం వంటి మహత్తర ఆశయాలను అవహేళన చేస్తూ ఆలోచనా పరులను నిరుత్సాహ పరిచేందుకూ ప్రజలను తమ చుట్టూనే తిప్పుకోవడానికి పాలకవర్గాలు పొంచికూచుని ఉంటాయని గుర్తిస్తే ఇందులో ప్రతి అంశం ఎంత ముఖ్యమైందో బోధపడుతుంది. సరైన ప్రారంభమే సగం విజయం. "దేశమంటే మట్టి కాదోయ్... దేశమంటే మనుషులోయ్..." అన్నట్టే ఏడాది మొదట్లోనే సరైన దిశా నిర్దేశం చేసుకోగలిగితే దేశాన్ని సమాజాన్ని సంరక్షించుకోగల సత్తా సంతరించుకోగలం.

నవ వసంతం...

రోజులు సాధారణంగా గడిచాయి.. నెలలు అలా అలా దొర్లాయి.. షరా మామూలుగా మరో ఏడాది కాలగర్భంలో కలిసి పోయింది. నేటి నుంచి కొత్త సంవత్సరం గమనంలోకి వచ్చి చేరింది. కొన్ని దేశాల మధ్య యుద్ధాలు.. రాజకీయ సంక్షోభాలు... ఆకలి... దరిద్రాలు... నిరుద్యోగుల ఎదురు చూపులు... రైతన్నల ఆత్మహత్యలు... హక్కుల కోసం కార్మికుల రణ నినాదాలు గతేడాది మార్మోగాయి. మతోన్మాదుల విద్వేషాగ్నులు... మహిళలపై విషనాగుల అరాచకాలు విలయతాండవం చేశాయి. పాలకుల విధానాలతో ధరలు ఆకాశాన్నంటి... సామాన్యుడికి చుక్కలు చూపించాయి. ఇలాంటి ఆశనిపాతాలు, ఆశ నిరాశల మధ్య 2022కి వీడ్కోలు పలికాం. 'ఉదయం కానే కాదనుకోవటం నిరాశ... ఉదయించి అట్లానే ఉందనుకోవటం దురాశ.. ఈ చీకటి ఉండదు... సూర్యుడు తప్పక ఉదయిస్తాడు...' అని ఓ కవి రాసుకున్నట్టు వ్యక్తిగత జీవితంతోపాటు వ్యవస్థీకృతంగానూ ప్రతీయేటా అనేక ఎత్తుపల్లాలు... ఒడిదుడుకులు సహజం. వాటన్నింటినీ తట్టుకుని మనిషి, సమాజం నిలబడాలి. అలా నిలబడి ముందుకు... ముమ్ముందుకు సాగాలి. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన గాంధీ తాత బోసి నవ్వుల నుంచి ఇప్పుడిప్పుడే భూమ్మీదకొచ్చిన నవజాత శిశువుల అమాయకపు చిరునవ్వుల దాకా అందరి మోముల్లో సంతోషం వెల్లివిరియాలి. అందుకనుగుణంగా ప్రజల మధ్య చీలికల తెచ్చే పాలకుల కుయుక్తులను తిప్పికొట్టాలి. జై జవాన్... జై కిసాన్.. అనే నినాద స్ఫూర్తితో దేశ రక్షణ, రైతు పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరమూ కంకణబద్ధులం కావాలి. భగత్‌సింగ్ ఇచ్చిన 'ఇంక్విలాబ్ జిందాబాద్' అనే రణ నినాదాన్ని మోగిస్తూ హక్కుల సాధన కోసం అకుంఠిత దీక్ష బూనాలి. తద్వారా మనుషుల మధ్య ప్రేమాభిమానాలు, ప్రజల మధ్య ఐక్యత, దేశాల మధ్య సుహృద్భావాన్ని పాదుకొల్పాయి. అప్పుడే నూతన సంవత్సరం శోభాయమానం అవుతుంది. నవ వసంతం వెల్లి విరుస్తుంది. ఆ వసంత శోభ రావాలని మనస్ఫూర్తిగా ఆశిద్దాం... ఆకాంక్షిద్దాం...

-బి.వి.యన్.పద్మరాజు

ఏడాది యుద్ధం

అందరూ సాధారణంగా అనుకునే ముచ్చట ఏమిటీ అంటే యుద్ధం ప్రస్తుతం రష్యా, ఉక్రెయిన్‌కు మధ్య అని. కానీ, అసలు యుద్ధం జరిగేది రష్యా, అమెరికా పెత్తనం చేసే నాటో దేశాలకు మధ్య అని చాలా తక్కువ మందికి తెలుసు. చిన్న దేశమైన ఉక్రెయిన్‌తో రష్యా సంవత్సరం మొత్తం యుద్ధం చేయడం ఏంటా? అని వ్యంగ్యోక్తులు విసురుతున్న వారు సైతం లేకపోలేదు. అమెరికా జీడీపీలో దాదాపు 40శాతం ఆదాయం ఆయుధాల వ్యాపారం మీదే నడుస్తున్నది. ఆయుధాలు అమ్మకుండా బతికే పరిస్థితి ఆ దేశానికి లేదనేది అందరికి తెలిసిన సంగతేనాయే. ఆసంస్కృతే ఆదేశంలోనూ ఓపెన్ ఫైరింగ్ ఘటనలకూ కారణం. విచ్చలవిడిగా ఆయుధాలు కూరగాయల్లా అమ్మే పరిస్థితి చూస్తూనే ఉన్నాం. అమెరికా స్కూళ్లో చిన్న పిల్లలు, ఉపాధ్యాయులపై గత రెండు, మూడేండ్లుగా మూకుమ్మడి కాల్పులు జరిపిన సంఘటనలు కొకొల్లలు. కాకపోతే, దొంగచాటు వ్యాపారాలు చేయడం, ప్రపంచ దేశాలను ఏమార్చడం అమెరికాకు వెన్నతోపెట్టిన విద్యేనాయే. ఇప్పుడు అదే ఆయుధాలను యుద్ధం పేర ఉక్రెయిన్‌కు అమ్ముకుంటున్నది అమెరికా. గతంలో గల్ఫ్‌పై పెత్తనం చేసింది కూడా ఎందుకో తెలుసా ? చమురు కోసమే సుమా !!

- బి.బసవపున్నయ్య

అంటిరి... ఆగమైతిరి...

కాంగ్రెస్ పార్టీ నూతన పదవులపై సీనియర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. అసంతృప్తి చెందారు. విమర్శల వర్షాన్ని కురిపించారు. తుదకు చతికిలపడ్డారు. ఇవతలి నుంచి సంపూర్ణ మద్దతు లభించకపోవడంతో వారి కథ కంచికి చేరింది. రివర్సయింది. అధిష్టానం చీవాట్లు పెట్టింది. హెచ్చరికలు చేసింది. అంతేకాకుండా వారు పార్టీ నుంచి పోతేపోనిలే అనే సంకేతాలిచ్చింది. మరోవైపు ఎన్నికలు రాబోతున్నాయి. ఒకవైపు రేవంత్‌రెడ్డి పాదయాత్ర సమయం దగ్గరపడుతుంది. కచ్చితంగా క్యాడర్ పాదయాత్రలో నడవాల్సిందే. ఎవరు రాకపోయినా రేపటి పరిస్థితి ఏంటి? అనే మీమాంసంలో సీనియర్లు మదనపడుతున్నారు. చివరికి గాంధీభవన్ మెట్లు ఎక్కేందుకు వారికి ఇగో అడ్డుపడుతున్నది. వివిధ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ... చివరికి ఎటుపోతారనే చర్చ మొదలైంది. మాటల్లేవ్, మాట్లాడుకోవడాల్లేవ్ అన్నట్టు రేవంత్‌తో సీనియర్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పుడు రెంటికి చెడ్డ రేవడిలా తయారైంది సీనియర్ల పరిస్థితి. పార్టీ మారుతారనే ప్రచారం ఊపందుకుంది. సోషల్ మీడియా పార్టీమార్పుపై హోరెత్తిస్తున్నది. ఇదే పరిస్థితి ఎక్కువ కాలం కొనసాగితే రానున్న ఎన్నికల్లో వారి టికెట్‌పై ప్రభావం పడే అవకాశం ఉందనే గుబులు రేగుతున్నది. సందట్లో సడేమియా అన్నట్టుగా వారి నియోజకవర్గాల్లో ద్వితీయ శ్రేణి నేతలు దూసుకొస్తున్నారు. మేము సైతం ఎన్నికల్లో పోటీకి సిద్ధమంటూ సైరన్ మోగిస్తున్నారు. ఆ ప్రవాహాన్ని తట్టుకోలేక, అధిష్టానాన్ని ప్రసన్నం చేసుకోలేక 'పెద్ద తలకాయలు' గిలగిల కొట్టుకుంటున్నారు. పార్టీకి దూరమైన నేపథ్యంలో ఎవరైనా రాయబారం చేసి... తమకు ఆపన్న హస్తం అందిస్తే మళ్లీ కార్యక్రమాల్లో చేరాలని వారు తహతహలాడుతున్నారు. లేకపోతే మనసు మార్చుకుని కమలం పువ్వు చెవిలో పెట్టుకునేందుగానీ, కారెక్కేందుకుగానీ వారు వెనుకాడబోరంటూ గాంధీభవన్ కోడై కూస్తున్నది.

- గుడిగ రఘు



పుస్తకం

పుస్తకం అమ్మ వంటిది
చదివితె కమ్మగుంటది
ప్రతి మాట ప్రతి పుట
నోటికి కూడౌతది-
మెదడుకు పదునుపెడతది ॥పుస్తకం॥
నేటి మనుషులంత
నాటి కోతి సంతతని
తరాలు చెమటోడ్చి
అవతారం మార్చిరంటది-
శాస్త్రాలు నేర్చిరంటది ॥పుస్తకం॥
రాత్రి దెయ్యం రాదు
రాయి దైవం కాదు
మూఢముచ్చు ఆచారాలు
విడవమంటది-
వివరం చూపెడతది ॥పుస్తకం॥
తిత్తుల కొలిమితీసి
విద్యుత్తును వెలిగించి
విమానాలు ఎగరేస్తే
విశ్వమంత తిరుగునంటది
తంత్రి వార్త మోయునంటది ॥పుస్తకం॥
పల్లె తొలిదని పట్నం మలిదని
నిజమన్నదె నిలుచునని
నీతికి జయమగునని
మనిషి కథలు చెపుతది
-మహాత్ములను చేస్తది
॥పుస్తకం॥

డా బెల్లి యాదయ్య
9848392690

గుండెలో చోటుంది

"మాకెపుడూ ప్రజల గురించే ధ్యాస. వాళ్ళను లివర్‌లో పెట్టుకొని చూసుకుంటాం" నాయకుడు చెప్పుకుంటూ పోతున్నాడు. కొత్త సంవత్సరం కాబట్టి కొత్తగా చెప్పుకొస్తున్నాడేమో అని అందరూ వింటున్నారు.

"సార్...!!??" అసిస్టెంటు అరిచాడు వెనుకనుండి.

"ఏం జరిగిందిర భై" మైకును మూసేసి అడిగాడు.

"సార్, గుండెల్లో... గుండెల్లో పెట్టుకుని చూసుకుంటాం..." అన్నాడు ఆ అసిస్టెంటు.

ఇదంతా ప్రజలు వింటున్నారన్న విషయం కనిపెట్టిన నాయకుడు మళ్లీ మొదలుపెట్టాడు

"నా అసిస్టెంటే లివర్‌లో కాదు, గుండెలో పెట్టుకుంటాను అని అనమంటున్నాడు. నేను సరిగ్గానే అన్నాను. అందరూ గుండెలో పెట్టుకుంటే కొత్తేముంటుంది. అందుకే నేను లివర్ అన్నాను. తప్పా?" కొత్తదనం కోసం తాను ఆరాటపడతానని ప్లేటు ఫిరాయించాడు చాకచక్యంగా.

"లేదు లేదు" తన ప్రతి మీటింగులోనూ ఉండే అనుచరులు గట్టిగా అరిచారు.

"లివరంటే కాలేయం, కాలేయమంటే లివర్, ఇసుమంటి విషయాలు అందరూ తెలుసుకోవాలి మరి..."

సభ మొత్తం చప్పట్లు.

"గట్టదీ లివర్ పవర్. ఎక్కువరిస్తే మా పార్టీ గుర్తు ఇప్పుడున్నది తీసేసి లివర్ గుర్తు పెట్టుకుంటాను. ఎవరికైనా అభ్యంతరమా?"

"లేదు లేదు" అనుచరులు, తిరిగి చప్పట్ల మోత.

"ఇంతకీ గుండెనా లివరా అని అనుమానం రావచ్చు. నేను మజాకుకైనా మజాకు చేయను. ఈ మధ్యనే లివర్ గురించి చదివాను. ఎవరో ఒకాయన కూతురు తనకు లివర్ దానం చేసిందని ఆయనే చెప్పాడు. మొత్తం లివర్ ఇస్తే ఆ బిడ్డ పరిస్థితి ఏందని, తన జిందగీ అంతా పరేషాన్ కాదా అనీ అడిగా. లివర్ మొత్తం గట్ల తీసేసి గిట్ల పెట్టరంట. కొంచెం కోసి పెడతారంట. గది పెట్టుకున్న నాయనకు మొత్తం లివర్ తయారవుతుందంట. ఈ బిడ్డకీ తను ఇచ్చిన లివర్ తనకొచ్చేస్తుందంట. ఇచిత్రమే కదా..."



జంధ్యాల రఘుబాబు
9849753298

చప్పట్ల మోత. అనుచరులు ఆనందపడిపోయారు. మా సారు శంకర్ దాదాకు మించిన తెలివితేటలున్నోడు అని మనసులో అనుకున్నారు. ఈమధ్య పాదయాత్రలు చేస్తూ మా బాసుకు బుద్ధి పెరిగిపోయిందనుకున్నారు కూడా. వాళ్ళలో ఒకడు మెల్లిగా నిజం చెప్పాడు. "ఈ మధ్య తాగి తాగి సారు కాలేయం బాగా చెడిపోయిందని డాక్టరమ్మ చెప్పిందంట. అందుకే గుండె ఎందుకు లివర్ ఇస్తామంటున్నాడు."

"మొన్న ఎన్నో వైద్య కళాశాలలు కట్టిస్తామన్నారు. నేనొక్కటే చెబుతున్నా... ఆ కాలేజీలన్నింటిలో లివర్ మార్చే ఏర్పాటు మా పైనోళ్ళకి చెప్పి నేను పెట్టిస్తా..." అని అనుచరుల వైపు చూశాడు. ఇప్పుడు వారితో పాటు స్టేజి మీద ఉన్నోళ్ళూ ఒకటే చప్పట్లు. పరుగులు పెట్టే బండి ఎలా ఆగదో మన నాయకుడి ఉపన్యాసం కూడా ఆగకుండా పోతోంది. అందుకే ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన కింద రోడ్లేసినారేమో అనుకునేలాగ ఉంది ఆయన జోరు. ఇంతలో ఒక అనుచరుడొచ్చి సార్ మీరు వాళ్ళు కట్టిచ్చే మెడికల్ కాలేజీల గురించి చెబుతున్నారని వెనక కూచున్న సారు చెబుతున్నాడు అనే సరికి స్పీడుతో పోతున్న ఉపన్యాస బండి కొద్దిగా నెమ్మదించింది.

ఎన్నికలనగానే ప్రజలు గుర్తొస్తారు. వాళ్ళను తమ గుండెలో పెట్టుకుంటామన్న డైలాగులూ గుర్తొస్తాయి. నిజంగానే ప్రజలకు సేవ చేస్తున్నోళ్ళను ఎవరైనా ఒప్పుకోవాల్సిందే, సందేహం లేదు. వారికి చేతనైనంత సహాయమూ చేయాలి. అంతే కాని పొద్దస్తమానమూ ప్రజల్ని ఎలా మింగాలి అనుకునేవాళ్ళ గురించి ప్రజలకు చెప్పాలి. ఎవరేమనుకున్నా సరే. ఇదంతా కూడా ప్రజల కోసమే. ఒక గుండె డాక్టరు మీటింగులో తమాషాగా చెప్పిన విషయం. అదేమంటే... ఎవరినైనా మీది విశాల హృదయం అని పొగడొద్దు అని చెప్పాడాయన. ఎందుకంటే విశాల హృదయమంటే హార్ట్ ఎన్లార్జ్ అని అర్థమట. అంటే ఒక రకమైన గుండె జబ్బులో గుండె తన సైజును మించి కొద్దిగా పెరుగుతుందన్నమాట. అలా ఎన్నికల రోగాలు వచ్చినప్పుడు ఆటోమ్యాటిక్కుగా



నాయకుల గుండెలు పుష్పాల్లాగా విచ్చుకుంటాయి, విశాలమైపోతాయి. ఎన్నికలు అయిపోయిన వెంటనే మళ్ళీ ముడుచుకుంటాయవి. అలా కొన్ని పూవ్వులు విచ్చుకోవడం, ముడుచుకోవడం మనం చూడొచ్చు. ఎన్నికలున్నా, లేకున్నా కొన్ని హృదయాలు ఎప్పుడూ విశాలంగానే ఉంటాయి. వారిని గమనించాలి.

అందుకే ఎవరి గుండెలో ప్రజలకు చోటుందో,

> ఎన్నికలనగానే ప్రజలు గుర్తొస్తారు. వాళ్ళను తమ గుండెలో పెట్టుకుంటామన్న డైలాగులూ గుర్తొస్తాయి. నిజంగానే ప్రజలకు సేవ చేస్తున్నోళ్ళను ఎవరైనా ఒప్పుకోవాల్సిందే, సందేహం లేదు. వారికి చేతనైనంత సహాయమూ చేయాలి. అంతే కాని పొద్దస్తమానమూ ప్రజల్ని ఎలా మింగాలి అనుకునేవాళ్ళ గురించి ప్రజలకు చెప్పాలి. ఎవరేమనుకున్నా సరే. ఇదంతా కూడా ప్రజల కోసమే.

ఆ ప్రజల గుండెల్లో కూడా నాయకులకు చోటుంటుంది. నాది పుష్పక విమానం లాంటి గుండె, ఎందరికైనా చోటుంటుంది. ఏ రాష్ట్రంలోనైనా ఆ గుండె తెరుచుకుంటుంది అనే రకం



నాయకులూ మన చుట్టే ఉంటారు. వాళ్ళ గుండె చప్పుడు లబ్ డబ్ అని కొట్టుకుంటుందా లేక లబ్బు డబ్బు అని కొట్టుకొని తరువాత డబ్బు డబ్బు అని కొట్టుకుంటుందా! ఆ డబ్బున్నోళ్ళకే అన్నీ కట్టబెట్టి కుబేరుల్ని చేస్తున్నారా! అన్న విషయం కూడా చూడాలి. నీ భక్తుని గుండెలో ఖైదీగా ఉండాలని, అని పాడుకున్నట్టు ఆ పరమ భక్తుల గుండెల్లో అలా కనిపించి ఇలా మాయమయ్యే ప్రజలను చూడొచ్చు. తరువాత కొలువై ఉండే బడా బాబులనూ చూడొచ్చు నిరంతరం. సీటివ్వడానికి ఆ బడాబాబుల లిస్టులు తయారు చేయడమూ చూడొచ్చు. మా లిస్టులోనూ బడాబాబులున్నారు. మా గుండెల్లో కూడా ఉన్నారు అని వారికంటే కొద్దిగా తేడాగా ఉన్నోళ్ళూ అనొచ్చు.

ప్రజలు ఈ గుండెలను చూస్తూనే ఉంటారు. ఆ గుండెలకు ఎప్పుడు పరీక్షలు చేయాలో, ఎప్పుడు స్టెంట్లు వేయాలో వారికి బాగా తెలుసు. కొత్త సంవత్సరంలో కొత్తగా ఎవరెవరు ఏ ఎత్తులు వేస్తారో, ఎన్ని జిమ్మిక్కులు చేస్తారో ఇంకా బాగా గమనించి ఆ గుండెల్ని కొత్తగా చేసుకునే పవరూ ఉంది ప్రజలకు. అందుకే వారందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు...

నవతెలంగాణ
www.praja.khammam@gmail.com
5 ఖమ్మం
ఆదివారం 01 జనవరి 2023

సీపీఐ(ఎం) సీనియర్ నాయకుడు రంగారావు మృతి

నివాళ్లర్పించిన తమ్మినేని



నవతెలంగాణ-నేలకొండపల్లి

మండలంలోని అనాసాగరం గ్రామానికి చెందిన ప్రస్తుతం నేలకొండపల్లి పట్టణంలో నివాసముంటున్న సిపిఎం సీనియర్ నాయకుడు మేళ్లచెరువు రంగారావు(81) శనివారం మరణించారు. ఆయన గత కొద్ది రోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. విషయం తెలుసుకున్న సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాలేరు నియోజకవర్గ ఇన్చార్జి బండి రమేష్‌లు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ రంగారావు సిపిఎం పట్ల అత్యంత విశ్వాసం, అంకితభావంతో పనిచేస్తూ పార్టీ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేశారని కొనియాడారు. నేడు ఆయన మరణం పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి తీరని లోటు అన్నారు. భౌతికకాయాన్ని సందర్శించిన వారిలో సిపిఎం జిల్లా నాయకులు గొడవర్తి నాగేశ్వరరావు, ఏటుకూరి రామారావు, పగిడికత్తుల నాగేశ్వరరావు, మండడపు మురళీకృష్ణ, ఎడ్ల తిరుపతిరావు తదితరులు సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

పొంగులేటి నూతన సంవత్సర శుభాకాంక్షలు

నవతెలంగాణ-ఖమ్మంప్రాంతీయప్రతినిధి



ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలకు ఖమ్మం మాజీ ఎంపీ, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రానున్న కొత్త సంవత్సరంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా సమగ్ర అభివృద్ధి సాధించాలని, రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రతి గడపకు చేరాలని, ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యాన్ని ప్రసాదించాలని కోరారు. ప్రతి ఒక్కరిలో ఉప్పొంగే ఉత్తేజం, అవధులు లేని ఉత్సాహం ప్రతి ఇంటిలో సంతోషాలు ప్రతి ఒక్కరికి ఆనందం లభించాలని పొంగులేటి ఆకాంక్షించారు.



నవతెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-వైరా

నవతెలంగాణ దిన పత్రిక ఆధ్వర్యంలో అత్యంత ఆకర్షణీయంగా రూపొందించబడిన 2023 సంవత్సర నూతన క్యాలెండర్‌ను వైరా శాసన సభ్యులు లావుడియ రాములు నాయక్ శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజా ప్రతినిధుల సమక్షంలో ఆవిష్కరించారు. సీనియర్ పాత్రికేయులు పారుపల్లి కృష్ణారావు (నవ తెలంగాణ) ఆధ్వర్యం లోజరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నవతెలంగాణ క్యాలెండర్ అద్భుతమైన సీనరీస్‌తో ఆకర్షణీయంగా రూపొందించ బడుతుందన్నారు. మండల, నియోజకవర్గ ప్రజలు కూడా నవతెలంగాణ దిన పత్రికను, క్యాలెండర్‌ను ఆదరిస్తున్నట్లు తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్క్ఫెడ్ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, ఎంపీపీ వేల్పుల పావని, మునిసిపల్, వైరా నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ కోసూరు శ్రీనివాసరావు, వైరా మార్కెట్ చైర్మన్ బీడీకే రత్నం, జడ్పిటిసి నంబూరు కనకదుర్గ, పట్టణ అధ్యక్షులు దార్న రాజశేఖర్, రూరల్ అధ్యక్షులు బాణాల వెంకటేశ్వరరావు, వైరా పట్టణ సోషల్ మీడియా కోఆర్డినేటర్ మోటిపోతుల సురేష్, పట్టణ నాయకులు కనగంటి హుస్సేన్ ,లక్ష్మయ్య, జీవన్, పిఏ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

జి-20 స్టేట్ లెవల్‌కి డిఆర్ఎస్, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

నవతెలంగాణ-ఖమ్మం



ఖమ్మం డిఆర్ఎస్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థునులు, ఈ నెల 27 వ తేదీన వరంగల్ కాకతీయ యునివర్శిటిలోకి జి-20 సమవేశం అనే అంశంపై నిర్వహించిన పోటీలో కళాశాలకు చెందిన ఎస్.ఉమమహేశ్వర తెలుగు వ్యక్తిత్వ ద్వితీయ బహుమతి, ఎండీ. రుమాన కౌసర్ ఉర్దూ వ్యక్తిత్వ ద్వితీయ బహుమతులు సాధించి, జనవరి 4న రాజభవన్‌లో నిర్వహిచబోయే సెమినార్ పాల్గొననున్నారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో కళాశాల సెక్రెటరీ, కరస్పాండెంట్ మోహన్‌రెడ్డి, చైర్‌పర్సన్ శోభారెడ్డి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, ఏవో వెంకటకృష్ణ, అప్పారావు , అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అమెరికా అత్యున్నత సమావేశానికి అర్హత సాధించిన కటకం శివకృష్ణ

నవతెలంగాణ-వైరాటౌన్



అగ్రరాజ్యం అమెరికాలో జరిగే ఎల్ఐసి మిలియన్ డాలర్ రౌండ్ టేబుల్ సమావేశానికి స్థానిక ఎల్ఐసి జడ్ఎం క్లబ్ మెంబర్ కటకం శివకృష్ణ అర్హత సాధించారు. శనివారం మధిర ఎల్ఐసి బ్రాంచ్ కార్యాలయం నందు బ్రాంచ్ మేనేజర్ ఆనందరావు అధ్యక్షతన జరిగిన అభినందన సభలో కటకం శివకృష్ణను ఘనంగా సన్మానించారు. అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ కిషోర్ కుమార్, డెవలప్మెంట్ ఆఫీసర్స్ కోమటి లింగమూర్తి, జయరామిరెడ్డి, స్టాఫ్ మెంబెర్ సీరపాణి తదితరులు శివకృష్ణ కృషిని కొనియాడారు. కార్యక్రమంలో ఎల్ఐసి ఏజెంట్లు నజీర్ మియా దంపతులు, రామకృష్ణ, నర్సిరెడ్డి, చారి, ఆఫీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బైరి నరేష్‌ని కఠినంగా శిక్షించాలి

నవతెలంగాణ - బోనకల్

అయ్యప్ప స్వామి జననంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బైరి నరేష్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం స్థానిక ఖమ్మం బస్టాండ్ సెంటర్లో శనివారం అయ్యప్ప దీక్ష పరులు రాస్తారోకో చేశారు. నాస్తిక వాదాన్ని అడ్డుపెట్టుకొని హిందువులను రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించడం తగదన్నారు. అనంతరం అయ్యప్ప దీక్షపరులు స్థానిక పోలీస్ స్టేషన్లో బైరి నరేష్ పై ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో దీక్షాపరులు బీపీ నాయక్, గంగుల పుల్లయ్య, కోసూరి వెంకటేశ్వర్లు, కనగాల అప్పారావు, గాలి దుర్గారావు, గుగులోతు మురళి, లెల్లెల రాజు తదితరులు పాల్గొన్నారు.

కొత్త యేడాదిలో లక్ష్యాలను సాధిద్దాం

- కిష్టారం ఓసీ పీవో నరసింహారావు
- ఓసీలో క్రిస్మస్, కొత్త యేడాది వేడుకలు

నవతెలంగాణ- సత్తుపల్లి

ఈ యేడాది సంస్థ విధించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను గత యేడాది మాదిరిగానే సాధిద్దామని కిష్టారం ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు ఆఫీసర్ ఎంవీ నరసింహారావు అన్నారు. సత్తుపల్లి మండలం కిష్టారం ఓసీలో ఆదివారం పీవో కార్యాలయం వద్ద క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలను ఆనందంగా జరుపుకున్నారు. ఈ వేడుకల్లో పీవో నరసింహారావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రమాద రహిత ఉత్పత్తే లక్ష్యంగా ప్రతీక్షణం అప్రమత్తతతో విధులు నిర్వహించాలని కార్మికులు, ఇతర విభాగాల ఉద్యోగులను కోరారు. వేడుకల్లో భాగంగా కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో మేనేజర్ వెంకటేశ్వరరావు, ఇంజినీరు మాధవరావు, రక్షణ అధికారి గోపీకిశోర్, సీఎస్ఐ సెంట్‌జాన్స్ చర్చి పాస్టర్ జాన్‌బాబు, సూర్యప్రకాశరావు, అధికారులు, ఉద్యోగులు, సంక్షేమాధికారి విజయ్‌సందీప్ పాల్గొన్నారు.

టీఎస్ యుటిఎఫ్ నూతన క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

నవతెలంగాణ - ఎర్రుపాలెం



టీఎస్ యుటిఎఫ్- 2023 నూతన క్యాలెండర్, డైరీలను మండల అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. మండల కేంద్రమైన ఎర్రుపాలెం మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు జరిగిన కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు అనుమోలు కోటేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీలు ప్రమోషన్లు వెంటనే చేపట్టాలని కోరారు. 317 జీవో ద్వారా నష్టపోయిన ఉపాధ్యాయుల సమస్యలను పరిష్క రించాలని తెలిపారు.ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను తక్షణమే మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు బండారు నాగరాజు, ఉపాధ్యక్షులు కంచర్ల శ్రీనివాసరావు, కోశాధికారి లంకా నాగేశ్వరరావు, కార్యదర్శులు మహేంద్రకుమార్, సైదారావు, చిన్ని, నీలం అజయ్ కుమార్, రవికుమార్, బండారుపల్లి రాజారావు, నంద్రు వెంకటేశ్వరరావు, నాగమణి, ఎస్ వెంకమ్మ,సీత రామ లక్ష్మి, పాండు, ఏ రాము, శంకర్, రవి, తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధత కలిగిన ఆదర్శ కమ్యూనిస్టు బందెల పాల్

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు



నవతెలంగాణ-వైరాటౌన్

సమాజంలో అసమానతలు, దోపిడీ, పేదరికం, కష్టాలు, కన్నీళ్లు ఉన్నంతకాలం వాటికి వ్యతిరేకంగా ప్రజల పక్షాన నికరంగా నిలబడి పోరాడటానికి కమ్యూనిస్టులు, కమ్యూనిస్టు పార్టీ, ఎర్రజెండా ఉంటుందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు అన్నారు. శనివారం వైరా మున్సిపాలిటీ పరిధిలోని సోమవరం గ్రామంలో సిపిఐ(ఎం) గ్రామ కార్యదర్శి బెజవాడ వీరభద్రం అధ్యక్షతన నిర్వహించిన బందెల ఫౌల్ సంస్మరణ సభకు ముఖ్య అతిథిగా హాజరైన పోతినేని సుదర్శన్ ప్రసంగిస్తూ నిబద్ధత కలిగిన ఆదర్శ కమ్యూనిస్టు బందెల పౌల్ ఆశయ సాధన కోసం కృషి చేయాలని అన్నారు. చిన్నతనం నుంచి మరణించే వరకు సిపిఐ(ఎం) పార్టీ జండాతో ప్రజా ఉద్యమాలలో భాగస్వామ్యం అయిన బందెల పౌల్, వృత్తి రీత్యా కాంట్రాక్టర్ అయినప్పటికీ నిజాయితీతో పనిచేసి అధికారుల మన్ననలు పొందాడని, స్నేహానికి మంచి విలువఇచ్చే వ్యక్తిగా ప్రజా ఉద్యమంలో అనేక ఆటుపోట్లు వచ్చినా నికరమైన కమ్యూనిస్టుగా నిలబడ్డాడని, పౌల్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని కోరారు. జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి కార్యక్రమంలో భాగస్వామిగా ఉండే ఫౌల్ మరణం వారి కుటుంబంతో పాటు పార్టీకి కూడా తీవ్ర నష్టమని, వైరాలో మార్కిస్ట్ కార్యాలయం నిర్మాణంలో ఫౌల్ కుటుంబం చేసిన కృషి మరువలేనిదని అన్నారు. ప్రజలకు కమ్యూనిస్టుల అవసరం పెరుగుతున్న నేపథ్యంలో ఫౌల్ మరణం ప్రజా ఉద్యమాలకు నష్టమన్నారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు మాట్లాడుతూ నిబద్ధత, నిజాయితీకి, నిబ్బరానికి, స్నేహానికి నిలువెత్తు ఆదర్శం కామ్రేడ్ బందెల పౌల్ అన్నారు. వ్యక్తిగతంగా అత్యంత క్రమశిక్షణగా ఉండే ఫౌల్ అనారోగ్యంతో మరణించడం చాలా దురదృష్టకరమని, తన సహచరులు, దగ్గరిగా ఉండే నాయకులే సిపిఐ(ఎం)ని వీడినా బందెల పౌల్ మాత్రం ఉక్కు క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా సిపిఐ(ఎం) ఎర్ర జెండాతో జీవితం సాగించారని పేర్కొన్నారు. దోపిడీ, అణిచివేతలు, దౌర్జన్యాలు లేని సమాజ నిర్మాణమే లక్ష్యంగా పనిచేస్తున్న కమ్యూనిస్టు పార్టీలను ప్రజలు బలపరచాలని కోరారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు భూక్యా వీరభద్రం మాట్లాడుతూ పార్టీకి విధేయుడిగా ఉంటూ, రాజకీయాలలో స్వచ్ఛత మిగిలే ఉందన్న విశ్వాసాన్ని ప్రజలకు కల్పిస్తూ కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని ముందుకు తీసుకెళ్లడానికి అంకితభావంతో బందెల పౌల్ జీవితాంతం కృషి చేశాడని కొనియాడారు. జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్ మాట్లాడుతూ నేడు విలువలు లేని రాజకీయాలు నడుస్తున్నాయని, రాజకీయం అంటే అధికారం, పదవులని భావిస్తున్న తరుణంలో ఎర్రజెండా సైనికుడిగా బందెల పౌల్ జీవితకాలం పని చేశారని, వారి ఆశయాల సాధన కోసం మనం అందరం ముందుకు సాగాలని కోరారు. అనంతరం బందెల పౌల్ స్మారక స్థూపాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైరా, కొణిజర్ల మండల కార్యదర్శులు తోట నాగేశ్వరరావు, చెరుకుమల్లి కుటుంబరావు, నాయకులు బొంతు సమత, బోడపట్ల రవీందర్, చింతనిప్పు చలపతిరావు, మల్లంపాటి రామారావు, మచ్చ మణి, మల్లెంపాటి వీరభద్రరావు, వాసిరెడ్డి విద్యాసాగర్, ధూళిపాళ్ల వెంకటేశ్వరరావు, పారుపల్లి కృష్ణారావు, గొల్లపూడి ప్రకాశరావు, హరి వెంకటేశ్వరావు, సామినేని గోవిందరావు, హరి అప్పారావు, బొజ్జగాని కృష్ణ, షేక్ జమాల్, బాజోజి రమణ, సర్పంచ్ తుమ్మల జాన్ పాపయ్య, ఇమ్మడి సుదీర్, రాచబంటి బత్తిరన్న, సంక్రాంతి పురుషోత్తం, పారుపల్లి శ్రీనాథ్ బాబు, అనుమోలు రామారావు, గుడిమెట్ల రజిత, షేక్ షైనాబి, గుడివెంట్ల మోహనరావు, సంక్రాంతి నరసయ్య, పైడిపల్లి సాంబశివరావు, షేక్ నాగుల్ పాషా, తోట కృష్ణవేణి, ఓర్సు సీతారాములు, దేవళ్ళ కృష్ణ, బందెల పౌల్ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

ఫలించిన ఎంపీ నామ కృషి



జాతీయ రహదారి సమస్యలపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సానుకూలం

ఎంట్రీ, ఎగ్జిస్ట్, పట్టణాల రోడ్ల విస్తరణకు గ్రీన్ సిగ్నల్

నవతెలంగాణ-ఖమ్మంప్రాంతీయప్రతినిధి

ఎట్టకేలకు బీఆర్ఎస్ లోక్ సభా పక్ష నేత, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు చేసిన కృషి ఫలించింది. జిల్లాలోని జాతీయ రహదారి సమస్యలపై ఎంపి నామ చేసిన పోరాటం సత్ఫలితాలను ఇవ్వడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నది. ఎన్‌హెచ్ 365బిజి జాతీయ రహదారిలో రెండు చోట్ల ఎంట్రీ, ఎగ్జిస్ట్ ఏర్పాటుతో పాటు మార్గంలోని పలు పట్టణాల పరిధిలోని అంతర్గత రోడ్ల విస్తరణకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం పట్ల జిల్లా ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిగణలోకి తీసుకుని, ఎంపీ నామ ఈ విషయమై గతంలో నితిన్ గడ్కరీని ప్రత్యేకించి, కలసి, సమస్యలను వివరించడంతో పాటు లేఖలు అందజేశారు. దీనిపై తాజాగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ స్పందించి, ఎంపీ నామ లేఖలో పేర్కొన్న విధంగా జాతీయ రహదారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగు తుందని సానుకూలంగా తిరుగు సమాధానం ఇచ్చారు. ఖమ్మం- అశ్వారావుపేట జాతీయ గ్రీన్‌ఫీల్డ్ (ఎన్హెచ్ 365బిబి) రహదారికి అంతర్భాగంగా నిర్మిస్తున్న ఖమ్మం - దేవరపల్లి (ఎన్ హెచ్ 365బిజి) గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారిలో కల్లూరు మండలంలోని లింగాల గ్రామం వద్ద, వేంసూరు మండలంలో రెండు ఎంట్రీ, ఎగ్జిస్ట్ ప్రొవిజన్ ను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రిని నామ కోరడం జరిగింది. ఈ జాతీయ రహదారి హైదరాబాద్ - విజయవాడ (ఎన్హెచ్ 65), జగిత్యాల - కరీంనగర్ - వరంగల్ - ఖమ్మం (ఎన్హెచ్ 563) జాతీయ రహదారులను కలుపుతుంది. అంతేకాకుండా కాకినాడ పోర్టు చత్తీస్గఢ్, ఒరిస్సా, పశ్చిమ బెంగాల్ పారిశ్రామిక కారిడార్లకు కూడా ప్రధాన అనుసంధాన రహదారిగా కూడా ఉంటుంది. అయితే వేంసూరు, సత్తుపల్లి పట్టణాలు, మండలాలు, చుట్టు పక్కల గ్రామాల ప్రజలు వైద్యం, ఇతర అవసరాల కోసం విజయవాడ, రాజమండ్రి, హైదరాబాద్ నగరాలకు వెళ్లే క్రమంలో గ్రీన్ ఫీల్డ్ రహదారిని చేరుకోవడానికి 30 నుంచి 40 కిలో మీటర్ల దూరం అవుతుందని, ఇది ప్రజలకు భారంకావడంతో పాటు పర్యావరణ సమస్యలు కూడా ఏర్పడతాయని, ఇందనం వృథా కూడా అవుతున్నందున రెండు చోట్ల ఎంట్రీ, ఎగ్జిస్ట్ ఏర్పాటు చేయాలని నామ కేంద్ర మంత్రిని కోరారు. అంతేకాకుండా ఈ జాతీయ రహదారి వెళుతున్న పినపాక, తల్లాడ, కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి తదితర పట్టణాల పరిధిలోని అంతర్గత రోడ్లను విస్తరించడంతో పాటు మురుగు నీటి కాల్వలను పూర్తి స్థాయిలో నిర్మించాలని, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని నామ కేంద్ర మంత్రిని కోరగా నితిన్ గడ్కరీ అందుకు సానుకూలంగా స్పందిం చారు. ఈ సందర్భంగా ఆయా పట్టణాలు, గ్రామాల ప్రజలు ఎంపీ నామకు కృతజ్ఞతలు తెలిపారు.

బీబీసీకి 1250 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తాం

ఖమ్మం చీఫ్ ఇంజనీర్ శంకర్‌నాయక్

నవతెలంగాణ - బోనకల్



బోనకల్ బ్రాంచ్ కెనాల్‌కు ప్రతిరోజు 1250 క్యూసెక్కులకు తగ్గకుండా సాగర్ నీటిని విడుదల చేస్తామని ఇరిగేషన్ ఖమ్మం చీఫ్ ఇంజనీర్ బి.శంకర్‌నాయక్ తెలిపారు. బోనకల్ నీటి పారుదల శాఖ సబ్ డివిజన్ కార్యాలయంలో నీటిపారుదల శాఖ అధికారుల, సాగర్ చివరి ఆయకట్టుదారులకు శనివారం నీటి లభ్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బోనకల్ బ్రాంచ్ కెనాల్ పరిధిలో మొక్కజొన్న పంట యాసంగిలో అత్యధికంగా సాగు చేస్తున్నారని రైతులు తమకు తెలిపారన్నారు. సాగర్ నీరు రాక సాగు చేసిన మొక్కజొన్న పంట ఎండిపోతుందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలిపారు.వారి విజ్ఞప్తి మేరకు బోనకల్ సబ్ డివిజన్ కార్యాలయంలో సాగర్ నీటి లభ్యతపై అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయకట్టు చివరి భూములన్నింటికీ సాగునీరు అందించే విధంగా ప్రతిరోజు 1250 క్యూసెక్కులకు నీరు తగ్గకుండా ఇస్తామని తెలిపారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నీటిపారుదల అధికారులకు సహకరించాలని కోరారు. అనంతరం బోనకల్ బ్రాంచ్ కెనాల్ ను పరిశీలించారు. ఈ సమావేశం బిబిసి నోడల్ అధికారి వెంగలపూడి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో కల్లూరు డివిజన్ ఎస్ఈ ఎం.ఆనంద్ కుమార్, బోనకల్, చింతకాని, మధిర డీఈలు పఙ్ఛతి శ్రీనివాస్, రాంప్రసాద్, నాగ బ్రహ్మయ్య, ఆంధ్రప్రదేశ్ జగ్గయ్యపేట డిఈ సంతోష్, బోనకల్ రైతు మండల కన్వీనర్ వేమూరి ప్రసాదరావు, ఏఈలు కే.రాజీవ్, సురేష్, సిబ్బంది, రైతులు కాకాని శ్రీనివాసరావు, శాఖమూరి కోటేశ్వరరావు, సాంబశివరావు, అప్పారావు పాల్గొన్నారు.

జిల్లా ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు

జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్

నవతెలంగాణ- ఖమ్మం

జిల్లా ప్రజలందరికీ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్ ఒక ప్రకటనలో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరంలో మీ కలలు సాకారం కావాలని కోరుకుంటున్నట్టు తెలిపారు. నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో పదికాలాల పాటు సుఖసంతోషాలతో ఉండాలని కోరారు.

నూతన సంవత్సర వేడుకలు



రెజొనెన్స్ శ్రీనగర్‌లో...

ఖమ్మం : నగరంలో శ్రీనగర్ కాలనీలో రెజొనెన్స్ స్కూల్లో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. కొన్ని గంటల్లో నూతన సంవత్సరంలోకి అడుగు పెట్టబోతుండగా రాబోయే సంవత్సరానికి ఆహ్వానం పలు కుతూ చిన్నారులు డాన్సులతో, పాటలతో ఉత్సాహంగా కేరింతలు కొడుతూ ఆనందించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కొండా శ్రీధర్‌రావు, డైరెక్టర్ కొండా కృష్ణ వేణి, ప్రధానోపాధ్యాయులు యం.ప్రసన్నరావు తెలిపారు.

ఆదర్శలో...

చింతకాని : పాత సంవత్సరానికి గుడ్ బై చెబుతూ నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ నాగులవంచ ఆదర్శ విద్యార్థులు సందడి చేశారు శనివారం పాఠశాలలో విద్యార్థులు నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ రంగవల్లులు తీర్చిదిద్దారు విద్యార్థులు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేస్తూ కేరింతలు కొట్టారు ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బోడెపుడి కిరణ్ ప్రిన్సిపల్ చావా అరుణ్‌కుమార్ పాల్గొన్నారు

బొమ్మలో...

చింతకాని : బొమ్మ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ విద్యా సంస్థల్లో శనివారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాలని రంగవల్లులతో తీర్చిదిద్ది అలంకరణ చేశారు. అనంతరం చైర్మన్ రాజేశ్వరరావు, వైస్ చైర్మన్ సత్య ప్రసాద్ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు

స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో

ఖమ్మం : ఖమ్మం నగరంలోని స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో నూతన సంవత్సర వేడుకలను చిన్నారులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేస్తూ, సంతోషాన్ని వ్యక్తపరిచారు. పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రాంగణం అంతా ఆనంద ఉత్సాహాల మధ్య కేకులు కట్ చేస్తూ కేకులు తినిపించుకుంటూ చిన్నారులు ఒకరికొకరు పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ కేరింతలు కొట్టారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య, పాఠశాల డైరెక్టర్ చింత నిప్పు సుకన్య, పాఠశాల ప్రిన్సిపాల్ విజయకుమారి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

త్రివేణి పాఠశాలలో

ఖమ్మం : ఎన్నో ఆశలను మోసుకొస్తున్న కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ, నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు త్రివేణి పాఠశాలల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి తెలిపారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అందరి కలలు సాకారం కావాలని, కొత్త సంవత్సర శుభాకాంక్షలను తెలిపారు. ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నూతన లక్ష్యాలు ఎంచుకొని ఆ లక్ష్యం దిశగా విజయం సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థినీ విద్యార్థులకు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులకు నూతన సంవత్సర క్యాలెండర్లను, మిఠాయిలను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో త్రివేణి కృష్ణవేణి విద్యా సంస్థల అధిపతి వై.వెంకటేశ్వరరావు, సిఆర్వో మురళీకృష్ణ, ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ శ్రీదేవి, అకాడమిక్ ఇన్చార్జ్ ముస్తఫా, ఐఐటీ ఇంచార్జ్ అశోక్, క్యాంపస్ ఇంచార్జ్ చార్లెస్, ట్రాన్స్పోర్ట్ ఇన్చార్జి సందీప్, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

సర్వజ్ఞలో...

ఖమ్మం : నగరంలోని విడివోస్ కాలనీలో సర్వజ్ఞ పాఠశాలలో శనివారం నూతన సంవత్సర స్వాగత వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమాన్ని పాఠశాల నిర్దేశకులు ఆర్.వి.ఆర్ నాగేంద్రకుమార్, నీలిమ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడిచిన ప్రతి సంవత్సరం అనేక కొత్త పాఠాలను నేర్పుతుందని, నూతన సంవత్సరంలో విజయశిఖరాలను చేరుకోవాలంటే మంచి ఆలోచనలు, ఆహారపు అలవాట్లు, క్రమశిక్షణ, సమయ పాలన, అధ్యయనం అలవరచుకోవాలని, అలాగే మన ఉన్నతికి అవరోధాలుగా నిలచే అవలక్షణాలు కోపం, బద్ధకం, నిర్లక్ష్యం వంటి వాటిని గడించిన ఏడాదిలోనే వదిలేయలన్నారు. నూతన సంవత్సరం సర్వమానవాళికి, జీవకోటికి అనంతమైన శుభాలు చేకూర్చాలని ఆకాంక్షించారు. అనంతరం నూతన సంవత్సర కేక్ కట్చేసి, విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

ఠాగూర్ విద్యాసంస్థలలో

వైరాటౌన్ : స్థానిక ఠాగూర్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం నూతన సంవత్సర వేడుకలను ఠాగూర్ విద్యాసంస్థల చైర్మన్ సంక్రాంతి సునీత, డైరెక్టర్ సంక్రాంతి సంయోగిత కేక్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల కరస్పాండెంట్ సంక్రాంతి రవికుమార్ మాట్లాడుతూ 2021-22 విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో నూటికి నూరు శాతం ఫలితాలు సాధించామని, జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ విభాగాలలో రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంకు సాధించారని, డిగ్రీలో యూనివర్సిటీ స్థాయి మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రత్యేకంగా అభినందించారు. నూతన సంవత్సర స్ఫూర్తితో రానున్న విద్యా సంవత్సరంలో కూడా ఇష్టంతో చదువుకొని రాష్ట్రస్థాయి మార్కులు సాధించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ సంక్రాంతి సునీత, కరస్పాండెంట్ సంక్రాంతి రవికుమార్, డైరెక్టర్ సంక్రాంతి సంయోగిత, ప్రిన్సిపాల్ చింతనిప్పు కృష్ణారావు, ఎన్ఎస్ఎస్ పిఓ లింగారావు, మజీద్, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గ్లోబల్ రెయిన్బోలో

కూసుమంచి : మండల కేంద్రంలో గల గ్లోబల్ రెయిన్బో పాఠశాలలో శనివారం నూతన సంవత్సర వేడుకలను చాలా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎమ్‌డి హర్షద్ అహ్మద్, డైరెక్టర్ ఎమ్‌డి ఇంతియాజ్ అహ్మద్, పాఠశాల ఇన్చార్జ్ జహ్నవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.















కొత్త యేడాదిలో మరింత అభివృద్ధి జరగాలి

నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర

నవతెలంగాణ- సత్తుపల్లి



2023 కొత్త యేడాదిలో నియోజకవర్గంతో పాటు రాష్ట్రంలోని ప్రజలంతా సుఖశాంతులతో సుభిక్షంగా ఉండాలని, దీంతోపాటు నియోజకవర్గంలో మరింత అభివృద్ధి జరగాలని కోరుకుంటున్నట్లు సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ఆకాంక్షించారు. నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ స్థానిక క్యాంపు కార్యాలయం నుంచి శనివారం ప్రకటనను విడుదల చేశారు. యేడాది కాలంలో ప్రభుత్వ సహకారంతో ఎంతో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. ఈ కొత్త యేడాదిలో కూడా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టే విధంగా శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. నియోజకవర్గ ప్రజలు నాపై ఎంతో నమ్మకం ఉంచి మూడుసార్లు గెలిపించారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం పాటుపడటం జరిగిందన్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా తన దగ్గరకు వచ్చిన ప్రతి ఒక్కరికి అవకాశం ఉన్నంత వరకు ఆదుకోవడం జరిగిందన్నారు. ప్రజల దీవెనలు, ఆశీస్సులు ఇంతకు ముందులాగే అందిస్తారని కోరుతూ నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే సండ్ర నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

గాడ్సే వారసులు వీళ్లు..

వీళ్లా నీతులు చెప్పేది?

- జాతిపిత మహాత్మాగాంధీని పొట్టన పెట్టుకున్నారు...
- మోడీ ఎనిమిదేళ్లుగా ఇస్తున్న హామీల్లో ఒక్కటైనా నెరవేర్చారా?
- మతాన్ని అడ్డుపెట్టుకుని అధికారంలోకి తప్ప...

ప్రజలకు చేసిందేంటి?

- గల్లా నోరు అదుపులో పెట్టుకో...

వ్యక్తిగత ఆరోపణలు చేస్తే ఖబడ్దార్

- బీజేపీ జిల్లా నేతలపై నిప్పులుచెరిగిన

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు శ్రీకాంత్, విక్రమ్



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

జాతిపిత మహాత్మాగాంధీని పొట్టన పెట్టుకున్న నాథురామ్ గాడ్సే వారసులు వీళ్లు...వీళ్లా నీతులు చెప్పేది? మోడీ ఎనిమిదేళ్ల పాలనలో ఏ ఒక్క హామీ అయినా నెరవేర్చారా? మతాల మధ్య చిచ్చుపెట్టి అధికారంలోకి రావడం తప్ప ప్రజలకు చేసిందేంటి? అని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ ప్రశ్నించారు. స్థానిక సుందరయ్య భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రమ్‌తో కలిసి మాట్లాడారు. తాము ప్రజల కోసం పనిచేస్తాం...తాము ప్రజల నుంచి విరాళాలు సేకరిస్తామన్నారు. మతోన్మాద బీజేపీ అధికారంలోకి రాకుండా ఉండటమే తమ పార్టీ రాజకీయ విధానం అన్నారు. తమ పార్టీ అంబానీ, ఆదానీల మీద ఆధధారపడి డబ్బులు పోగేసుకోదన్నారు. ప్రజల కోసం పనిచేస్తాం...ప్రజల వద్దకే వెళ్లి విరాళాలు సేకరించి...అదే ప్రజా సమస్యల కోసం ఖర్చు చేస్తామన్నారు. ఇది తమ పార్టీ విధానం అన్నారు. తమ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే తగిన బుద్ధి చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు. కమ్యూనిస్టులు ఎప్పుడూ ప్రజలకు సేవ చేస్తారు..ప్రజల నుంచే విరాళాలు సేకరిస్తారని అన్నారు. బీజేపీ లెక్క మాకేం కార్పొరేట్ డబ్బులు రావన్నారు. తమ కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కార్యాలయ నిర్మాణానికి అంబాని అన్ని అన్ని రాజకీయ పార్టీలకు పంపించినట్లే చెక్ పంపించారని, దానిని తాము తిరస్కరించిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. కార్పొరేట్ శక్తుల నుంచి తాము ఏమి ఆశించం అన్నారు. కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా తమ పోరాటం ఉంటుందన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని కూలదోయడానికి ఎమ్మెల్యేలను కొనుగోలు చేయాలని ప్రయత్నించిన పార్టీ బీజేపీ...అటువంటి పార్టీకి చెందిన నాయకులా? నీతిజాతి గురించి మాట్లాడేది అన్నారు. దేశప్రజల సంక్షేమానికి బీజేపీ చేసిన ఏ ఒక్క వాగ్దానమైనా నెరవేర్చారా? అని ప్రశ్నించారు. మోడీ తాను అధికారంలోకి వస్తే వంద రోజుల్లో నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిస్తానన్నాడు...తగ్గించాడా? అని ప్రశ్నించారు. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధర తగ్గినా పెట్రోల్, డీజిల్ రేట్లు తగ్గకపోవడంపై మండిపడ్డారు. మతోన్మాదం, కులోన్మాదాన్ని రెచ్చగొట్టే పార్టీ బీజేపీ అన్నారు. బీజేపీ మతాన్ని అడ్డుపెట్టుకుని అధికారంలోకి వస్తుంది తప్ప... ప్రజలకేమీ చేసింది లేదని అందరూ గమనిస్తున్నారన్నారు.

- గల్లా నోరు అదుపులో పెట్టుకో: వై.విక్రమ్

బీజేపీ నాయకులు గల్లా సత్యనారాయణ బీపీతో మాట్లాడుతున్నారు...ఆయన కొంచెం బీపీ తగ్గించుకుంటే మంచిదని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రమ్ అన్నారు. వాడు, వీడు అనే పదజాలం, వ్యక్తి ఆరోపణలు సరికాదన్నారు. బీజేపీ కార్యకర్త ఆత్మహత్యను అడ్డుపెట్టుకుని రాజకీయ ప్రయోజనం పొందాలని చూసిన వాళ్లు వీళ్లు అన్నారు. తెల్దారుపల్లి ఘటనకు మాకు సంబంధం ఉందా? ఆ హత్యను తమ పార్టీ ఖండించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్‌షాలపై అనేక హత్యానేరాలున్నాయి..వీళ్లా హత్యల గురించి మాట్లాడేది అన్నారు. కేరళలో సీపీఐ(ఎం) కార్యకర్తలను ఊచకోత కోసింది మీ పార్టీ కాదా? అని ప్రశ్నించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అనేక మంది దళితులను, రైతులను హత్యచేసిన బీజేపీ హత్యల గురించి నీతిసూత్రాలు చెప్పటం 'దెయ్యాలు వేదాలు వల్లించినట్టుంది' అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పాలన ఎలా ఉందో ప్రజలందరికీ తెలుసన్నారు. గల్లా బీపీ తగ్గించుకుని, మాట్లాడే విధానం మార్చుకోకపోతే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.



కరుడుగట్టిన కమ్యూనిస్టు బొమ్మకంటి నాగన్న

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భూక్యా వీరభద్రం

నవతెలంగాణ-కొణిజర్ల

మండల పరిధిలోని గోపవరం గ్రామంలో సిపిఎంని బలోపేతం చేయటంలో కీలక పాత్ర పోషించిన గ్రామ నాయకులు బొమ్మకంటి నాగేశ్వరరావు అలియాస్ నాగన్న రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా శనివారం జరిగిన సంస్మరణ సభలో భూక్యా వీరభద్రం మాట్లాడుతూ నాగన్న ఆశయ సాధన కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడేది కమ్యూనిస్టులేనని గుర్తు చేశారు. ఆయన మరణం గ్రామానికి ఉద్యమానికి తీరని లోటని, గ్రామ పార్టీ కార్యకర్తలు పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి చెరుకుమల్లి కుటుంబరావు, గోపవరం సొసైటీ డైరెక్టర్ వైరా పట్టణ కమిటీ నాయకులు సంక్రాంతి నరసయ్య, పార్టీ మండల కమిటీ సభ్యులు మాజీ సర్పంచ్ మంగ చెన్నారావు, బొమ్మకంటి వెంకన్న, హనుమంతరావు తదితరులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు.

డీసీసీబీ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-కల్లూరు

కోపరేటివ్ సొసైటీ సెంట్రల్ బ్యాంక్ కల్లూర్ బ్రాంచ్‌లో బ్యాంక్ ఆధ్వర్యంలో ముద్రించిన క్యాలెండర్‌ను డిసిసిబి డైరెక్టర్ బోబోలు లక్ష్మణరావు, బ్యాంకు మేనేజర్ రాణి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ క్యాలెండర్‌లో బ్యాంక్ అందిస్తున్న సేవలు బ్యాంకు పథకాలు ఉన్నాయన్నారు. అసిస్టెంట్ మేనేజర్ పుష్ప, ఫీల్డ్ ఆఫీసర్ జాన్మియా, కల్లూరు సొసైటీ సీఈవో బీరవల్లి శ్రీనివాసరావు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరం విజయవంతం

నవతెలంగాణ-కూసుమంచి

మండలంలోని చిన్న పోచారం గ్రామంలో శనివారం జరిగిన మెగా పశు వైద్య శిబిరాన్ని పోచారం సర్పంచ్ శశికళ డాక్టర్ నీలాకాంత్ సంయుక్తంగా ప్రారంభించారు. కార్యక్రమంలో రిలయన్స్ ఫౌండేషన్ జిల్లా ప్రతినిధి సియచ్ వెంకటేశ్వర్లు, వరలక్ష్మి, స్వరూప, మాదవ్, బి.సాయి, పశుమిత్ర గోపాలమిత్రలు మల్సూర్, రైతులు పాల్గొని శిబిరాన్ని విజయవంతం చేశారు.

ఆత్మీయ సమ్మేళనం పోస్టరావిష్కరణ

నవతెలంగాణ- కల్లూరు

ఖమ్మం మాజీ పార్లమెంట్ సభ్యుడు, కల్లూరు మండలం ముద్దుబిడ్డ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు కల్లూరు పట్టణం నుండి కాటేపల్లి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం ఖమ్మం వెళ్లేందుకు భారీ సంఖ్యలో యువతతో బయలు దేరేందుకు సన్నాహాలు చేస్తున్నారు. శనివారం కల్లూరు మెయిన్‌సెంటర్ నందు ఆత్మీయ సమ్మేళన పోస్టర్ను ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య కార్యదర్శి కాటేపల్లి కిరణ్ కుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇనుముల రాము యాదవ్ సంపసాల వెంకటకష్ట, శీలం రామకృష్ణ, కుంచాల గురవయ్య, మల్లు యాదవ్ పాల్గొన్నారు

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ

నవతెలంగాణ- కల్లూరు

స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. స్థానిక వ్యాపారవేత్త చారి గొండ్ల నాగేశ్వరరావు, సుశీల జ్ఞాపకార్థంగా వారి మనవాళు చారుగొండ్ల కిరణ్, సందీప్‌లు శనివారం 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థినిలకు పెన్నులు ప్యాడ్లు పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వనదుర్గ సిపిఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు నున్నా కృష్ణయ్య, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



వృద్ధులకు పండ్లు పంపిణీ

నవతెలంగాణ-వైరా

వైరా మండలం గొల్లపూడి గ్రామంలోని వృద్ధాశ్రమం వృద్ధులను న్యూఇరా షైన్ స్కూల్ విద్యార్థులు సందర్శించి వృద్ధులకు పండ్లను, రొట్టెలను అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల కరెస్పాడెంట్ డాపి.భూమేష్ రావు, డైరెక్టర్ కుర్రా సుమన్ సీనియర్ సెకండరీ ప్రిన్సిపాల్ భువన ప్రసాద్, ప్రిన్సిపాల్ షాజీమాథ్యూ, షైన్ స్కూల్ ప్రిన్సిపాల్ ఆశా, ఏ.ఓ.నరసింహరావు పాల్గొన్నారు.

కళ్యాణలక్ష్మీ చెక్కులు పంపిణీ చేసిన ఎంఎల్ఏ కందాళ

నవతెలంగాణ-కూసుమంచి



నిరుపేద కుటుంబంలో పేదింటి ఆడపిల్లకు పెళ్లి చేయాలంటే ఆర్థికంగా చాలా ఇబ్బందులకు గురవుతారని, ఇలాంటి పరిస్థితి ఏ పేద కుటుంబంలో ఉండకూడదని రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతి ఆడపిల్లకు మేనమామ అయి కల్యాణ లక్ష్మి ద్వారా 1,16,000 అందిస్తున్నారని, ఈ కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పేదింటి ఆడపిల్లలకు వరంలాగా మారిందని పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మండలానికి సంబంధించిన 94 కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను ఆయా లబ్ధిదారులకు ఎంఎల్ఏ అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బానోత్ శ్రీనివాస్ నాయక్, వైస్ ఎంపీపీ కంచర్ల పద్మా వీరరెడ్డి, డిసిసిబి డైరెక్టర్ ఇంటూరి శేఖర్, డిప్యూటీ తాసిల్దార్ అన్సారి, ఎంపీడీవో కర్నాకర్‌రెడ్డి, ఆత్మ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, టిఆర్ఎస్ మండల అధ్యక్ష కార్యదర్శులు వేముల వీరయ్య, ఆసిఫ్ పాషా, టీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో జెడ్పీ చైర్మెన్ ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ - ఎర్రుపాలెం



మండల పరిధిలోని నారాయణపురం గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాలను జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు ఆకస్మికంగా శనివారం తనిఖీ చేశారు. ఎర్రుపాలెం మండల పర్యటనలో భాగంగా పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. పలువురిని పరామర్శించారు. నారాయణపురం గ్రామానికి చెందిన నున్న బాబు దశ దిశ కర్మ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆ క్రమంలో ఆ గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాలను పరిశీలించారు. ఉపాధ్యాయుల హాజరు పట్టికతో పాటుగా తరగతి గదుల కలియ తిరుగుతూ విద్యార్థులతో మాట్లాడి విద్యాబోధనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన ఏర్పాట్లు పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులను ఉపాధ్యాయులు ఉన్నత స్థాయికి చేరేలా తీర్చిదిద్దాలని చదువులో మెరుగైన ఫలితాలు సాధించేలా కషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మధిర పట్టణంలో జెడ్పీ చైర్మెన్ పర్యటన

మధిర : మధిర పట్టణంలో జడ్పీ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ మధిర నియోజకవర్గ ఇంచార్జ్ లింగాల కమల్ రాజు విస్తృతంగా పర్యటించారు ఈ పర్యటనలో భాగంగా మధిర మున్సిపల్ చైర్మన్ మొండితోక లత, మధిర మండల ఎంపీపీ మెండెం లలితతో కలసి పట్టణంలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాల పనులను ఆయన పరిశీలించారు ముందుగా 100 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించారు అలానే ఇండోర్ స్టేడియం, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులను పరిశీలించి నిర్మాణ పనుల వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, సొసైటీ చైర్మన్ బిక్కి కృష్ణప్రసాద్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్‌లు చిత్తారు నాగేశ్వరరావు, రంగిశెట్టి కోటేశ్వరరావు, మండల రైతు బంధు కన్వీనర్ చావా వేణు, పట్టణ పార్టీ కార్యదర్శి అరిగే శ్రీనివాసరావు, మండల పార్టీ కార్యదర్శి బొగ్గుల భాస్కర్‌రెడ్డి, నాయకులు మొండితోక జయకర్ కౌన్సిలర్లు ఇక్బల్, యన్నంశెట్టి అప్పారావు పాల్గొన్నారు.

శ్రీవారికి ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-ఎర్రుపాలెం

తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన జమలాపురం శ్రీవెంకటేశ్వర స్వామి వారికి శనివారం వేకువజామువనే ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో అర్చకులు పంచామృతాలతో సర్వంగా అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి వారికి పట్టు వస్త్రములు ధరింప జేసి, ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. వేద పండితులు విజయకృష్ణ ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, వేద పారాయణం, హోమములు, ప్రత్యేక అర్చనలు ఘనంగా నిర్వహించారు. శనివారం కావడంతో ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామి వారిని అమ్మ వార్లను దర్శించుకున్నారు. స్వామి వారి ఆలయంతో పాటు అన్ని ఉప ఆలయాలను భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు. అలివేలు మంగా పద్మావతి అమ్మ వార్లతో స్వామి వారికి కల్యాణాన్ని అత్యంత వైభవంగా అర్చకులు కొరవి సుబ్రహ్మణ్యం నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. మహిళ భక్తులు పొంగళ్ళు చేసి స్వామి వారికి నివేదన సమర్పించారు. స్వామి వారి దర్శనానికి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు ఉచిత అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

నూతన సంవత్సర సందర్భంగా జనవరి ఒకటవ తేదీన స్వామి వారి దర్శనం కోసం ఆలయానికి వేలాదిగా వచ్చే భక్తుల రద్దీని పురస్కరించుకొని భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ అధికారులు, ఎర్రుపాలెం ఎస్సై ఎం.సురేష్ తెలిపారు. మధిర మండలం ఖమ్మంపాడు గ్రామానికి చెందిన దొండపాటి పూర్ణయ్య, ప్రభావతి దంపతుల వితరణతో జనవరి 1న ఆలయానికి వచ్చే భక్తులందరికీ ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

మిషన్ భగీరథ మంచినీటి నల్లాను ప్రారంభించిన మేయర్

నవతెలంగాణ - ఖమ్మం కార్పొరేషన్

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని స్థానిక త్రీ టౌన్ ప్రాంతంలోని 32వ డివిజన్‌లో వాసవి నగర్ నందు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సూచనల మేరకు శనివారం ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ మంచినీటి నల్లాను నగర మేయర్ పునుకొల్లు నీరజ చేతుల మీద రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మహేశ్వరి టవర్స్ అధ్వర్యంలో మేయర్ నీరజకి సన్మానం చేసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సరస్వతి రవి నాయక్, సుడా డైరెక్టర్ కోసూరి రమేష్ గౌడ్, మహేశ్వరి, టవర్స్ అధ్యక్షులు మానేపల్లి నగేష్, సెక్రటరీ జగదీష్, ఈశ్వర్ లింగం, తదితరులు పాల్గొన్నారు,

పేదలకు దుస్తులు పంపిణీ

నవతెలంగాణ-ముదిగొండ

మండల పరిధిలో వెంకటా పురంలో నూతన సంవత్సరం సందర్భంగా సెవెంత్ డే అడ్వాంటేస్ట్ (ఎస్డిఏ) ఆధ్వర్యంలో 50 మంది పేదలకు శనివారం దుప్పట్లు, దుస్తుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్డిఎ చర్చ్ పాస్టర్ కటారి యేబు, రోజా సంఘస్తులు పాల్గొన్నారు

బిర్యాని పొట్లాల పంపిణీ

నవతెలంగాణ-సత్తుపల్లి

నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా సత్తుపల్లి నవచైతన్య స్వచ్ఛంద బాధ్యులు శనివారం పట్టణంలోని నిరుపేదలకు బిర్యాని పొట్లాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు గాదె నరసింహారెడ్డి, తోట కిరణ్, సంస్థ డైరెక్టర్లు మాదిరాజు పుల్లారావు, గాదె నాగు, చల్లారి కృష్ణయ్య, గోపినేని నరసింహారావు, సాంబారు వెంకటేశ్వరరావు, గుడిపూడి సుధీర్ పాల్గొన్నారు.

రాయన్నపేటలో ఉచిత మెగా క్యాంపు విజయవంతం

నవతెలంగాణ - బోనకల్

పేదల ప్రజల అభ్యున్నతి కోసం అహర్నిశలు పోరాడిన మహోన్నత వ్యక్తి సిపిఐ సీనియర్ నాయకులు అమరజీవి తూము ప్రకాశరావు ఆశయాలను కొనసాగి స్తామని బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ప్రకాశరావు తనయులు తూము రోషన్ కుమార్ అన్నారు. రాయన్నపేట గ్రామంలో బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో మేఘశ్రీహాస్పిటల్స్ వారు మెగా హెల్త్ క్యాంపును విజయవంతంగా శనివారం నిర్వహించారు. ఈ క్యాంపులో 150 మంది పేషంట్లకు బిపీ, షుగర్, ఈసిజీ పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ క్యాంపులో మేఘశ్రీహాస్పిటల్ వైద్యులు టీ పవన్ కుమార్, టి ప్రమోద్ కుమార్, వి సాంబశివరావు, ఆర్ఎంపిడబ్ల్యూఏ టిఎస్ జిల్లా అధ్యక్షులు బొమ్మినేని కొండలరావులు పేషంట్లకు వైద్యసేవలు అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఏలూరి పూర్ణచంద్, క్యాంపు నిర్వాహకులు ఆకెన పవన్, సాధనపల్లి అమర్నాధ్, కుప్పల నిఖిల్, హాస్పిటల్ సిబ్బంది యంగల గిరి,ఇవాంజిలిన్, నాగజ్యోతి, గోపి పాల్గొన్నారు.

రాష్ట్ర కమిటీలోకి 87మంది ఎన్నిక

నవతెలంగాణ-ఖమ్మం

ఖమ్మం నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో రెండు రోజుల పాటు జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం ప్రతినిధుల సమావేశాలకు రాష్ట్రం నుంచి మొత్తం 570 మంది ప్రతినిధులు హాజరుకాగా, అందులో 120 మంది మహిళ ప్రతినిధులు పాల్గొన్నారు. నూతన రాష్ట్ర కమిటీని 87 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరిలో 14మంది మహిళలను రాష్ట్ర కమిటీ లోకి తీసుకున్నారు.

రాష్ట్ర కమిటీలోకి ఖమ్మం జిల్లా వాసులు

రాష్ట్ర కమిటీలోకి ఖమ్మం జిల్లా నుంచి పొన్నం వెంకటేశ్వరరావు, మెరుగు సత్యనారాయణ, ఎర్ర శ్రీనివాసరావు, వత్సవాయి జానకి రాములు, పి. సంగయ్య, జాజిరి శ్రీనివాసరావు, కొండబోయిన నాగేశ్వరరావు, బంధం రాజ్యం ఎన్నికయ్యారు.

మిలిటెంట్ పోరాటాలు చేయాలి

వ్యకాస రాష్ట్ర నాయకులు మచ్చా వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-ఖమ్మం

వ్యవసాయ కూలీల సమస్యలు పరిష్కారం కావాలంటే మిలిటెంట్లు పోరాటాలు చేస్తునే సాధ్యమౌతుందని వ్యకాస రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. ఖమ్మం నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో జరుగుతున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రాజెక్టుల నిర్మాణం కోసం స్థానిక ప్రజల నుంచి తీసుకున్న భూములకు సంబంధించిన నష్టపరిహారాన్ని ఇవ్వకుండా భూనిర్వసితులను ఇబ్బందులు గురిచేస్తుందని ఆరోపించారు. పోడుభూములకు సంబంధించిన సర్వే జరిగి నెలలు గడుస్తున్నా ఇంకా రాష్ట్ర ప్రభుత్వం అధికారులు ఎటువంటి అదేశాలు జారీ చేయకపోవడం శోచనీయం. అసలు పోడుభూములకు పట్టాలు వస్తాయా లేదా అని ఆలోచనలో పోడుసాగుదారులున్నారన్నారు. ఇండ్ల స్థలాలు కేటాయించి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. ధరణి పోర్టల్‌ని సవరించాలన్నారు.

ఘనంగా దేవేందర్ పదవీ విరమణ సభ


నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లి సహాయ కార్మికశాఖాధికారి సబ్ ఆర్డినేట్‌గా సేవలందిన అల్లం దేవేందర్ పదవీ విరమణ సభ శనివారం ఘనంగా నిర్వహించారు. జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో సహాయ కార్మికాధికారి అంబటి ఏసుపాదం, సీఐటీయూ, ఏఐటీయూసీ కార్మిక సంఘాల నేతలు మల్లూరు చంద్రశేఖర్, నిమ్మటూరి రామకృష్ణ, కొలికపోగు సర్వేశ్వరరావు, ఎంఎస్ఎఫ్ నేత ముత్తారావు, వీరబాబు, మణి, శ్రీనివాస్, వెంకటరమణ పాల్గొన్నారు.

న్యూ ఇయర్ లో పర్యావరణ హిత సంకల్పం

పర్యావరణ మిత్ర అవార్డు గ్రహీత కడవెండి వేణుగోపాల్

నవతెలంగాణ - ఖమ్మం



నూతన సంవత్సరంలో పర్యావరణహితం కోసం పాటుపడాలనే సంకల్పం ప్రతి ఒక్కరూ తీసుకోవాలని పర్యావరణ మిత్ర జాతీయ అవార్డు గ్రహీత, న్యాయ సేవా సంస్థ సభ్యులు కడవెండి వేణుగోపాల్ కోరారు. ఈ మేరకు ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు- 2023 తెలుపుతూ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రపంచవ్యాప్తంగా ప్రజలంతా పర్యావరణంపై పూర్తి అవగాహనతో పచ్చదనం పరిరక్షణకు పూనుకోవాలని తెలిపారు. వాడి పడేసే ప్లాస్టిక్ ను నియంత్రించాలని సూచించారు. మొక్కలు నాటడం...వాటిని సంరక్షించాలని కోరారు. అందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోవాలి : సండ్ర

నవతెలంగాణ-సత్తుపల్లి

విద్యార్థులు చిన్నతనం నుంచే పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలని సత్తుపల్లి శాసనసభ్యులు సండ్ర వెంకటవీరయ్య సూచించారు. శనివారం స్థానిక విశ్వశాంతి విద్యాలయంలో ఒలింపియాడ్ టాలెంట్ టెస్టులో విజేతలుగా నిలిచిన పాఠశాల విద్యార్థుల అభినందన సభకు ఆయన ముఖ్యఅతిధిగా హాజరై బహుమతులు అందజేశారు.



అత్యధిక మిర్చి దిగుబడినిచ్చే జమున 116 రకం సీడ్స్

- వైరస్ తెగుళ్లను తట్టుకునే జమున 116 సీడ్స్

నవతెలంగాణ-చండ్రుగొండ

మెలీనా జమున 116 సీడ్స్ వైరస్ తెగుళ్ళ తట్టుకొని అత్యధిక మిర్చి దిగుబడులు వస్తాయని కంపెనీ ఏఎస్ఎం యాకూబ్ పాషా అన్నారు. శనివారం మండల పరిధిలోని గానుగపాడు గ్రామంలో మెలిన సీడ్స్ కంపెనీ బెంగళూరు బృందం స్థానిక రైతులతో జమున 116 మిర్చి రకం వైరస్ తెగుళ్లను తట్టుకొని అధిక దిగుబడి వచ్చే దిశగా పంట ఉందని సందర్శించిన రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు. పాషా మాట్లాడుతూ జమున 116 మిర్చి చెట్లు చిల్లలు ఎక్కువగా రావడం చెట్టు దరిదాపుగా నాలుగు నుంచి ఐదు అడుగులు పెరగటం కాయలు బారు, ఎక్కువగా ఎరుపు రంగుతో ఆకర్షంగా ఉన్నాయని, తాలుకాయ అతి తక్కువగా ఉందని పెట్టుబడి కూడా తక్కువ పురుగు మందులు అతి తక్కువగా ఉంటుందన్నారు. మెలినా సీడ్స్ కంపెనీ అత్యంత నాణ్యత ప్రమాణికను కలిగి ఉంటాయని అతి తక్కువ కాలంలోనే జమున 116 మిర్చి రకానికి అత్యంత రైతుల నుంచి ఆదరణ లభిస్తుందని ఒక ఎకరానికి 120 గ్రాములు విత్తనాలు సరిపోతాయని అన్నారు. రైతుల ప్రోత్సాహంతోనే మా కంపెనీ దినదిన అభివృద్ధి చెందుతుందని మా మెలినా సీడ్స్ కంపెనీ తరపున రైతులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు ఇంజం మహేష్, సతీష్, నున్న రవి, కంపెనీ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ డి.శ్రీకాంత్, ఎం.సురేష్, పి.సందీప్, కే.రాజా, ఎస్.కే.రఫీ, ఆర్.రామకృష్ణ, కే.పవన్ తదితరులు పాల్గొన్నారు.

4న సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక వైద్యశిబిరం

- సూపరింటెండెంట్ డాక్టర్ జయలక్ష్మి

నవతెలంగాణ-అశ్వారావుపేట



జిల్లాలోని మారుమూల ప్రాంతాలలో నిపుణులైన (స్పెషలిస్ట్) వైద్యులుచే వైద్య శిబిరాలు నిర్వహించేలా తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిన నేపథ్యంలో భద్రాచలం ఐటీడీఏ సహకారంతో, తెలంగాణ వైద్య విధాన పరిషత్ వైద్యులచే డీసీహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు ఆదేశానుసారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఈ 4న ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జయలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిబిరంలో జర్నల్ సర్జరీ- అపెండెక్స్, హెర్నియా, హైడ్రోసిల్, ఫిస్టులా, ఫిషర్స్, పైల్స్, మొదలైన సర్జరీల సమస్యలకు పీడియాట్రిషన్-చిన్నపిల్లల వ్యాధి నిపుణులు, ఆర్థోపెడిక్-ఎముకలు, కీళ్ల నొప్పులకు, గైనకాలజీ-స్త్రీల సమస్యలు, గర్భిణీలకు స్కానింగ్, జనరల్ మెడిసిన్- జ్వరం, దగ్గు, ఆయాసం, థైరాయిడ్, ఈఎన్‌టీ-చెవి, ముక్కు గొంతు వ్యాధులకు, డెర్మటాలజిస్ట్-చర్మ సంబంధిత వ్యాధులు, ఆప్తమాలజీ- కంటికి సంబంధించిన వ్యాధులకు, డెంటల్-పంటికి సంబంధించిన వ్యాధులకు అన్ని రకముల వ్యాదులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు అందజేయనున్నట్లు వారు తెలిపారు. ఈ అవకాశాన్ని ఈ ప్రాంతం ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

దళిత బంధు పథకం వచ్చే ఎన్నికలకు ఎర

- కాంగ్రెస్ మండల అధ్యక్షులు రామనాథం

నవతెలంగాణ-పినపాక



దళిత బంధు పథకం వచ్చే ఎన్నికలకు ఎరగా మాత్రమే ఉపయోగిస్తున్నారని దళితులకు పెద్దగా ఒరిగేది ఏమీ లేదని కాంగ్రెస్ మండల అధ్యక్షులు రామనాథం విమర్శించారు. శనివారం పినపాక మండలం క్రాస్ రోడ్డులో గల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బీఆర్ఎస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. స్థానిక ఎమ్మెల్యే రేగా కాంతారావు కాళ్ల మొక్కిన నాయకులకు వారి వెంట తిరిగే నాయకులకు మాత్రమే దళిత బందు ఇస్తున్నారని ఆరోపించారు. నిజమైన పేద దళితులకు ఈ పథకం వర్తించటం లేదన్నారు. నిజంగా పేదవాడిపై మీ పార్టీకి ప్రేమే ఉంటే పేదల అభివృద్ధి చెందాలంటే మండలంలో సుమారు 500 కుటుంబాలు నిరుపేద దళితులను చూపిస్తానని, వారందరికీ దళిత బంధు మంజూరు చేసి చూపిస్తే స్వయంగా గులాబీ కండువా కప్పుకుంటానన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి ఓటుతోనే బుద్ధి చెబుతారని అన్నారు. ఈ సమావేశంలో కొమరం వెంకటేశ్వర్లు, కొంబత్తిని శ్రీను, అత్తె లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

వ్యకాస రాష్ట్ర కమిటీ సభ్యుడిగా చిరంజీవి

నవతెలంగాణ-అశ్వారావుపేట



వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులుగా అశ్వారావుపేటకు చెందిన బి.చిరంజీవి మరో సారి ఎన్నికయ్యారు. గత రెండు రోజులుగా ఖమ్మం పట్టణంలో జరుగు తున్న ఈ సంఘం మహాసభలు శనివారంతో ముగిసాయి. చివరి రోజు సభలు ప్రతినిధులతో రాష్ట్ర కమిటీ ఎన్నిక అయింది. ఇందులో భాగంగా ఈ సంఘం మండల అధ్యక్షుడుగా విధులు నిర్వహిస్తున్న చిరంజీవికి రాష్ట్ర కమిటీలో రెండో దఫా బెర్త్ లభించింది. ప్రస్తుతం ఈయన పార్టీ మండల నాయకత్వంలో ప్రధాన బాధ్యతల్లో ఉన్నారు. ఈయన ఎంపిక పట్ల పార్టీ, సంఘం శ్రేణులు, కుటుంబ సభ్యులు, మిత్రులు, పలువురు రాజకీయ నాయకులు అభినందనలు తెలిపారు.

పుట్టి జాన్ మృతి పార్టీకి తీరని లోటు

- మాజీ డీసీసీబీచైర్మెన్ యలమంచి

నవతెలంగాణ-దుమ్ముగూడెం



మండలంలోని తూరుబాక గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు పుట్టి జాన్(62) మృతి పార్టీకి తీరని లోటని మాజీ డీసీసీబీ చైర్మన్ యలమంచి రవికుమార్ అన్నారు. అనారోగ్యంతో మృతి చెందిన్ జాన్ మృతదేహాన్ని ఆయన సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. దివంగత నాయకులు అమరజీవి యలమంచి సీతారామయ్య, బొల్లి రాములుతో కలసి ఈ ప్రాంతంలో రైతు కూలీ పోరాటాల్లో చురుగ్గా పాల్గొన్నారని అన్నారు. పార్టీకి జాన్ అందించిన సేవలు మరువలేనివి అన్నారు. పార్టీ జాన్ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. నివాళులు అర్పించిన వారిలో మండల కార్యదర్శి కారం పుల్లయ్య, మండల కార్యదర్శివర్గ సభ్యులు బొల్లి సూర్యచందర్‌రావు, తూరుబాక ఉపసర్పంచ్ బొల్లి సత్యనారాయణ, శాఖా కార్యదర్శి కుమ్మరికుంట సాంబశివ రావు, సర్పంచ్ భూక్యా చందు, నాయకులు చందు, సాయిబాబు, ఈశ్వర్‌రెడ్డి, నర్సింహాచారి, నాగిరెడ్డి, బిళ్లా ముత్యాలరావు, సతీష్ తదితరులు ఉన్నారు.

విజయవంతమైన టీఎల్ఎమ్ మేళా

నవతెలంగాణ-దుమ్ముగూడెం

మండలంలోని లక్ష్మీనగరం గిరిజన బాలికల వసతి గృహంలో శనివారం నిర్వహించిన మండల స్థాయి టీఎల్ఎమ్ మేళా విజయవంతమైంది. మండల మేళాను ఎంపీపీ రేసు లక్ష్మీ, జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ ప్రారంభించారు. ఈ మేళాలో మండల పరిషత్, ప్రాదమిక, ప్రాదమికోన్నత, గిరిజన ప్రాదమిక పాఠశాలతో పాటు ఆశ్రమ ప్రాదమిక పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు తయారు చేసిన భోదన అబ్యాసన ఉపకరణాలను ప్రదరించారు. టీఎల్ఎమ్ మేళా మండల నోడల్ అధికారి కెవి కాంతారావు మాట్లాడుతూ విద్యార్థుల మౌళిక భాష, గణిత సామర్ద్యాలే లక్ష్యంగా మండల స్థాయి టీఎల్ఎమ్ మేళా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

ఈ మేళాలో ఉపాధ్యాయులు తయారు చేసిన బోదనోపకరణాలను ప్రదర్శించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండలవిద్యాశాఖ అధికారి సున్నం సమ్మయ్య, ఎంపీడీఓ ఎం.చంద్రమౌళి, ఎంఆర్‌జి ఏజె ప్రభాకర్, ఆశ్రమపాఠశాల ప్రదానోపాధ్యాయురాలు ధనసరి నాగమణితో పాటు కాంప్లెక్స్ ప్రదానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారిశుధ్యానికి రేగా రెండు లక్షల వితరణ

నవతెలంగాణ-మణుగూరు

మణుగూరు పట్టణ పరిశుభ్రతకి ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.2 లక్షలు చెక్కును అందజేసినట్లు ప్రభుత్వ విప్ రేగా కాంతారావు తెలిపారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం మణుగూరు పట్టణ పరిశుభ్రతకి 22 రోజులపాటు ప్రతిరోజు 20 మంది పారిశుధ్య కార్మికులు పని చేసినందుకు రేగా విష్ణు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని వివిధ వార్డులలో సైడ్ డ్రైనేజ్ శుభ్రం కోసం ఆయన ఒక ముందు అడుగు వేసి, పరిశుభ్రత కోసం ప్రత్యేక కృషి చేస్తున్నారు. పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



10వ తేదీ నాటికి మోడల్ పాఠశాలల పనులు పూర్తి చేయాలి

- రాష్ట్ర విద్యా, సంక్షేమ, మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మెన్ శ్రీధర్‌రెడ్డి

నవతెలంగాణ-కొత్తగూడెం



జనవరి 10వ తేదీ వరకు ప్రతి మండలంలో ఎంపిక చేసిన రెండు మోడల్ పాఠశాలల పనులు పూర్తి చేయాలని రాష్ట్ర విద్యా, సంక్షేమ, మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ రావుల శ్రీధర్ రెడ్డి తెలిపారు. శనివారం కలెక్టరేట్ సమావేశపు హాలులో మన ఊరు-మనబడి పనులపై విద్యా, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించి విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించేందుకు మన ఊరు-మనబడి కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టినట్లు చెప్పారు. రాష్ట్రంలో మొదటి విడత కింద మన ఊరు-మనబడిలో 9123 పాఠశాలలను ఎంపిక చేసినట్లు చెప్పారు. దాదాపు 9 వేల పై చిలుకు కోట్లతో మరమ్మతు పనులు చేపట్టినట్లు ఆయన వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పనకు దాతల నుండి విరాళాలు సేకరించాలని చెప్పారు. పాఠశాలలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థుల సహకారం తీసుకోవాలని చెప్పారు. జనవరి 7వ తేదీలోగా ఉపాధిహామి పథకం ద్వారా చేపట్టనున్న అన్ని పనులు గ్రౌండింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని చెప్పారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రాధాన్యతతో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని శ్రద్ధతో పర్యవేక్షణ చేయాలని చెప్పారు. విద్య మాత్రమే మనిషిని ఉన్నత శిఖరాలకు చేర్చగలదని, అంతటి ప్రాధాన్యత ఉన్న పాఠశాలలు మంచి వాతావరణం ఉండాలని చెప్పారు. శనివారం ఇల్లందు, టేకులపల్లి, బూర్గంపాడు, కొత్తగూడెం మండలాల్లో 8 పాఠశాలలను తనిఖీ చేశానని, పనులు బాగా జరుగుతున్నాయని మిగిలిన పాఠశాల్లో కూడా ఇదే స్ఫూర్తితో పనులు పూర్తి చేయాలని చెప్పారు. మార్చి మాసాంతం వరకు నిర్దేశించిన అన్ని పాఠశాలలను పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని సూచించారు. నిధులు కొరత లేదని పనులను వేగవంతం చేయాలని ఆయన వివరించారు. జిల్లాలో ఈ పథకం ద్వారా చేపట్టిన పనులు శరవేగంగా జరుగుతున్నాయని ఆయన హర్షం వ్యక్తం చేస్తూ ఇంజనీరింగ్ అధికారులను అభినందించారు. భద్రాద్రి జిల్లా పనుల పురోగతిలో రాష్ట్ర స్థాయిలో 3వ స్థానంలో ఉన్నట్లు ఆయన తెలిపారు. కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ జిల్లాలో మొదటి విడత మన ఊరు-మన బడి కార్యక్రమానికి 368 పాఠశాలలను ఎంపిక చేసినట్లు చెప్పారు. 30 లక్షలలోపు మరమ్మత్తులు చేపట్టాల్సిన పాఠశాలలు 324 ఉన్నాయని, రూ.30 లక్షల కంటే ఎక్కువ ఉన్న పాఠశాలలు 44 ఉన్నట్లు చెప్పారు. ఉపాధిహామి పథకం ద్వారా రూ.15.50 కోట్లకు ఎఫ్ ఓలు జనరేట్ చేసినట్లు చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఈఈ నాగేషు, ఆర్ అండ్ బి ఈఈ భీమ్లా, గిరిజన సంక్షేమ శాఖ ఈఈ తానాజి, ఇరిగేషన్ ఈఈ సురేష్, డిఆర్డిఓ మధుసూదన్ రాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ స్కీములను రక్షించండి

- జనవరి 6న మండల, జిల్లా కేంద్రాలలో ధర్నాలు

నవతెలంగాణ-చర్ల



సీఐటీయూ అంగన్ వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రభుత్వ స్కీముల పరిరక్షణ కోసం జనవరి 6వ తేదీన దేశవ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలు, జిల్లా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు, ధర్నా కార్యక్రమాలను జయప్రదం చేయాలని సీఐటీయూ అనుబంధ తెలంగాణ అంగన్ వాడీటీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు మైపా.విజయశీల పిలుపునిచ్చారు. తేగడ, ఆర్.కొత్తగూడెం సెక్టార్ల అంగన్ వాడీ యూనియన్ కార్యకర్తల సమావేశం కుదునూరులో చిలకమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో విజయశీల పాల్గొని మాట్లాడారు. ఐఎల్ఓ సిఫార్సుల ప్రకారం స్కీమ్ వర్కర్ల అందరినీ కార్మికులుగా గుర్తించాలని, చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. స్కీం వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ స్కీములకు బడ్జెట్ కోత పెడుతుందని ఫలితంగా ప్రభుత్వ స్కీములు నిర్లక్ష్యం చేయబడుతున్నాయని విమర్శించారు. ప్రభుత్వ స్కీములు ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పేదలకు అనేక రకాల పౌర సేవలు అందుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ స్కీముల ప్రయివేటీకరణ వల్ల పౌర సేవల నుండి ప్రభుత్వం వైదొలుగుతుందని విమర్శించారు. ఐసీడీఎస్ ఎన్ఆర్హెచ్ఎం మధ్యాహ్న భోజనం పథకం గ్రామీణ ఉపాధి హామీ, ఐకేపీ తదితర పథకాలను ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులు పెంచి పటిష్ట పరచాలని ఆమె డిమాండ్ చేశారు.

స్కీమ్ వర్కర్ల అందరికీ పిఎఫ్, ఈఎస్ఐ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. జనవరి 6వ తేదీన అన్ని మండల కేంద్రాల్లో తహసీల్దార్ కార్యాలయాలు, కలెక్టరేట్ ముందు ధర్నాలు నిర్వహించాలని ఈ ధర్నాల్లో స్కీం వర్కర్లు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. స్కీం వర్కర్లకు ప్రభుత్వం అమలు చేస్తున్న కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పలు రకాల పెన్షన్లు వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. సమస్యలపై సూపర్ వైజర్ ఆదిలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. సమావేశంలో యూనియన్ నాయకురాళ్ళు కమలమనోహరి, పుష్ప, కృష్ణవేణి, త్రివేణి, సావిత్రి, లక్ష్మి, శోభారాణిరాణి, నర్సమ్మ, సుభద్ర, శమంతకమణితరులు పాల్గొన్నారు.



రెగ్యూలర్ డాక్టరమ్మగా 'వసుందర'

నవతెలంగాణ-దుమ్ముగూడెం

దుమ్ముగూడెం మండలంలో మొబైల్ వైద్యాధికారిగా కొన్నేళ్ల పాటు కాంట్రాక్ట్ బేసిక్‌లో వైద్య సేవలు అందించి ఈ ప్రాంత ప్రజల మన్ననలను పొందిన వైద్యాధికారి వసుందర రెగ్యూలర్ డాక్టరమ్మగా నియమితులయ్యారు. నియామకపు ఉత్తర్వులను వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు చేతుల మీదుగా హైదరాబాద్ హైటెక్ సిటీలో షిల్పా కళావేదికలో జరిగిన కార్యక్రమంలో శనివారం అందుకున్నారు. తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ సర్వీస్ రిక్రూట్ బోర్డు నిర్వహించిన ఎంపికలో ఆమె రాష్ట్ర స్థాయిలో 6వ ర్యాంకు, మల్టీ జోన్ పరిధిలో 2వ ర్యాంకు సాదించారు. దీంతో ఆమెను ఖమ్మం పరిధిలోని సుబ్లేడ్ ప్రభుత్వ వైద్యశాల రెగ్యులర్ వైద్యాధికారిగా వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు నియమించారు. రెగ్యులర్ వైద్యాధికారిగా నియమించబడిన వసుందరను పలువురు అభినందించారు.

ముక్కోటికి ముస్తాబైన పర్ణశాల

- శ్రీ కృష్ణావతారంలో పర్ణశాల రామయ్య
- నేడు తెప్పోత్సవం

నవతెలంగాణ-దుమ్ముగూడెం



భద్రాచల రామాలయానికి అనుబంధ ఆలయమైన పర్ణశాల శ్రీ సీతారామచంద్రస్వామి వారిలో ఆలయంలో జరుగుతున్న వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలలో భాగంగా పర్ణశాల రామయ్య దశవతారంలో భాగంగా శనివారం కృష్ణావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవకి వసుదేవులకు అష్టమసంతానంగా అవతరించి దుష్టులైన కంసుడు నరకాసురుడు శిశుపాలుడు మొదలైన వారిని వధించి ధర్మవర్తనులైన పాండవుల పక్షం వహించి, కురుక్షేత్ర సంగ్రామంలో ఉపనిషత్తుల సారాంశమైన భగవద్గీతను అర్జునికి భోదించి మానవ ఆదర్శాలను, ధర్మాన్ని స్థాపించిన శ్రీమన్నారాయణుని పరిపూర్ణ అవతారం శ్రీ కృష్ణావతారం. చంద్రగ్రహ బాధలు ఉన్నవారు ఈ అవతారాన్ని ధరించడం వలన శుభ ఫలితాలు పొందుతారని పురాణాలు చెబుతున్నట్లు పురోహితులు శేషం కిరణ్‌కుమారా ఆచార్యులు, భార్గవాచార్యులు, వెంకటాచార్యులు తెలిపారు. మద్యాహ్నం 2 గంటలకు ఆలయ ఆవరణలో హరికధాకాలక్షేపం నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటలకు స్వామి వారి ఉత్సవ విగ్రహాలను గ్రామ పుర వీధుల్లో మేళ తాళాలు మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు స్వామివారి తిరుమల ఆరాధన కార్యక్రమం అనంతరం 7.30 గంటలకు స్వామివారి ఆరగింపు వంటి విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జీ చంటికుమార్, సిబ్బంది రాము, శివతో పాటు భక్తులు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ముక్కోటికి ముస్తాబైన పర్ణశాల : వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాల సందర్భంగా పది రోజుల పాటు శ్రీమన్నారాయణుడు 10 రోజుల పాటు వివిద అవతారాలలో భక్తులకు దర్శనమిచ్చాడు. ముక్కోటి సందర్భంగా నిర్వహించే తెప్పోత్సవం, ఉత్తర ద్వార దర్శనం కోసం అన్ని ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. నేడు జరిగే తెప్పోత్సవం కోసం గోదావరిలో సీతా రామ లక్ష్మణ స్వాముల వారిని విహరింప జేసేందుకు హంస వాహనాన్ని సిద్ధం చేశారు. తెప్పోత్సవం, ముక్కోటి స్నానాల కోసం వచ్చే భక్తుల కోసం గోదావరిలో ట్రెంచ్ ఏర్పాటు చేయడంతో పాటు గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచారు.

గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో : ముక్కోటి సందర్భంగా పర్ణశాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పర్ణశాల గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుధ్య పనులను పంచాయతీ సర్పంచ్ తెల్లం వరలక్ష్మీ, కార్యదర్శి ప్రసాదరెడ్డిలు దగ్గర ఉండి పర్యవేక్షిస్తున్నారు. గోదావరి ప్రాంతంలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడంతో పాటు, డ్రస్సింగ్ రూమ్‌లను అందుబాటులో ఉంచారు. దీంతో పాటు మంచినీటి వసతి, భక్తులు సేద తీరేందుకు షామియానాలను సిద్ధం ఉంచారు.



మనుగడ హక్కులపై అవగాహన పెంచే చైతన్య దీప్తి నవతెలంగాణ

- పాల్వంచ మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్
- 2023 నవతెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-పాల్వంచ



ప్రజా పోరాటాలకు సారధిగా ప్రజా ఉద్యమాలకు వారధిగా మనుగడ హక్కుల పై అవగాహన పెంచే చైతన్య దీప్తిగా నవతెలంగాణ దినపత్రిక వెలుగొందాలని పాల్వంచ మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ ఆకాంక్షించారు. 2023 నూతన సంవత్సర నవతెలంగాణ క్యాలెండర్‌ను స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవతెలంగాణ పత్రిక సిబ్బందికి, పాల్వంచ పట్టణం ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పత్రిక వ్యాపార ధోరణులకు వ్యతిరేకంగా నియమిస్తూ జర్నలిస్టు ప్రపంచంలో ఆధునిక పద్ధతులను సంతరించుకుంటూ పరుగు పందెంలో పోటీ పడడాన్ని హర్షించారు. ప్రజల పత్రిక నవతెలంగాణని ప్రజల పక్షపాతం దాని విధానంగా నిర్భీతి నిజాయితీగా కాసులకు దాని కలం లొంగకుండా జండానికి తలదించకుండా ప్రజల కోసం ప్రగతి కోసం నవతెలంగాణ పనిచేస్తుండడం అభినందనీయమని అన్నారు. ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించేలా కృషి చేయాలని సూచించారు. బలమైన ప్రత్యామ్నాయ ప్రజావాణి కావాలని అన్నారు. ఈ ఆవిష్కరణలో యూరో ఎంటర్ప్రైజెస్ మేనేజర్ హరిబాబు, డీఈ మురళి, ఏఈ రాజేష్, టీపీఓ ఎం.సత్యనారాయణ, మేనేజర్ ప్రసాద్, రామ్మూర్తి, రవిప్రసాద్, సతీష్, సూరిబాబు, రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలు లేకుండా అనుకున్న లక్ష్యం

- డిసెంబర్ మాసంలో 102 శాతం బొగ్గు ఉత్పత్తి
- విలేకర్ల సమావేశంలో జీఎం

నవతెలంగాణ-కొత్తగూడెం



బొగ్గు ఉత్పత్తిలో ఈ ఏడాది ఎలాంటి ప్రమాదాలు లేకుండా అనుకున్న బొగ్గు లక్ష్యం సాధించామని, ఏరియాలో డిసెంబర్ మాసంలో 102 శాతం బొగ్గు ఉత్పత్తి చేసి ప్రథమ స్థానంలో నిలిచిందని, ఇదే స్ఫూర్తితో కార్మికులు, ఉద్యోగుల సింగరేణి 2022-23 వార్షిక లక్ష్యం అధిగ మించాలని కొత్తగూడెం ఏరియా జీఎం జక్కం రమేష్ తెలిపారు. శనివారం ఏరియా జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసన విలేకర్ల సమావేశంలో వివరాలు తెలిపారు. కొత్తగూడెం ఏరియా 2022-23 డిసెంబర్ నెల వరకు ఉత్పత్తి, పని తీరుపై ఆనందం వ్యక్తం చేశారు. 2022-23 ఆర్థిక సంవత్సరం డిసెంబర్ నెల కొత్తగూడెం ఏరియాకు నిర్దేశించబడినది 14.01 లక్షల టన్నుల ఉత్పత్తి లక్షానికి గాను 13.67 లక్షల టన్నులు ఉత్పత్తి చేసి 98 శాతం ఉత్పత్తి సాధించడం జరిగిందని తెలిపారు. కొత్తగూడెం ఏరియా 2022-23 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుండి డిసెంబర్ వరకు 99.41 లక్షల టన్నులకు గాను 87.69 లక్షల టన్నులు ఉత్పత్తి చేసి 88శాతం ఉత్పత్తి సాదించామని తెలిపారు. ఉత్పత్తి చేసిన బొగ్గును నిర్ణీత సమయంలో రోడ్డు, రైల్ మార్గాల ద్వారా వినియోగ దారులకు చేరవేసినట్లు తెలిపారు. డిసెంబర్ మాసంలో కొత్తగూడెం ఏరియాకు నిర్దేశించిన 14.01 లక్షల టన్నుల ఉత్పత్తి లక్షానికి గాను 14.31 లక్షల టన్నులు ఉత్పత్తి చేసి 102 శాతం ఉత్పత్తి సాధించడం జరిగిందన్నారు. కొత్తగూడెం ఏరియా 2022-23 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుండి డిసెంబర్ వరకు 99.41 లక్షల టన్నులకు గాను 92.55 లక్షల టన్నులు బొగ్గు రవాణా జరిగిందని చెప్పారు. గత ఏడాది మే 28వ తేదీనుండి సత్తుపల్లి నుండి వివిధ ప్రాంతాలకు రైలు మార్గంలో బొగ్గు రవాణా చేస్తున్నామని తెలిపారు. సత్తుపల్లి జెవిఆర్ ఓసికి నిర్దేశించిన 100 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. జనవరి నుండి ఇప్పటి వరకు ఎలాంటి ఆలంకం లేకుండా సత్తుపల్లి జెవిఆర్ ఓసి, కృష్టారం ఓసి నుండి బొగ్గు ఉత్పత్తి చేసి, నిర్ణీత సమయంలో వినియోగదారులకు అందజేసిన ఘనత కొత్తగూడెం ఏరియాకు దక్కుతుందని చెప్పారు. కొత్తగూడెం వికే ఓసి మే 2023 నాటికి ఉత్పత్తి ప్రారంభమయ్యే అవకాశం ఉందని చెప్పారు. కొంత అటవీశాఖ, కాలుష్య నియంత్ర మండలి వారి అనుమతులు రావాల్సి ఉందని తెలిపారు.

ఈ విలేకరుల సమావేశంలో ఏరియా ఎస్ఓటు జీఎం ఆర్.నారాయణ రావు, జికెటీసీ ప్రాజెక్టు ఆఫీసర్ రమేష్, ఇంచార్జ్ కొత్తగూడెం ఏరియా ఇంజనీర్ కె.వెంకటేశ్వర్లు, ఏజెంట్ బూర రవీందర్, ఏజీఎం (సివిల్) సూర్యనారాయణ, డిజీఎం.(పర్సనల్) సామూయెల్ సుధాకర్, డి.జి.ఎం.(ఎఫ్.అండ్ఏ) రాజశేఖర్, డి.జి.ఎం (ఐ.ఈ) యోహాన్, ఏరియా వర్క్ షాప్ ఎస్.ఈ (ఈ అండ్ ఏం) శ్రీకాంత్, పర్సనల్ మేనేజర్ డి.కిరణ్ బాబు, సీనియర్ సెక్యూరిటి ఆఫీసర్ రమనా రెడ్డి, సీనియర్ పిఓ.లు మజ్జి మురళి, జి.సుధాకర్, లవన్ కుమార్, ఎస్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ సాగర్, ఉమర్, భరత్, రమాల ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్రాక్ షూట్లు పంపిణీ

నవతెలంగాణ పాల్వంచ

తెలంగాణ సోషల్ వెల్ఫేర్ గురుకుల కళాశాల సీఓఈ పాల్వంచ 400 మంది విద్యార్థులకు ట్రాక్ షూట్లను శనివారం పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు అధ్యాపకుల సమక్షంలో జిల్లా పేరెంట్స్ కమిటీ అధ్యక్షులు పండగ పురుషోత్తం, సీఓఈ పాల్వంచ పేరెంట్ కమిటీ జనరల్ సెక్రెటరీ రాయపూడి లక్ష్మయ్య లక్ష్మీదేవి పల్లి గ్రామపంచాయతీ సెక్రటరీ విద్యార్థులకు వీటిని పంపిణీ చేశారు. ఇంకా 240 అవసరం ఉన్నది, వీటిని త్వరలో పంపిణీ చేస్తామని ప్రిన్సిపాల్ తెలియజేశారు. ఈ విషయం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు, పేరెంట్స్ కమిటీ ఆనందం వ్యక్తం చేశారు.

ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు : కలెక్టర్

నవతెలంగాణ-కొత్తగూడెం



భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ ప్రజలకు ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ నూతన సంవత్సరంలో ప్రజలందరి సహకారంతో ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అమలులో మన జిల్లాను అభివృద్ధిలో రోల్ మోడల్‌గా నిలిపేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఈ నూతన సంవత్సరం ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని, ప్రతి కుటుంబంలో ఆనందం, సంతోషం వెల్లి విరియాలని ఆకాంక్షించారు.

నూతన సంవత్సర శుభాకాంక్షలు

- ఎమ్మెల్యే హరిప్రియ, చైర్మెన్లు డివి, హరిసింగ్, దిండిగాల

నవతెలంగాణ-ఇల్లందు



నియోజవర్గ పట్టణ ప్రజలకు ఎమ్మెల్యే హరిప్రియ, మున్సిపల్ చైర్మెన్ డివి, మార్కెట్ కమిటీ చైర్మెన్ హర్సింగ్ నాయక్, గ్రంథాలయ సంస్థ చైర్మెన్ రాజేందర్ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. 2022 సంవత్సరానికి వీడ్కోలు 2023 సంవత్సరానికి స్వాగతం పలికారు.

ప్రజలందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. పట్టణంలోని సాహితి డిగ్రీ కాలేజ్, మార్గదర్శిని గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌లో జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో మున్సిపల్ చైర్మెన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పట్టణ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నర్సారెడ్డి



నవతెలంగాణ-భద్రాచలం

భద్రాచలం పట్టణ ప్రజలకు 2023 నూతన సంవత్సర శుభాకాంక్షలు సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ.నర్సారెడ్డి తెలిపారు. ఈ నూతన సంవత్సరం ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని, ప్రతి కుటుంబంలో ఆనందం, సంతోషం వెల్లి విరియాలని ఆకాంక్షించారు. రాబోయే కాలంలో భద్రాచలం అభివృద్ధి కోసం సమిష్టిగా అందరం కలిసి కృషి చేద్దామని తెలియజేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

104 శాతం బొగ్గు ఉత్పత్తి : జీఎం

ఇల్లందు : డిసెంబర్-2022 నెలకు నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి 4.77లక్షల టన్నులకు గాను 4.96 లక్షల టన్నుల బొగ్గు తీసి మొత్తం 104 శాతం ఉత్పత్తి చేయడం జరిగిందని జీఎం ఎం.షాలేమురాజు తెలిపారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన పత్రికా విలేఖరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. 3.48 లక్షల టన్నుల బొగ్గు రైల్వే మార్గం ద్వారా, 0.71 లక్షల టన్నులు రోడ్డు మార్గం ద్వారా, ఆర్‌సీహెచ్‌పీ ద్వారా 1.34 లక్షల టన్నులు మొత్తం 5.53 లక్షల టన్నుల బొగ్గు బట్వాడా చేయడం జరిగింది. డిసెంబర్ నెలలో 94 రేకుల ద్వారా బొగ్గు రవాణా చేసామని తెలిపారు. రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తికి కృషి చేయడం పట్ల సంబంధిత అధికారులు ఉద్యోగులను, సూపర్వైజర్లను జీఎం ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమావేశంలో ఏజీఎం (ఐఈడీ)యం.గిరిధరరావు, ఎం.టి.(పర్సనల్) సాయిస్వరూప్ పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ భద్రాద్రి జిల్లా కో-ఆర్డినేటర్‌గా డాక్టర్ ఎల్.గోపి



కొత్తగూడెం : ఆరోగ్యశ్రీ భద్రాద్రి జిల్లా కో-ఆర్డినేటర్‌గా డాక్టర్ ఎల్.గోపి నియమితులయ్యారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆయన డీసిహెచ్ డాక్టర్ రవిబాబు, ఆరోగ్యశ్రీ జిల్లా మేనేజర్ శ్రీనువాస్‌తో కలిసి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం పాల్వంచ గవర్న మెంట్ హాస్పటల్‌లో జిల్లాలోని ఆరోగ్యమిత్రలతో సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ తెల్లరేషన్ కార్డు దారులందరికీ ఆరోగ్యశ్రీ సేవల కు అర్హులని, అలాగే ఆయుష్మాన్ భారత్ ద్వారా ప్రతి కుటుంబం రూ.5 లక్షల వరకు ఉచితంగా వైద్యసేవలు పొందే అవకాశం ఉందని తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని వైద్య విధానపరిషత్ ఆస్పత్రలతో పాటు పిహెచ్‌సీలను ఆరోగ్యశ్రీ సేవలు అందిస్తునామని చెప్పారు. బాద్యతలు స్వీకరించిన జిల్లా కో- ఆర్డినేటర్ కి ఆరోగ్యశ్రీ జిల్లా మేనేటర్ శ్రీనివాస్, టీమ్ టీడర్లు హరిప్రసాద్, మహేశ్వర్, జగదీష్, ఆరోగ్యశ్రీ సిబ్బంది పుష్పగుచ్చం అందించి శుబాకాంక్షలు తెలిపారు.

జూనియర్ కళాశాలలో నూతన సంవత్సర వేడుకలు

దుమ్ముగూడెం : మండలంలోని దుమ్ముగూడెం గ్రామంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా 2023 నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.వెంకటేశ్వర్లు 10 కేజీల భారీ కేక్ కట్ చేసి విద్యార్థులకు, అధ్యాపకులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరంలో విద్యార్థుల కుటుంబాలు ఆనందంగా గడపాలని అన్నీ విజయాలే సిద్ధించాలని పరీక్షల్లో మంచి మార్కులతో ర్యాంకులు సాదించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకుంటూ సంబురాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డబుల్ ఇండ్లు ఇవ్వాలి : సున్నం గంగా

భద్రాచలం : భద్రాచలం పట్టణంలో నిర్మిస్తున్నటువంటి డబల్ బెడ్ రూమ్ ఇండ్లు మనుబోతుల చెరువు కాలనీలో నిర్మించే ఇండ్లు అక్కడి వారికి ఇవ్వాలని ఆ ప్రాంతం మాజీ వార్డు మెంబర్ సున్నం గంగా పేర్కొన్నారు. శనివారం తహసీల్దార్‌కు కాలనీ వాసులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఇక్కడ నివసిస్తున్నటువంటి 15 మందిని ఆనాడు ఎమ్మెల్యేగా ఉన్న రాజయ్య సమక్షంలో తహసీల్దార్ రామకృష్ణ, పీఓ రాజీవ్ గాంధీ, ఆర్డీవో శివ నారాయణ రెడ్డి అందరూ వారిని రిక్వెస్ట్ చేసి మీకు డబల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మించిన తర్వాత మీ అందరికీ ఇల్లు ఇస్తామని హామీ ఇచ్చి, ఖాళీ చేయించినారన్నారు. అట్టి స్థలంలోనే నేడు డబల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మించినందున స్థానిక అధికారులు వారికి ముందుగా ఇల్లు కేటాయించాలని కోరారు. ఇండ్లు కేటాయించక పోతే పైఅధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టి తీసుకెళ్తామన్నారు. ఈ వినతి పత్రం ఇచ్చిన వారిలో ఆ ప్రాంత నాయకులు జి.లక్ష్మణ్, బంటు రామకృష్ణ, కళావతి, నిర్వాసితులు పాల్గొన్నారు.

ఐటీసీ ఐఎన్‌టీయూసీ క్యాలెండర్ ఆవిష్కరణ



బూర్గంపాడు : 2023 నూతన సంవత్సరం సందర్భంగా ఐటీసీలో ప్రధాన ప్రతిపక్ష మైన ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నూతన క్యాలండర్‌ను శనివారం ఐటీసీ యూనిట్ హెడ్ సిద్ధార్థ మొహంతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022 అందరికీ సంతోషంగా ముగిసిందని ఆయన అన్నారు. ఈ కొత్త సంవత్సరం కూడా అంతే ఆనందంతో సుఖ సంతోషాలతో, అష్టైశ్వర్యాలతో అందరూ సంతోషంగా ఉండాలని ఆయన అన్నారు. కార్మికుల కుటుంబాలలో అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీసీ డీజీఎం హెచ్‌ఆర్ శైలేందర్, శ్యామ్ కిరణ్, టీఎస్ భాస్కర్, రాంబాబు, రాష్ట్ర ఐఎన్టీ యూసీ నాయకులు మారం వెంకటేశ్వర రెడ్డి, ఐటీసీ అధ్యక్షులు గోనె రామారావు, ప్రధాన కార్యదర్శి యారం పిచ్చిరెడ్డి, అబ్దుల్ సలీం, కేసుపాక నర్సింహా రావు, టి.వెంకటేశ్వర్లు, సింగమనేని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు కింద పడి వ్యక్తి మృతి

మణుగూరు : బస్సు కింద పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు కింద పడి రాజ్ కుమార్ అనే ప్రయాణికుడు మృతి చెందాడు. మృతుడు భూపాలపల్లికి చెందిన వాడుగా గుర్తించారు. బస్సులో సీటు నిలుపుదల చేసే క్రమంలో ఈ ఘటన చోటు చేసుకుందిదని స్థానికులు తెలిపారు. మృతుడు రాజకుమార్ పివి కాలనీలో తన మేనమామ అస్వస్థకు గురవడంతో పరామర్శించడానికి వచ్చి తిరుగు ప్రయాణంలో ఈ విషాదం చోటుచేసుకుందన్నారు.

రేగా కాంతారావుని కలిసిన కామేష్

మణుగూరు : ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రేగా కాంతారావును సోసైటీ డైరెక్టర్ పటేల్ కామేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్లాంకెట్‌లు పంపిణీ చేసిన జడ్పీటీసీ

అశ్వారావుపేట : మండలంలోని పెద్దవాగు ప్రాజెక్టు భవన సముదాయం సమీపంలో గల గిరిజన సంక్షేమ శాఖ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఆ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కళాశాల ప్రిన్సిపాల్ రోజా ఆధ్వ ర్యంలో విద్యార్థినీలకు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న బ్లాంకెట్‌లను శనివారం పంపిణీ చేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జడ్పీటీసీ వరలక్ష్మి హాజరై ఆమె చేతులు మీదుగా విధ్యార్థినీలకు అందజేసారు. అనంతరం విద్యార్థినీలను ఉద్దేశించి మాట్లాడుతూ రాబోతున్న యూనివర్సిటీ పరీక్షలలో మంచి మార్కులు సాధించాలని కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఎన్ని సమస్యలున్నా ధైర్యంగా ముందుకెళ్లాలని అన్ని వేళలా సహాయ సహకారాలు అందజేస్తానని బరోసా కల్పించారు. ఇందులో వైస్ ప్రిన్సిపాల్ జి.జయ, వార్డ్ మెంబర్ రమణ, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

www.praja.khammam@gmail.com

నవతెలంగాణ

భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం 01 జనవరి 2023

జనవరి 2న డయల్ యువర్ డీఎం

కొత్తగూడెం కొత్తగూడెం డిపో అభివృద్ధి కోసం ప్రయాణికుల నుండి విలువైన సూచనలు కోసం జనవరి 2న డయల్ యువర్ డీఎం ప్రోగ్రాం ఉదయం 11 గంటల నుండి 12 గంటల వరకు నిర్వహిస్తున్నట్టు కొత్తగూడెం డిపో మేనేజర్ బాణాల వెంకటేశ్వరావు తెలిపినారు. ఆర్టీసీ శ్రేయోభిలాషులు, డిపో అభివృద్ధి కోసం తమ విలువైన సూచనలు, సలహాలు ఇవ్వాలని, కొత్తగూడెం డిపో పరిధిలో గల వ్యాపారస్తులు, ఉద్యోగులు, విద్యార్థులు, ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపినారు.డయల్ చేయవలసిన నెంబర్-9959225959. తెలిపారు.



భద్రాద్రిలో నేడు రాములోరి తెప్పోత్సవం



నవతెలంగాణ-భద్రాచలం

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం సన్నిధిలో నిర్వహిస్తున్న శ్రీ వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం భద్రాద్రి రాముడు గోదావరి నది తీరంలో విహరించనున్నారు. ఈ స్వామివారి తెప్పోత్సవం వేడుకకు సంబంధించి దేవస్థానం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. హంస వాహనాన్ని సిద్ధం చేశారు. గోదావరి తీరంలో ప్రత్యేక ర్యాంపును ఏర్పాటు చేశారు. గోదావరిలో శ్రీ సీతారామచంద్రస్వామి వారు ఐదుసార్లు జలవిహారం చేస్తారు. అర్చక స్వాములు సాంప్రదాయ బద్ధంగా ఈ వేడుకలు నిర్వహిస్తారు. భారీ ఎత్తున ఈ సందర్భంగా బాణాసంచా కాల్చనున్నారు. ఇదిలా ఉండగా సోమవారం వేకువ జామున ఉత్తర ద్వార దర్శనం వేడుక జరగనుంది. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. భద్రాద్రి రామాలయం విద్యుత్ కాంతులతో దేదీప్యమానంగా వెలుగొందుతోంది. ఈ ప్రధాన వేడుకలకు రాష్ట్ర నలుమూలల నుంచి భారీ ఎత్తున భక్తులు హాజరుకానున్న నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది.

శ్రీకృష్ణ అవతారంలో భద్రాద్రి రాముడు : ముక్కోటి ఉత్సవాలలో భాగంగా శనివారం భద్రాద్రి రాముడు శ్రీకృష్ణ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు భద్రాద్రి రాముని దర్శించుకుని పునీతులయ్యారు.

ముక్కోటి వైకుంఠ ఉత్సవాలలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు

- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



నవతెలంగాణ-కొత్తగూడెం

భద్రాచలంలో జరుగనున్న ముక్కోటి వైకుంఠ ఉత్సవాలకు విచ్చేయు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ అనుదీప్ తెలిపారు. ముక్కోటి ఏకాదశి ఉత్సవాలపై శనివారం అధికారులతో టెలి కాన్ఫరెన్సు నిర్వహించి కేటాయించిన విధుల ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులు మన్ననలు పొందేలా ఏర్పాట్లు ఉండాలని చెప్పారు. అధికారులు సమన్వయంతో పని ఉత్సవాలను విజయవంతం చేయాలని చెప్పారు. వివిఐపి, విఐపి సెక్టార్లుతో పాటు ఏ, బి,సి,డి,ఈ,ఎఫ్, ఉచిత సెక్టార్లుగా విభజించి ప్రతి సెక్టారుకు పర్యవేక్షణకు ముగ్గురు ప్రత్యేక అధికారులను నియమించినట్లు చెప్పారు. ప్రోటోకాల్ పర్యవేక్షణకు లైజన్ అధికారులను నియమించినట్లు చెప్పారు. ఆహార పదార్థాలు, లాడ్జిలలో ధరలు నియంత్రణకు ధరల పట్టిక ఏర్పాటు చేపించాలని, పారదర్శకత ఉండాలన్నారు. అధిక ధరలకు విక్రయించకుండా పౌర సరఫరాల అధికారి, ఆర్డీఓ నిరంతర పర్యవేక్షణ చేయాలని చెప్పారు. 1.25 లక్షల లడ్డూలను విక్రయాలు నిర్వహణకు సిద్ధంగా ఉంచినట్లు చెప్పారు. లడ్డూలు విక్రయించు సిబ్బంది. పరిశుభ్రత పాటించాలని, తప్పనిసరిగా చేతులకు గ్లౌజులు, హెయిర్ మాస్కులు ధరించాలని ఆదేశించారు. పారిశుద్య కార్యక్రమాలు నిర్వహణకు 400 మంది ప్రత్యేక సిబ్బందిని నియమించి శానిటేషన్ మెటీరియల్ సిద్ధంగా ఉంచినట్లు చెప్పారు. 24 గంటలు, 12 గంటలు పనిచేయు విధంగా అత్యవసర వైద్య చికిత్సా కేంద్రాలు ఏర్పాటు చేసి వైద్యాధికారులను, పారామెడికల్ సిబ్బందికి విధులు కేటాయించినట్లునట్లు చెప్పారు. ఈ టెలికాన్ఫరెన్సులో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, దేవస్థానం ఈఓ శివాజీ, విద్యుత్ శాఖ ఎస్ఈ రమేష్, డిపిఓ రమాకాంత్, వైద్యాధికారి డాక్టర్ శిరీష, మత్స్యశాఖ అధికారి వీరన్న, అగ్నిమాపక అధికారి శ్రీనివాస్, ఇరిగేషన్ ఈఈ రాంప్రసాద్, కొత్తగూడెం ఆర్డీఓలు రత్న కళ్యాణి, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.



త్రివేణి స్కూల్లో షేరింగ్ డే సెలబ్రేషన్

నవతెలంగాణ-భద్రాచలం టౌన్

భద్రాచలం పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ నందు గల త్రివేణి స్కూల్ నందు శనివారం షేరింగ్ డే సెలబ్రేషన్స్ జరుపుకున్నారు. షేరింగ్ డే గురించి స్కూల్ ప్రిన్సిపాల్ జంగాల మంజుల మాట్లాడుతూ చిన్నపిల్లలకు స్కూల్లో చేరినప్పటి నుంచి చదువు విషయంలో ఆటపాటల విషయంలో సాంస్కృతిక విషయాలలో పండుగ సమయాలలో ఒకరికి ఒకరు ఎలా శుభాకాంక్షలు తెలుపుకోవాలి చెబుతూ ఒకరికి ఒకరు చాక్లెట్స్, పెన్, పెన్సిల్స్, స్వీట్స్, బుక్స్, ఇచ్చుకునే విధంగా ఉండాలని పిల్లలు ఉద్దేశించి ఈ షేరింగ్ డే గురించి పిల్లలకే అర్థమయ్యే రీతిలో చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కానుమిల్లి విమలాదేవి, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ బాబురావు, అకడమిక్ ఇంచార్జ్ నరేష్, క్యాంపస్ ఇంచార్జ్ సందీప్ రెడ్డి, తోటి అధ్యాపక బృందం, విద్యార్థినీ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

బకాయి వేతనాల కోసం 3 నుంచి నిరవదిక సమ్మె



నవతెలంగాణ-భద్రాచలం

గిరిజన ఆశ్రమ పాఠశాలలో హాస్టల్స్ కళాశాల అనుబంధ పీఎంహెచ్ హాస్టల్స్‌లో పనిచేస్తున్న డైలీ వేజ్, అవుట్సోర్సింగ్ కార్మికులకు రావలసిన బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ జనవరి మూడో తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా నిరవధిక సమ్మె నిర్వహిస్తున్నట్టు సీఐటీయూ అనుబంధ తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలలో హాస్టల్ డైలీ వేజ్ అండ్ అవుట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కే.బ్రహ్మాచారి, హీరాలాల్ తెలిపారు. పీఎంహెచ్ అవుట్ సోర్సింగ్ వర్కర్లకు 22 నెలలుగా వేతనాలు లేవని, డైలీ వర్కర్లకు 8 నెలలుగా వేతనాలు బకాయి ఉన్నాయని ఇప్పటికే అనేకసార్లు గిరిజన సంక్షేమ శాఖ మంత్రికి, గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్‌కి, కలెక్టర్‌కు, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు, ఎమ్మెల్సీ తాత మధు, జిల్లాలోని ఎమ్మెల్యేలకు, ఐటీడీఏ పీవో, డీడీకి పత్రాలు అందజేశామని, అయినప్పటికీ అధికారులు, ప్రభుత్వం వేతనాలు చెల్లించటానికి ఎటువంటి చర్యలు తీసుకోలేదని యూనియన్ నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వానికి ఎన్నిసార్లు వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ చెవిటి వాడి ముందు శంఖం ఊదిన చందంగా పరిస్థితి ఉందని సీఐటీయూ పేర్కొన్నది. 3వ తేదీ నుంచి సమ్మె జరుగుతుందని సమ్మెకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలు, ఆదివాసి సంఘాలు, దళిత సంఘాలు సంఘీభావం తెలియజేయాలని సీఐటీయూ విజ్ఞప్తి చేసింది. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే వేతనాలను విడుదల చేసి సమ్మెను నివారించే అవకాశం ఉందని అందుకు అనుగుణంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఐటీయూ విజ్ఞప్తి చేసింది. ఈ విషయాన్ని ప్రభుత్వానికి తెలియజేయాలని కోరుతూ ఐటీడీఏ పీవో గౌతమ్, డిప్యూటీ డైరెక్టర్ రమాదేవికి సీఐటీయూ ఆధ్వర్యంలో గిరిజన ఆశ్రమ పాఠశాలలు హాస్టల్ డైలీ వేజ్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ వినతి పత్రాన్ని అందజేసింది. ఈ కార్యక్రమంలో సీఐటీయూ భద్రాచలం పట్టణ నాయకులు నకరికంటి నాగరాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు సంద్ర భూపేందర్ తదితరులు పాల్గొన్నారు.



"రవాణా రంగ కార్మికుల సంఘర్ష యాత్ర"

- సీఐటీయూ నాయకులు విస్తృతప్రచారం
- రాష్ట్ర వ్యాప్తంగా 3 నుండి 11వరకు జాత

నవతెలంగాణ-కొత్తగూడెం

సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ట్రాన్స్‌పోర్టు రంగంలో వస్తున్న సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా "రవాణా రంగ కార్మికుల సంఘర్ష యాత్ర " జాతాను నిర్వహిస్తున్నామని శనివారం కొత్తగూడెం పట్టణంలో ఉన్న ఆటో అడ్డాలలో సీఐటీయూ నాయకత్వం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు డి.వీరన్న, భూక్య రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో ఉన్న రవాణా కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, ఫైన్‌ల రూపంలో కార్మికుల వద్ద వసూలు చేస్తున్న పద్ధతి రద్దు చేయాలని, 2019 రవాణా చట్టాన్ని సవరించాలని డిమాండ్ చేశారు. రవాణా రంగంలో కార్మికుల సమస్యల పరిష్కారం చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా జనవరి 3 నుండి 11వరకు జాత నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ జాతాలో ట్రాన్‌పోర్టు ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు ఎస్.వీరయ్య, పి.శ్రీకాంత్, వివిఎస్, రావు తదితరులు నాయకత్వం వహిస్తారని తెలిపారు. జనవరి 3వ తేదీన కొత్తగూడెం పట్టణానికి రాష్ట్ర జాత చేరుకుంటుందని పోస్ట్ ఆఫీస్ సెంటర్ నుండి ర్యాలీతో బస్టాండ్ సెంటర్‌లో సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు నాగేశ్వరావు, కోబల్, ఆటో యూనియన్ నాయకులు రింగు వెంకటయ్య, శ్యామ్, వెంకట్, హబీబ్, రాంబాబు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ టాయిలెట్స్‌ను కడిగిన మున్సిపల్ చైర్మెన్, కమిషనర్

- బహిరంగ మల మూత్ర విసర్జన నిషేధం



నవతెలంగాణ-ఇల్లందు

స్వచ్ఛ సర్వేక్షన్ 2023 టాయిలెట్ 2.0 కార్యక్రమంలో భాగంగా శనివారం మున్సిపాలిటీ పరిధిలోని పబ్లిక్ టాలెంట్‌ను స్వయంగా మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరావు, కమిషనర్ అంకు షావలి కడిగారు. పట్టణంలోని పబ్లిక్ టాయిలెట్స్‌ను మెప్మా సిబ్బంది దత్తత తీసుకొని పబ్లిక్ టాయిలెట్లు శుభ్రంగా ఉంచేందుకు కావాల్సిన సామగ్రిని సిబ్బందికి అందజేశారు. అనంతరం దమ్మాలపాటి మాట్లాడుతూ పబ్లిక్ టాయిలెట్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. బహిరంగ మల మూత్ర విసర్జన పూర్తిగా నిషేధమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలను సందర్శించిన ఈడబ్ల్యూడీసీ చైర్మెన్

నవతెలంగాణ-బూర్గంపాడు

మండల పరిధిలోని అంజనాపురం పాఠశాలను తెలంగాణ రాష్ట్ర విద్యాసంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (టీఎస్ఈడబ్ల్యూడీసీ) చైర్మన్‌గా రావుల శ్రీధర్ రెడ్డి శనివారం సందర్శించారు. ఈ సందర్శనలో భాగంగా మన ఊరు-మనబడి పనులను పరిశీలించారు. అనంతరం పిల్లల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. మన ఊరు మనబడి పూర్తిస్థాయిలో అయినందున పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఈ.సోమశేఖర్ శర్మ, సెక్టోరియల్ అధికారులు నాగరాజు శేఖర్, సైదులు, సతీశ్, అంజనాపురం సర్పంచ్ భారతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను తప్పదోవ పట్టించడం...జేబులు నింపుకోవడం

- అధికారపక్షం వర్గపోరు డ్రామా
- బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామేష్



నవతెలంగాణ-కొత్తగూడెం

ప్రజా సమస్యలను పరిష్కరించకుండా ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే అధికార పార్టీ నాయకులు వర్గపోరు నాటకాలాడుతున్నారని, రెండు వర్గాల వారు అక్రమ సంపాదనలతో జేబులు నింపుకుంటున్నారని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ ఘాటుగా విమర్శించారు. శనివారం పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో కామేష్ మాట్లాడుతూ మున్సిపల్ చట్టానికి విరుద్ధంగా అధికార పార్టీ కౌన్సిలర్ల భర్తలు కాంట్రాక్టర్ల అవతారం ఎత్తి, రెండు వర్గాలుగా విడిపోయి ప్రజాధనాన్ని దోచుకునేందుకే వర్గ పోరు డ్రామాలు ఆడుతున్నారే తప్ప ప్రజలపై ఏమాత్రం వారికి ప్రేమలేదని ఆరోపించారు. పట్టణ ప్రజల్ని తప్పుదోవ పట్టించేందుకే ఒకరిపై ఒకరు విమర్శలను చేసుకుంటున్నారని విమర్శించారు. ఇది ఆర్థిక లావాదేవీల పోరాటమే తప్ప, ఇది ప్రజా సమస్యలపై పోరాటం కాదని ఘాటుగా విమర్శించారు. ఏనాడైనా మున్సిపల్ కార్మికులు చనిపోయినప్పుడు సంతాపం ప్రకటించని కౌన్సిల్ సమావేశంలో శుక్రవారం మున్సిపాలిటీకి సంబంధం లేని కేటీఆర్ మామా చనిపోతే సంతాపం ప్రకటించడం విడ్డురంగా ఉందన్నారు. నియోజక వర్గం చినరాజు ఏది చెబితే అది గొర్రెల్లా చేస్తున్నారే తప్పా, స్వతహాగా ఆలోచన చేయడంలేదని, అధికారులు సైతం సూచనలు చేయక పోవడం విడ్డూరంగా ఉందన్నారు. కౌన్సిల్‌లో సభ్యులు చేస్తున్న డ్రామాలు ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాగుల రవికుమార్, మాలోత్ వీరు నాయక్, ఆట శ్రీకాంత్, వంగా రవిశంకర్, శివానంద్ తదితరులు పాల్గొన్నారు.

మణుగూరు ఏరియా బొగ్గు ఉత్పత్తి 123 శాతం : జీఎం

నవతెలంగాణ-మణుగూరు

మణుగూరు ఏరియా డిసెంబర్ నెల బొగ్గు ఉత్పత్తి 123 శాతం సాధించిందని ఏరియా జనరల్ మేనేజర్ జి.వెంకటేశ్వర రెడ్డి అన్నారు. శనివారం జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిసెంబర్ నెలలో మణుగూరు ఏరియాలో 10.37 లక్షల టన్నుల లక్ష్యానికి గాను 12.75 లక్షల టన్నుల ఉత్పత్తి సాధించిందన్నారు. డిసెంబర్ నెలలో సాధించిన ఉత్పత్తి 123 శాతం, అదే విధంగా 01 ఏప్రిల్ నుండి 31 డిసెంబర్ వరకు ప్రోగ్రెస్సివ్ ఉత్పం 84.51 లక్షలన్నుల లక్ష్యానికి గాను 91.39 లక్షల టన్నులు సాధించడం జరిగిందన్నారు. 108 శాతం ఉత్పత్తి సాధించడం జరిగిందన్నారు. డిసెంబర్ నెలలో మణుగూరు ఏరియా 13.08 లక్షల టన్నులను రవాణా చేయటం జరిగిందన్నారు. 31 ఏప్రిల్ నుండి 31 డిసెంబర్ వరకు ప్రోగ్రెస్సివ్‌గా 91.56 లక్షల టన్నుల రవాణా చేయడం జరిగిందన్నారు. డిసెంబర్ నెలలో 4.04 లక్షల టన్నులు రవాణా చేయటం జరిగింది. అలాగే 31 ఏప్రిల్ నుండి 31 డిసెంబర్ వరకుప్రోగ్రెస్సివ్ గా 30.51 లక్షల టన్నులు రవాణా చేయడం జరిగిందన్నారు. డిసెంబర్ నెలలో ఓవర్ బర్డెన్ మన డిపార్ట్మెంటల్‌గా 15.00 లక్షల క్యూబిక్ మీటర్లకు లక్షాలకు గాను 104శాతం తో 15.53 లక్షల క్యూబిక్ మీటర్లు తీయటం జరిగిందన్నారు. 01 ఏప్రిల్ నుండి 31 డిసెంబర్ వరకు 103.74 లక్షల క్యూబిక్ మీటర్ల చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మాల మహానాడు 'రాష్ట్ర సహాయ కార్యదర్శిగా కూరపాటి రవీందర్ "

నవతెలంగాణ-కొత్తగూడెం

మాల మహానాడు 'రాష్ట్ర సహాయ కార్యదర్శిగా కూరపాటి రవీందర్ ఎంపికయ్యారు. పివి.రావుతో పనిచేసిన ఉమ్మడి రాష్ట్ర మాల మహానాడు ముఖ్య నాయకుల కోరిక మేరకు గురువారం విజవాడ అమరావతిలోని ఉండవల్లి రాజగృహ సమావేశ మందిరంలో మాల మహానాడు సీనియర్ నాయకుల సమావేశం మాల మహానాడు జాతీయ ఉపాధ్యక్షులు, సమన్వయ సమావేశ కన్వీనర్, విశ్రాంత డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నీటిపారుదల శాఖ సాదే డేవిడ్ రాజ్ అధ్యక్షతన జరిగింది. మాల మహానాడు జాతీయ కమిటీని వారు ఎన్నుకోగా దానికి మాల మహానాడు జాతీయ కమిటీ గౌరవాధ్యక్షులుగా, యర్రమల్ల రాములు, పంతగాని రమేష్‌ని ప్రకటించడం జరిగింది. జాతీయ అధ్యక్షులుగా సాదే డేవిడ్ రాజ్, జాతీయ కార్యనిర్వహక అధ్యక్షులుగా ముండ్లగిరి కాంతయ్య, యమల సుదర్శన్, జాతీయ ఉపాధ్యక్షులుగా, గడ్డం నాగముణి, టి.దయానందు, జంగా త్రిమూర్తులు, పిడతల శ్రీను, ప్రధాన కార్యదర్శులుగా అరవ పార్వతయ్య మంచాల వెంకటస్వామి, బొంతు శ్రీరాములు, కార్యదర్శులుగా గడ్డం నాగమణి, మేకతోటి కాంతయ్య, కంచర్ల ప్రభుదాస్, బేగరీ శివరాజ్ బండి అశోక్, కొల్లబత్తుల సతీష్, దాసరి దేవయ్య, కోశాధికారి కాశీమల్ల వెంకట నరసయ్య, కార్యవర్గంగా మరో 15 మందిని ఎన్నుకోవడం జరిగింది. మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగా తల్లమల్ల హసేన్, ప్రధాన కార్యదర్శిగా గిడ్ల పరంజ్యోతి రావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎడ్ల నాగరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా దివి ఆనందరావు, కామర్ల జానయ్య బండ వరప్రసాదరావు గుంతటి వీరభద్రం, ఏడిండ్ల అశోక, ఇట్టమల్ల బెంజిమెన దండు రాజు, సహాయ కార్యదర్శులుగా మన్నే కృష్ణయ్య వెల్పూరు సదానందం, సామరాజు, పాశం వెంకటేశ్వర్లు, కూరపాటి రవీందర్, మహిళా కార్యదర్శిగా నాగేల్లి వెంకటమ్మ, మెరుగు అనసూయ మరో 20 మంది కార్యవర్గంతో తెలంగాణ రాష్ట్ర కమిటీని ప్రకటించారు.

మాంటిస్సోరి పాఠశాల ఆధ్వర్యంలో న్యూ ఇయర్ వేడుకలు

మణుగూరు : మాంటిస్సోరి శ్రీ సత్య భాస్కర పాఠశాల ఆధ్వర్యంలో బాలవెలుగు అనాధాశ్రమంలో న్యూ ఇయర్ వేడుకలు నిర్వహించారు. శనివారం ముత్యాలమ్మ నగర్ పంచాయతీలోని సీ టైపులో బాలవెలుగు అనాధాశ్రమంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. పాఠశాలలోని పదవ తరగతి విద్యార్థినీ, విద్యార్థుల సహకారంతో పిల్లలకు కావలసిన నిత్యావసర సరుకులు, పండ్లు, కూరగాయలు, బియ్యం వారికి అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఐసక్ థామస్, బాల వెలుగు పాఠశాల నిర్వాహకులు జగన్మోహన్ రెడ్డి కలిసి కేక్ కట్ చేసి, పిల్లలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఐసక్ థామస్ మాట్లాడారు. పాఠశాల నిర్వాహకులు జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ వారు చేసిన సహాయాన్ని కొనియాడుతూ అభినందించారు. ఆ తరువాత పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు, ఉపాధ్యాయుడు రామకృష్ణ పాడిన పాటలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. సత్య భాస్కర పాఠశాల విద్యార్థులు మాట్లాడుతూ ఇకనుండి మేము కూడా వారికి కావలసిన సహాయాన్ని అందిస్తామని ఎంతో ఆనందంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు, బాలవెలుగు పాఠశాల సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

కుల భోజనం వద్దు-జన భోజనం ముద్దు

- రాజ్యాంగ హక్కుల రక్షణ వేదిక కన్వీనర్ మల్లెల రామనాథం
- కార్యక్రమ కరపత్రం ఆవిష్కరణ

పాల్వంచ : కుల భోజనం వద్దు-జన భోజనం ముద్దు అని రాజ్యాంగ హక్కుల రక్షణ వేదిక కన్వీనర్ మల్లెల రామనాథం అన్నారు. రాజ్యాంగ హక్కుల రక్షణ వేదిక ఆధ్వర్యంలో, కుల నిర్మూలన చైతన్యంతో అందరం కలిసి జన భోజనాలు చేయాలని ఉద్దేశంతో జనవరి 8వ తారీఖున కొత్తగూడెంలోని సూపర్ బజార్ సెంటర్ నందు నిర్వహించ తలపెట్టిన కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని శనివారం పాల్వంచలోని ప్రెస్ క్లబ్‌లో ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పూర్వపు రోజులలో వనభోజనాలకు ఒక గ్రామంలోని వారు కానీ లేదా ఒక బస్తీలోని వారు కానీ కులమతాలతో సంబంధం లేకుండా అన్నదమ్ముల్లా, అక్కాచెల్లెళ్లుగా అందరూ కలిసి వెళ్లి వనములో జన భోజనం చేసేవారన్నారు. కానీ నేటి అభివృద్ధి చెందిన ఆధునిక యుగంలో వన భోజనాలు పూర్తిగా కులభోజనాలుగా, కుల సమీకరణాలుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తాండ్ర వెంకటేశ్వర్లు, చిటికెన ముసలయ్య, ఎస్కే నబీ, సాహెబ్, బరగడి దేవదానం, యం.డీ.మంజూర్, శనగ రామచంద్రరావు, ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు.

కొండ రెడ్లుకు దుప్పట్లు పంపిణీ

నవతెలంగాణ-అశ్వారావుపేట

మండలంలోని రెడ్డిగూడెం పంచాయతీ శుద్ధ గోతులు గూడెం కొండ రెడ్లుకు నామ ముత్తయ్య మెమోరియల్ ట్రస్ట్ సౌజన్యంతో ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు సూచన మేరకు నూతన సంవత్సర కానుకగా శనివారం దుప్పట్లు పంపిణీ చేసారు.

ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ మండల నాయకులు మందపాటి రాజమోహన్ రెడ్డి, బిర్రం వెంకటేశ్వరరావు, సర్పంచ్, వార్డు మెంబర్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాలంటే అబ్బాయిలకే సాధ్యం... అమ్మాయిలు అంతగా బయటకు రాలేరు. పైగా బాధ్యతలు తీసుకోవడానికి వెనకాడతారు. ప్రతి దానికీ భయపడతారు... మహిళల పట్ల ఇలాంటి ఆలోచనలు ఇంకా మన సమాజంలో కొనసాగుతూనే ఉన్నాయి. కానీ ఇకపై వీటికి కాలం చెల్లిపోయింది అంటూ ఎంతో మంది మహిళా నాయకులు ముందుకు వస్తున్నారు. ఉద్యమాల హోరులో ఆణిముత్యాల్లా వెలిగిపోతున్నారు. వారిలో సంగీత ఒకరు. ప్రస్తుతం ఎస్.ఎఫ్.ఐ అస్సాం రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు చూస్తున్నారు. ఇటీవల తమ సంఘ అఖిల భారత మహాసభల్లో పాల్గొనేందుకు హైదరాబాద్ వచ్చిన ఆమెతో మానవి సంభాషణ...

అమ్మాయిలకు నమ్మకం కల్పించాలి

విద్యార్థి ఉద్యమంలోకి ఎలా వచ్చారు?

చిన్నప్పుడు మా అమ్మానాన్నతో కలిసి అనేక కార్యక్రమాల్లో పాల్గొనేదాన్ని. నాన్న డాక్టర్ అపూర్వ కుమార్ దాస్. అమ్మ గులాప్పీ దాస్, టీచర్‌గా చేసేవారు. వీళ్ళు కూడా ఎస్.ఎఫ్.ఐలో పని చేశారు. హైస్కూల్లో చదివేటపుడే ఎస్.ఎఫ్.ఐలో సభ్యత్వం తీసుకున్నాను. అప్పట్లో స్కూల్ కెప్టెన్‌గా ఉండేదాన్ని. సభ్యత్వం తీసుకున్నప్పుడు వాళ్ళు ఇచ్చిన రిసిట్ వెనుక వైపు సంఘం లక్ష్యాలు ఉండేవి. అవి నాకు బాగా నచ్చాయి. అందరికీ ఉచిత విద్య అందించాలనే డిమాండ్ నన్ను బాగా ఆకర్షించింది. ఇంటర్‌కి వచ్చే వరకు కమిటీల్లో లేకపోయినా సీనియర్ అక్క వాళ్ళతో కలిసి కార్యక్రమాలకు మాత్రం వెళ్ళేదాన్ని. డిగ్రీకి వచ్చిన తర్వాత కూడా కేవలం కార్యక్రమాలకు మాత్రమే తీసుకెళ్ళేవారు. ఎలాంటి సమావేశాలకు నన్ను తీసుకుపోయేవారు కాదు. దాంతో కోపం వచ్చి నన్ను కార్యక్రమాలకు తప్ప సమావేశాలకు తీసుకుపోవడం లేదని, కమిటీలో పెట్టుకోవడం లేదని మా అమ్మ వాళ్ళకు కంప్లెయింట్ ఇచ్చాను. అప్పుడు "నీకు కమిటీలో ఉండడం ఇష్టమేనే" అని అడిగారు. వుంటానని చెప్పాను. అప్పుడు డిగ్రీ మొదటి సంవత్సరంలో ఉన్నాను. నా సబ్జెక్ట్ సైన్స్. అందరితో కలిసి మహాసభలకు వెళ్ళాను. సైన్స్ కోర్సులో ఉన్న వాళ్ళు అక్కడకు చాలా మంది వచ్చారు. అంతకు ముందు వరకు సంఘాలంటే కేవలం ఆర్ట్స్ వాళ్ళే ఉంటారు అనే ఒక పొరపాటు ధోరణి ఉండేది. అక్కడకు వెళ్ళాక నా ఆలోచన మారిపోయింది. అప్పటి నుండి యాక్టివ్‌గా పని చేయడం మొదలుపెట్టాను. పోటీ పడి మరీ మా కాలేజీలో సభ్యత్వం చేసేదాన్ని.

మీ కాలేజీలో ఎస్.ఎఫ్.ఐకి అనుకూలమైన వాతావరణం ఉండేదా?

లేదు. సభ్యత్వ చేస్తుంటే మా ప్రిన్సిపల్ నన్ను కోప్పడేవారు. కాలేజీలోకి రాజకీయాలు ఎందుకు తీసుకొస్తున్నావు అనేవారు. సైన్స్ వాళ్ల మీరు చదువుకోవాలి ఇవన్నీ మీకు అవసరమా అనేవారు. కానీ నేను మాత్రం ఇవి రాజకీయాలు కాదు. విద్యార్థుల సమస్యలపై పని చేసే సంఘం అనేదాన్ని. పైగా స్టూడెంట్స్‌ను మేమేమీ సభ్యత్వం కోసం బలవంతం చేయడంలేదు. వాళ్ళ ఇష్ట ప్రకారమే తీసుకుంటున్నారు. ఇందులో ఇబ్బంది పడాల్సిన అవసరం ఏముందని వాదించేదాన్ని. దాంతో ఏమీ అనేవారు కాదు.

మీరు చదివిన యూనివర్సిటీలో అనుభవాలు?

2010లో పీజీ కోసం గౌహతి యూనివర్సిటీలో చేరాను. నా ఉద్యమ జీవితంలో ఇది ఒక టర్నింగ్ పాయింట్‌గా చెప్పుకోవచ్చు. అక్కడ పని చేయడం చాలా కష్టంగా ఉండేది. అల్ అస్సాం స్టూడెండ్స్ యూనియన్(ఏఏఎస్‌యు) అని ఉండేది. వాళ్ళు బాగా డామినేట్ చేసేవారు. అంతా వాళ్ళ హవానే నడిచేది. ఎస్.ఎఫ్.ఐ మీటింగ్ జరుగుతుంటే వచ్చి వార్నింగ్ ఇచ్చేవారు. హాస్టల్‌కి వెళ్ళి బెదిరించేవారు. దాంతో కొంత మంది భయపడి వెళ్ళిపోయేవారు. అలాంటి పరిస్థితుల్లో పని చేశాం. అయితే మా క్లాస్ వాళ్ళు నాకు చాలా సపోర్ట్ చేసేవారు. సైన్స్ కోర్సు కాబట్టి నేను కార్యక్రమాల కోసం వెళ్ళినపుడు టెండెన్స్ విషయంలో కూడా హెల్ప్ చేసేవారు.

మిమ్మల్ని ప్రభావితం చేసిన అంశాలు?

2012లో మధురైలో జరిగిన ఎస్.ఎఫ్.ఐ ఆలిండియా మహాసభలకు ఆహ్వానితురాలిగా వెళ్ళాను. అది నా జీవితంలో చాలా మార్పు తీసుకొచ్చింది. అంతకు ముందే పీహెచ్‌డీ చేయాలని నిర్ణయించుకున్నాను. మధురై నుండి అటు నుండి అటే ఇంటర్వ్యూకి వెళ్ళాను. అక్కడ అంతా బాగా జరిగింది. కానీ తర్వాత తెలిసింది. ఎవరికి సీటు ఇవ్వాలో ముందే నిర్ణయించుకున్నారు. నేను ఇంటర్వ్యూకి వెళ్ళినా ఉపయోగం లేకుండా పోయింది. ఆ తర్వాత కొద్ది రోజులకు మా నాన్న ప్రమాదవశాత్తు చనిపోయారు. చాలా కుంగిపోయాను. ఆ సమయంలోనే పూర్తికాలం కార్యకర్తగా పని చేయాలని నిర్ణయించుకున్నాను. ముందు మా అమ్మ ఒప్పుకోలేదు. బాగా వ్యతిరేకించింది. ఉద్యోగం లేకపోతే ఎలా బతుకుతావు, తర్వాత నీ జీవితం ఏంటి అంటూ బాధపడింది. చావనైతే చావను కచ్చితంగా బతికే



ఉంటాను" అని సమాధానం చెప్పాను. దాంతో ఇక ఏమీ అనలేపోయింది. ఎస్.ఎఫ్.ఐలో పని చేస్తూనే కొంత కాలం ట్యూషన్లు చెప్పుకునేదాన్ని. డబ్బు కోసం ఇంట్లో అడగటం ఇష్టం లేదు. వాటితోనే నా అవసరాలు తీర్చుకునేదాన్ని. మిగిలిన డబ్బు ఎస్.ఎఫ్.ఐ కార్యక్రమాలకు వాడేదాన్ని. ఒక కోచింగ్ సెంటర్ కూడా ప్రారంభించాను. ఇందులో ఎక్కువ మంది ఎస్.ఎఫ్.ఐ వాళ్ళే ఉండేవారు. కానీ ఇటు ఉద్యమాలు, అటు కోచింగ్ సెంటర్ సమయం సరిపోయేది కాదు. దాంతో దాన్ని వేరే వాళ్ళకు ఇచ్చేసి పూర్తిగా ఎస్.ఎఫ్.ఐకే సమయం కేటాయించేదాన్ని. అస్సాంలో జరిగిన గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేశాను. మూడో స్థానంలో వచ్చాము. ఈ సమయంలో ప్రజల్లో తిరుగుతూ చాలా నేర్చుకునే అవకాశం వచ్చింది.



ప్రస్తుతం మీ రాష్ట్రంలో విద్యార్థుల పరిస్థితి ఏంటి?

2016లో రాష్ట్రంలో చాలా మార్పు వచ్చింది. కాంగ్రెస్ వాళ్ళందరూ బీజేపీలోకి వెళ్లిపోయారు. విద్యా రంగంలో కూడా చాలా మార్పు వచ్చింది. స్కాలర్ షిప్‌లు తగ్గిపోయాయి. మహిళలపై వివక్ష, దాడులు పెరిగిపోయాయి. జోర్‌హాత్ జిల్లాలో సుబ్బలక్ష్మి అనే అమ్మాయి ఉండేది. హాస్టల్‌కి వెళుతుంటే అబ్బాయిలు ఆమెతో అసభ్యంగా ప్రవర్తించారు. ఆ రాత్రి అమ్మాయి తనకు జరిగిన అన్యాయాన్ని ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేసింది. ఆమె ఒక రచయిత. దాంతో చాలా మంది ఆ పోస్ట్‌ను షేర్ చేశారు. సోషల్ మీడియాలో బాగా ప్రచారం అయ్యింది. అప్పుడు ఎస్.ఎఫ్.ఐగా దీనిపై పెద్ద పోరాటం చేశాము. స్టాండ్ విత్ సుబ్బలక్ష్మి అనే నినాదంతో ఉద్యమం మొదలుపెట్టాము. అన్ని విద్యా సంస్థలు, యూనివర్సిటీలకు వెళ్ళి విద్యార్థులను సమీకరించాము. అనేక కమిటీలు ఏర్పాటు చేసి వారిని ఈ ఉద్యమంలోకి తీసుకొచ్చాము. ఫలితంగా వీధి లైట్లు వచ్చాయి. నగర శివార్లలో, హాస్టల్స్ దగ్గర, కాలేజీల దగ్గర సెక్యురిటీ పెట్టారు. యూనివర్సిటీలో ఈ ఉద్యమం బాగా జరిగింది. అమ్మాయిల్లో కాస్త ధైర్యం వచ్చింది. వారి సమస్యలను బయటకు వచ్చి చెప్పుకోవాలనే ఆలోచన వచ్చింది. తమకు ఏదైనా సమస్య వస్తే ఎస్.ఎఫ్.ఐ అండగా ఉంటుంది అనే నమ్మకం వారికి వచ్చింది. తర్వాత కూడా అనేక ఉద్యమాలు చేశాం. నాపైన మూడు కేసులు కూడా పెట్టారు.

అమ్మాయిలు ఉద్యమాల్లో రావడానికి సిద్ధంగా ఉన్నారా?

ఉన్నారు. అయితే అనేక సమస్యల ఉన్నాయి. ముందు వాళ్ళకు నమ్మకం కల్పించాలి. అందుకే మేము అమ్మాయిలకు ప్రత్యేకంగా సబ్ కమిటీ ఏర్పాటు చేసుకున్నాము. ఈ కమిటీ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు చేయాలి. వాళ్ళల్లో నాయకులు తయారు చేయాలి. మాకు అక్కడికి వెళితే రక్షణ ఉంటుంది, ధైర్యం వస్తుంది అనే నమ్మకం కల్పించాలి. ఆ నమ్మకాన్ని ఎస్.ఎఫ్.ఐ వాళ్ళకు ఇవ్వాలి. ప్రస్తుతం జిల్లా అధ్యక్షకార్యదర్శులుగా, రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులుగా అమ్మాయిలు వస్తున్నారు. బాధ్యతలు తీసుకుంటున్నారు. ఎంతో చురుగ్గా పని చేస్తున్నారు. కాబట్టి అవకాశాలు ఇస్తే కచ్చితంగా తామేంటో నిరూపించుకునే శక్తి అమ్మాయిలకు ఉంది. అయితే సమాజ ప్రభావం అందరిపైనా ఉంటుంది. అలాగే పురుషాధిక్య భావజాలం మాలోపల కూడా ఉంటుంది. వాటి నుండి బయటపడేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. మరో విషయం అమ్మాయిలను అమ్మాయిలే తీసుకురావాలి అనే ఆలోచన వుంది. ఇది సరైనది కాదు. కమిటీ మొత్తం దానిపై కృషి చేయాలి. బాధ్యత తీసుకోవాలి.

మీకు నచ్చిన నాయకులు?

నచ్చిన నాయకులంటే ఇద్దరు ఉన్నారు. ఫిడేల్ కాస్ట్రో, భగత్‌సింగ్. వీరు నా స్ఫూర్తిదాయక నాయకులు. అలాగే ఇక్కడకు వచ్చిన తర్వాత మల్లు స్వరాజ్యం గారి జీవితం గురించి తెలుసుకున్నాను. చాలా స్ఫూర్తిదాయకమైన వ్యక్తిత్వం ఆమెది. ఆమె గురించి వింటుంటే చాలా గర్వంగా అనిపించింది.

ఎస్.ఎఫ్.ఐ రాష్ట్ర కార్యదర్శిగా ప్రస్తుతం విద్యార్థుల ఆలోచనా ధోరణి ఎలా ఉందంటారు?

నేటి విద్యార్థులు చాలా కొత్తగా ఆలోచిస్తున్నారు. క్రియేటివిటీగా ఉంటున్నారు. కొత్త కొత్త నినాదాలు సృష్టిస్తున్నారు. చక్కటి ఆలోచనలతో ముందుకు వస్తున్నారు. ఎస్.ఎఫ్.ఐలోకి కూడా అలాంటి క్వాలిటీ నాయకులు వస్తున్నారు. వీళ్ళందరినీ చూస్తే ఎంతో ఉత్సాహంగా అనిపిస్తుంది.

మీ జీవిత భాగస్వామి గురించి చెప్పండి?



నా సహచరుడు నిరంకుశ్. ప్రస్తుతం డివైఎఫ్ఐలో ఉన్నారు. అంతకు ముందు ఎస్.ఎఫ్.ఐలో పని చేశాడు. అతను లా చేశాడు. మాది ప్రేమ వివాహం.

మీ పెండ్లికి పెద్దలు ఒప్పుకున్నారా?

ఒప్పుకున్నారు. అయితే ఓ సంఘటన జరిగింది. పెండ్లి రోజు భర్త కాళ్ళు భార్య పట్టుకోవాలి. నేను పట్టుకోనని చెప్పాను. దాంతో వాళ్ళ బంధువులు కాస్త ఫీలయ్యారు. దీని గురించి చర్చ కూడా జరిగింది. కాని నేను మాత్రం ఆ పని చెయ్యలేదు. తర్వాత వాళ్ళే అర్థం చేసుకున్నారు. ఇప్పుడు నాతో చాలా అభిమానంగా, ప్రేమగా ఉంటారు. అతని తల్లిదండ్రులు మాత్రం ప్రోగ్రెసివ్‌గా ఉంటారు.

మీ భవిష్యత్ లక్ష్యాలు?

పూర్తికాలం కార్యకర్తగా ఉద్యమాల్లో కొనసాగాలి. లింగ వివక్షపై పని చేయాలి. సమానత్వం సాధించడం కోసం నా వంతు ప్రయత్నం చేయాలి. విద్య, వైద్యం అందరికీ అందేలా చూడాలి. మా కలలను నిజం చేసుకోవాలి. అయితే ఈ దారి అంత సులభమేమీ కాదు. మేము జీవించి ఉన్నప్పుడు మా కల నిజం కాకపోవచ్చు. మా తర్వాత తరాల వారైనా సుఖమైన జీవితం గడిపేందుకు అవసరమైన మార్గం వేయాలి. అయితే ఇవన్నీ ఒంటరిగా చేయలేం. అందరినీ కలుపుకొని ఉద్యమాలు చేయాలి. ఐకమత్యంతో సమానత్వం సాధించాలి.

– సలీమ
ఫొటోలు :హరి

'పది'ప్రశ్నాపత్రంలో అన్ని సెక్షన్లకూ ఛాయిస్ ఇవ్వాలి

(మొదటిపేజీ తరువాయి)

తరగతులు సరిగా వినలేక పోయారని వివరించారు. అందువల్ల అభ్యసనా సామర్థ్యాలు తగ్గిపోయాయని తెలిపారు. ప్రాథమిక అంశాలపై అవగాహన తగ్గిందని పేర్కొన్నారు. ఈ ఏడాది పూర్తి సిలబస్‌తో ప్రశ్నాపత్రం ఉన్నందున దానిపై పట్టు సాధించటం సగటు విద్యార్థికి కష్ట సాధ్యమని వివరించారు. ఉన్నత విద్య పరీక్షల పేపర్లలో కూడా అన్ని విభాగాల్లో ఛాయిస్ ఇస్తున్నారని గుర్తు చేశారు. సీబీఎస్ఈలో పరీక్షకు, పరీక్షకు మధ్య సెలవులిస్తారనీ, ఆ విధానాన్ని పదో తరగతి పరీక్షల్లోనూ అమలు చేయాలని కోరారు.

- రెండు పేపర్లకు బదులుగా ఒక పేపర్ ఇస్తుండడం వల్ల విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ఉండటానికి ఒకటి, రెండు సెక్షన్లలో కూడా ఛాయిస్ ఇవ్వాలి. రెండు మార్కులు, మూడు మార్కుల ప్రశ్నలకు కనీసం 30 శాతం ఛాయిస్ ఇవ్వాలి.
- మూడో సెక్షన్‌లో వ్యాస రూప ప్రశ్నల సంఖ్యను ఆరు నుంచి నాలుగుకు తగ్గించాలి.
- ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్ పరీక్షలు ఒకేరోజు కాకుండా వేర్వేరు రోజుల్లో నిర్వహించాలి.
- పరీక్షలు ప్రతిరోజూ కాకుండా రోజు విడిచి రోజు చొప్పున నిర్వహించాలి. తద్వారా ప్రిపరేషన్ సులభమౌతుంది.
- సగటు విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని పదోతరగతి పరీక్షల ప్రశ్నాపత్రాన్ని రూపొందించి పరీక్షలను నిర్వహించాలి.

సమానత్వం కోసం సమైక్యతతో పోరాటం

(మొదటిపేజీ తరువాయి)

సభ్యులు బందాకరత్ కీలకోపన్యాసం చేస్తారని తెలిపారు. క్యూబా విప్లవ నేత చె గువెరా కుమార్తె అలెదాగువెరా, ఆమె కుమార్తె ఎస్తెఫానియా మచిన్ గువెరా కూడా ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గంటారని పేర్కొన్నారు. 'ప్రభుత్వ ప్రాయోజిత తీవ్రవాదం, నేటి భారతదేశం' అనే అంశంపై సెమినార్‌ను సామాజిక కార్యకర్త తీస్తా సెతల్వాడ్ అదే రోజు సాయంత్రం 4 గంటలకు గాంధీ పార్క్‌లో ప్రారంభిస్తారని తెలిపారు. మహాసభ చివరి రోజైన 9న సాయంత్రం 4గంటలకు పుత్తరికండం మైదానంలో జరిగే బహిరంగ సభలో ముఖ్యమంత్రి పినరయి విజయన్ పాల్గంటారని తెలిపారు. గత నాలుగు దశాబ్దాల కాలంలో 98 లక్షల సభ్యత్వంతో ఐద్వా దేశంలోనే ప్రముఖ మహిళా సంస్థగా ఆవిర్భవించింది. మహిళా పోరాటాలు, వారి సమస్యలను ప్రముఖంగా పేర్కొంటూ వాటి పరిష్కారం కోసం పోరు సల్పడంలో, మహిళల అభ్యున్నతికి వివిధ చట్టాలను తీసుకురావడంలో కీలక పాత్ర పోషించింది.

కురవిలో ఘోర రోడ్డు ప్రమాదం...

(మొదటిపేజీ తరువాయి)

మంది ఉన్నారు. రాళ్ల మీద పడటంతో బానోత్ సుమన్(35), యెక్కలపు మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన డెన్యాల నవీన్‌ను వెంటనే వరంగల్ ఎంజీఎంకు తరలించారు. లింగంపల్లి రాంబాబు, బానోతు రాము, ఆటో డ్రైవర్ బానోత్ రమేష్, నావత్ వీరన్న, బొడ్డు శేఖర్‌ను మానుకోట ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. చిన్నగూడూరు మండలం మంగోరిగూడెం నుంచి వారంతా మహబూబాబాద్ వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. బండరాళ్ల కింద ఇంకెవరన్న ఉండొచ్చన్న అనుమానాలున్నాయి. నవీన్ పరిస్థితి విషమంగా ఉంది. ఎస్పీ శరత్‌చంద్ర, డీఎస్పీ సదయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు. అయితే, మితిమీరిన వేగం, సరిగా రాళ్లను కట్టకపోవడంతో ప్రమాదం జరిగినట్టు పోలీసులు భావిస్తున్నారు. క్రేన్ సహాయంతో బండరాళ్లను తొలగించి మృతదేహాలను ఆస్పత్రికి తరలించారు. మానుకోట ఏరియా ఆస్పత్రిలో బాధితుల కుటుంబాలను ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్యే రెడ్యానాయక్, సాదుల శ్రీనివాస్, కెఎస్ఎన్ రెడ్డి, జిన్నా రెడ్డి, వెంకటేశ్వర్లు, ముల్లంగి ప్రతాప్ తదితరులు పరామర్శించారు.

రైతుల ఆదాయం రెట్టింపేది..?

(మొదటిపేజీ తరువాయి)

ఏడాదిలోనే కేవలం కొన్ని నెలల వ్యవధిలోనే దాదాపు రెండు కోట్ల మంది రైతులను తొలగించారు. 2022-2023లో 11వ విడుత (ఏప్రిల్-జూలై)లో 10,45,59,905 మంది రైతులకు పీఎంకిసాన్ పథకం వర్తిస్తే, 12వ విడుత (ఆగస్టు-నవంబర్)లో 8,42,14,408 మంది రైతులకు మాత్రమే పీఎం కిసాన్ వర్తించింది. 2,03,45,497 మంది రైతులు పిఎం కిసాన్ పథకం నుంచి తొలగించబడ్డారు. రెండు కోట్ల మంది రైతులను తొలగించడంద్వారా కేంద్ర ప్రభుత్వం రూ.5,108 కోట్లను మిగుల్చుకున్నది. 11వ విడుతలో రూ.22,551 కోట్లు విడుదల చేస్తే, 12 విడుతలో 17,443 కోట్లు కేటాయించింది.ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రకటన తరువాత కేంద్ర ప్రభుత్వం 2016 ఏప్రిల్ 13న రైతుల ఆదాయం రెట్టింపు (డీఎఫ్ఐ)పై అశోక్ దల్వాయ్ నేతృత్వంలోని 16 మంది నిపుణుల కమిటీ ఏర్పాటు చేసింది. ఈ కమిటీ 14 సంపుటాలలో నివేదికను సమర్పించింది. 2017 ఆగస్టులో మొదటి సంపుటా నివేదిక ఇచ్చింది. 2018 సెప్టెంబర్‌లో మరో నివేదిక ఇచ్చింది. ఈ కమిటీ 16 సిఫార్సులను చేసింది. అందులో రైతు పండించే పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) ఉత్పత్తి వ్యయం కంటే 1.5 రెట్లు ఉండాలని తెలిపింది. అగ్రి మార్కెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ రూ. 2,000 కోట్లతో 22,000 గ్రామాల్లో (గ్రామీణ స్థాయి మార్కెట్‌లు, అగ్రిగేషన్ హబ్‌లు) ఏర్పాటు చేయాలనీ, 585 వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ కమిటీ (ఏపీఎంసీ)లను అప్‌గ్రేడ్ చేయాలని సూచించింది. ధర, డిమాండ్ అంచనాలు, ఫ్యూచర్స్, ఎంపికలు, వ్యవసాయం కోసం ఎగ్జిమ్ విధానాలపై విధానాలను అభివృద్ధి చేయడానికి సంస్థాగత యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని వంటి కొన్ని సిఫార్సులను చేసింది.

ప్రకటన వెలువడిన వెంటనే.. నిటి ఆయోగ్ విధాన పత్రాన్ని తెచ్చింది. రైతుల ఆదాయాల బెంచ్‌మార్క్ అంచనాలు, వీటిని రెట్టింపు చేయడంపై వివరాలను అందిస్తూ నిటి ఆయోగ్ వ్యవసాయ ఇన్‌ఛార్జ్ సభ్యుడు రమేష్ చంద్ రచించారు. ఇది రైతుల ఆదాయానికి సంబంధించిన సూటి గణన, ఇంతకు ముందు వివిధ అధ్యయనాలలో ఉపయోగించిన వివరాలే ఉన్నాయి. పాలసీ పేపర్‌లో 2015-16 వరకు సాగుదారుల ఆదాయాల అంచనాలు ఉన్నాయి. దానిని ఆధార సంవత్సరంగా పరిగణిస్తారు. దాని డేటా ప్రకారం 2004-05, 2011-12 మధ్య 7.5 శాతం పెరుగుదల నుండి 2011-12, 2015-16 మధ్య ఒక్కో సాగుదారునికి నిజమైన రైతు ఆదాయం ఏడాదికి 0.44 శాతం పెరిగింది. ఇది 1999-2000, 2004-05 మధ్య మొదటి నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్ (ఎన్‌డీఏ-1) ప్రభుత్వ కాలంలో ఏడాదికి 0.55 శాతం తగ్గింది.

రైతు ఆదాయంలో క్షీణత

నేషనల్ స్టాటిస్టికల్ ఆఫీస్ (ఎన్ఎస్ఓ) సిట్యుయేషన్ అసెస్‌మెంట్ సర్వే (ఎస్ఏఎస్) ఆధారంగా పంటల వ్యవసాయం వల్ల రైతు కుటుంబాల ఆదాయం 2012-13, 2018-19 మధ్య ఏడాది 1.5 శాతం క్షీణించింది. దురదృష్టవశాత్తూ, 2018-19 తరువాత ఎటువంటి సర్వేలు జరగనందున, 2022లో రైతుల ఆదాయాన్ని అంచనా వేయడానికి మార్గం లేదు. 2015-16 తరువాత రైతు ఆదాయంలో క్షీణత ఉంది. నాబార్డ్ ఆల్ ఇండియా ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ సర్వే (ఎన్ఏఎఫ్ఐఎస్)లో భాగంగా గ్రామీణ కుటుంబాల సర్వే వ్యవసాయ కుటుంబాల ఆదాయానికి సంబంధించిన ఇతర డేటా ఎస్ఏఎస్‌కి భిన్నంగా ఉంది. అయితే ఆదాయాల వృద్ధి క్షీణతను స్పష్టం చేసింది. వ్యవసాయ కుటుంబాల ఆదాయం 2015-16, 2018-19 మధ్య ఏడాది 1.7 శాతం పెరిగిందని, ఇది మునుపటి కాలంలోని 3.8 శాతం వృద్ధి రేటు కంటే సగం కంటే తక్కువగా ఉందని స్పష్టం చేసింది.

జనంలో ఉండాల్సిందే..పోరాడాల్సిందే...

(మొదటిపేజీ తరువాయి)

నిలబడి భూపోరాటాలు చేయాల్సిన గురుతర బాధ్యత వ్యవసాయ కార్మిక సంఘంపై ఉందని నొక్కి చెప్పారు. తెలంగాణ గడ్డకు పోరాటాల వారసత్వం ఉందనీ, దాన్ని ముందుకు తీసుకుపోవాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో వర్గపోరాటాలను ఉధృతం చేయాలన్నారు. అప్పుడే ఏ పార్టీ పేదల పక్షమో, ఏ పార్టీ భూస్వాములు, కార్పొరేట్ల పక్షమో అర్థం అవుతుందని చెప్పారు. రాష్ట్రంలో వరుసగా జరుగుతున్న పోరాటాలతో ఎర్రజెండా వైపు ప్రజలు చూసే పరిస్థితి వచ్చిందన్నారు. రానున్న రోజుల్లో వర్గపోరాటాలను ఉధృతం చేస్తే కమ్యూనిస్టులకు మంచి రోజులు వస్తాయన్నారు. కూలీలకు వ్యవసాయ పనిదినాలు రోజురోజుకీ తగ్గిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పనుల్లేక కూలీలు ఇబ్బందిపడుతున్న సమయంలో ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే పనిలో మోడీ సర్కారు ఉందని విమర్శించారు. వ్యవసాయ కార్మికుల్లో ఎక్కువగా దళితులు, వెనుకబడిన సామాజిక తరగతుల వారే ఉన్నారనీ, కంపెనీ వ్యవసాయం వస్తే ఉన్న కాస్త ఉపాధిని వారు కోల్పోతారని వాపోయారు. దీంతో పట్టణాలకు, గ్రామాలకు వలసలు పెరుగుతున్నాయనీ, అక్కడా సరైన పని లేక ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆర్థిక పోరాటాలకే పరిమితం కాకుండా రాజకీయ, సాంస్కృతిక చైతన్యం కల్పించే ఉద్యమాలు నిర్మించాలని పిలుపునిచ్చారు.

పని పరిస్థితులు అధ్వాన్నం..

(మొదటిపేజీ తరువాయి)



కంపెనీల్లో పనిచేస్తున్న సిబ్బంది, కార్మికులకు న్యాయమైన వేతనాలు దక్కటం లేదు. న్యాయమైన హక్కులు, యాజమాన్య పద్ధతులు, కాంట్రాక్ట్ విధానాల్లేవని, సరైన పని పరిస్థితులు లేవని నివేదిక పేర్కొన్నది. కంపెనీల్లో అమలవుతున్న పని విధానాలతో కార్మికులకు ఎలాంటి లబ్ది చేకూరటం లేదు. బిగ్ బాస్కెట్, ఫ్లిప్‌కార్ట్, ఉర్బాన్ మాత్రమే కనీస వేతనాల అందజేతపై కట్టుబడి ఉన్నామని అధికారికంగా తెలిపాయి. మిగతా కంపెనీలేవీ స్పష్టత ఇవ్వలేదు. కార్మికులు నిరసనగళం వినిపించినా పట్టించుకునే నాథుడే లేడు. తమ గోడు ఎవరికి చెప్పలనేది కూడా కార్మిక సంఘాలకు తెలియని పరిస్థితి. కారణం మూడో పార్టీకి వర్క్ కాంట్రాక్ట్ ఇస్తూ కంపెనీలు తమ సేవల్ని అందజేస్తున్నాయి. కార్మికుల న్యాయపరమైన డిమాండ్లతో తమకు సంబంధం లేదని ఈ-కామర్స్ కంపెనీలు భావిస్తున్నాయి.

అనేక కంపెనీల స్కోర్ జీరో

తమకు కనీస వేతనాలు దక్కటం లేదని కార్మికులు, ఇతర సిబ్బంది, కార్మిక సంఘాలు పదే పదే ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. వీటిపై ఈ-కామర్స్ కంపెనీలు బహిరంగంగంగా స్పందించటం లేదు. 12 ఈ-కామర్స్ కంపెనీలపై 'ఫెయిర్‌వర్క్ ఇండియా' అధ్యయనం చేసింది. కార్మికుల కనీస వేతనాలు..తదితర అంశాలను ఆధారంగా స్కోర్ కేటాయించింది. ఇందులో ఓలా, ఉబర్, డుంజో, ఫార్మాఈజీ, అమెజాన్‌లకు 'జీరో' స్కోర్ వచ్చింది. ఉర్బాన్‌కు 7, బిగ్‌బాస్కెట్‌కు 7, ఫ్లిప్‌కార్ట్, స్విగ్గీలకు 5 స్కోర్ దక్కగా, గ్రోసరీ-రెండు, జొమాటో-4, జెప్టో-2, పోర్టర్-1కు లభించింది. స్థానికంగా ఒక గంటకు కనీస వేతనాన్ని పరిగణలోకి తీసుకొని వేతనాలు చెల్లిస్తున్నామని బిగ్ బాస్కెట్, ఫ్లిప్‌కార్ట్, ఉర్బాన్ ఆధారాలు సమర్పించాయి. న్యాయమైన వేతనాలు ఏమేరకు అందుతున్నాయన్న వివరాలు మాత్రం విడుదల చేయటం లేదు.

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా జి.నాగయ్య, ఆర్.వెంకట్రాములు

- 87 మందితో నూతన రాష్ట్ర కమిటీ ఎన్నిక
- ఆఫీస్‌బేరర్లుగా 22 మంది

ఖమ్మం నుంచి నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా జి.నాగయ్య, ఆర్.వెంకట్రాములు ఎన్నికయ్యారు. ఖమ్మంలోని వేదగిరి శ్రీనివాసరావు(భక్తరామదాసు కళాక్షేత్రం)లోని అమరవీరుల ప్రాంగణంలో జరుగుతున్న రాష్ట్ర మూడో మహాసభలో శనివారం నాడు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొత్త కమిటీలో 87 మంది ఉన్నారు. అందులో 22 మంది ఆఫీస్ బేరర్లుగా ఉండనున్నారు. ఉపాధ్యక్షులుగా తమ్మినేని వీరభద్రం, పొన్నం వెంకటేశ్వరరావు, ములకలపల్లి రాములు, ఎం.ఆంజనేయులు, పెద్ది వెంకట్రాములు, అల్వాల వీరయ్య, లంక రాములు, నర్సింహులు, సమ్మయ్య, కార్యదర్శులుగా పద్మ, నారి అయిలయ్య, మచ్చా వెంకటేశ్వర్లు, కొండమడుగు నర్సింహ్మ, ఎం. వెంకటయ్య, యు.గోపాల్, వెంకటరాజు, కె.జగన్, ఆర్.శశిధర్, సాంబశివ, కో-ఆప్షన్(మహిళ) ఎన్నికయ్యారు. పశ్చిమబెంగాల్‌లోని హౌరాలో ఫిబ్రవరి 15 నుంచి 18వ తేదీ వరకు జరగబోయే అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం మహాసభలకు కూడా ప్రతినిధులను మహాసభలో ఎన్నుకున్నారు.

ఎన్ఐఏ కేసుల పెరుగుదలలో ఆల్‌టైమ్ రికార్డు

న్యూఢిల్లీ : నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ) ఎన్నడూ లేనంతగా ఏడాదిలోనే పెరిగాయి. ఏడాదిలో 19.67 శాతం ఎన్ఐఏ కేసులు పెరిగాయి. 2021లో 61 కేసులను ఎన్ఐఏ నమోదు చేయగా, 2022లో ఎన్ఐఏ కేసుల నమోదు 73కు పెరిగింది. ఇది 19.67 శాతం పెరుగుదలతో ఎన్ఐఏకి ఇది ఆల్ టైట్ రికార్డుగా ఉంది. ఈ కేసుల్లో జమ్మూకాశ్మీర్, అసోం, బీహార్, ఢిల్లీ, కర్నాటక, కేరళ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, తమిళనాడు, తెలంగాణ, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో 35 జిహాదీ టెర్రర్ కేసులు ఉన్నాయి. జమ్మూ కాశ్మీర్‌లో 11 కేసులు, నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో 10 కేసులు, ఈశాన్య రాష్ట్రాల్లో ఐదు కేసులు, పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పిఎఫ్ఐ) సంబంధిత కేసులు ఏడు, పంజాబ్‌లో ఐదు కేసులు, గ్యాంగ్‌స్టర్, టెర్రర్, డ్రగ్ స్మగ్లర్ సంబంధిత మూడు కేసులు, తీవ్రవాద నిధుల కేసు ఒకటి, నకిలీ భారతీయ కరెన్సీ నోటు (ఎఫ్ఐసిఎన్) సంబంధిత కేసులు రెండు నమోదు అయ్యాయి.

ఎన్ఐఎ 2022లో 368 మందిపై 59 చార్జిషీట్లు దాఖలు చేసింది. పరారీలో ఉన్న19 మందితో పాటు 456 మంది నిందితులను ఎన్ఐఏ అరెస్టు చేసింది. బహిష్కరణపై ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. అప్పగించిన తరువాత ఒక నిందితుడిని అరెస్టు చేశారు. 2022లో 38 ఎన్ఐఎ కేసుల్లో తీర్పులు వెలువడ్డాయి. అవన్నీ నేరారోపణతో ముగిశాయి. 109 మందిని దోషులుగా నిర్ధారించిన కోర్టు కఠిన కారాగార శిక్ష, జరిమానా విధించింది. 2022లో ఆరు జీవిత ఖైదులు కూడా విధించబడ్డాయి. మొత్తం నేరారోపణ రేటు 94.39 శాతంగా ఉంది. ఇది కాకుండా, 2022లో యుఎపిఎ కింద ఎనిమిది మంది వ్యక్తులను వ్యక్తిగత ఉగ్రవాదులుగా గుర్తించారు.

ముఖ్యమంత్రిని కలిసిన నూతన డీజీపీ

నవ తెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్ర నూతన డీజీపీగా బాధ్యతలు చేపట్టిన అనంతరం అంజనీకుమార్ నేరుగా ప్రగతి భవన్‌కు వెళ్లి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిశారు. తనకు రాష్ట్ర డీజీపీగా అవకాశాన్ని ఇచ్చినందుకు ఆయన ముఖ్యమంత్రికి ఈ సందర్భంగా కృతజ్ఞతలను తెలిపారు. ముఖ్యమంత్రి సైతం అంజనీకుమార్‌ను అభినందిస్తు పోలీసు శాఖ ప్రతిష్టను మరింతగా పెంచాలనీ, శాంతి భద్రతలు, నేరాల అదుపునకు కృషి చేయాలని కోరుతూ శుభాకాంక్షలు చెప్పారు. అక్కడి నుంచి అంజనీకుమార్ రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్‌లను గౌరవ సూచకంగా కలిశారు.

బుల్డోజర్ రాజకీయం



యూపీ నుంచి ఎంపీ దాకా అరాచకత్వం
రెచ్చిపోయిన బీజేపీ ప్రభుత్వాలు
అణగారిన వర్గాల ప్రజల ఇండ్లు, నిర్మాణాలు కూల్చివేత

న్యూఢిల్లీ : దేశంలో అణగారిన వర్గాల ప్రజలపై బీజేపీ బుల్డోజర్ రాజకీయాలు పీడకలను మిగిల్చాయి. ఆక్రమణల పేరుతో కేవలం ఒక వర్గం వారినే లక్ష్యంగా చేసుకుంటూ ఈ రాజకీయాలు సాగాయి. ఈ ఏడాదిలో (2022లో) యూపీలో రెండో సారి అధికారంలోకి వచ్చిన తర్వాత అక్కడి యోగి ప్రభుత్వం రెచ్చిపోయింది. బుల్డోజర్లతో అక్రమ నిర్మాణాలుగా చెప్పబడిన ఇండ్లను నిర్దాక్షిణ్యంగా కూల్చివేసింది. కనీసం ఒక నిర్దిష్ట ప్రక్రియను పాటించకుండా నియంతృత్వంగా వ్యవహరించింది. గొడవలు జరిగాయని తెలిసిన వెంటనే.. అక్కడికి బుల్డోజర్లు దిగడం.. ఒక వర్గం వారిని లక్ష్యంగా చేసుకుంటూ వారి ఇండ్లను కూలగొట్టడం వంటివి యోగి సర్కారు చేసింది. బాధితులకు అండగా నిలిచి ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన ప్రతిపక్షాలు పూర్తిగా విఫలమయ్యాయి. అడ్డూ, అదుపు లేకపోవడంతో యోగి ప్రభుత్వం తన నిజస్వరూపాన్ని మరింతగా బయటపెట్టి కఠినంగా వ్యవహరించింది. యోగి సర్కారు బుల్డోజర్ రాజకీయం ఇతర రాష్ట్రాలకూ పాకింది. ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్, మధ్యప్రదేశ్, గుజరాత్, అసోం, బీహార్ వంటి రాష్ట్రాలూ బుల్డోజర్లను అమాయకపు ప్రజల ఇండ్లపై ప్రయోగించాయి.

ఢిల్లీ

ఈ ఏడాది ఏప్రిల్ 20న అధికారులు జహంగీర్‌పురిలోని మసీదు ద్వారం కూల్చారు అక్కడి మునిసిపల్ అధికారులు. అదే నెల 16న హనుమాన్ జయంతి సందర్భంగా బజరంగ్‌దళ్ సభ్యులు ఊరేగింపు వెళ్తున్న సందర్భంగా వారు ముస్లింలతో ఘర్షణకు దిగారు. అయితే, కోర్టు ఆదేశాలున్నప్పటికీ.. అదేమీ పట్టించుకోని అక్కడి మునిసిపల్ యంత్రాంగం (బీజేపీ నేతృత్వంలోని) మసీదు గేటును కూల్చివేసింది. జులై 6న ఢిల్లీ డెవలప్‌మెంట్ అథారిటీ (డీడీఏ) న్యూఢిల్లీలోని నిజాముద్దీన్ ఈస్ట్‌లోని సరాయ్ కాలే ఖాన్ ఎదురుగా ఉన్న గయాస్‌పూర్ బస్తీలో 60కి పైగా అద్దెదారులపై బుల్డోజర్‌ను ప్రయోగించింది. అలాగే, అంగన్వాడీలను కూడా కూల్చేసింది. కానీ, ఒక గోశాలను మాత్రం కనీసం ముట్టుకోకపోవడం గమనార్హం.

యూపీ

ఈ ఏడాది మార్చి 21న ఇద్దరు లైంగికదాడి నిందితులు అమీర్, ఆసిఫ్ ల ఇంటికి బుల్డోజర్‌ను తీసుకొచ్చి వారిని లొంగిపోయేలా బలవంతం చేసింది అక్కడి ప్రభుత్వం. ఈ క్రమంలో నిందితులు ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఈ విషయాన్ని యూపీ పోలీసులు కోర్టులో కూడా అంగీకరించడం గమనార్హం. ఏప్రిల్ 13న రాంపూర్ జిల్లా పోలీసులు హత్య నిందితుడి ఇంటిని కూల్చివేయడంపై విచారణకు ఆదేశించారు. సహరాన్‌పూర్‌లో ఇద్దరు నిందితులు అబ్దుల్ వాకీర్, ముజమ్మిల్‌ల ఆస్తులను కూల్చినట్టు ఎస్ఎస్పీ ఆకాశ్ తోమర్ అంగీకరించారు. జూన్ 13న ప్రయాగ్‌రాజ్ డెవలప్‌మెంట్ అథారిటీ జావేద్ మొహమ్మద్ (అలియాస్ జావేద్ పంప్) ఇంటిని కూల్చేసింది. డిసెంబర్ 10న జైషే మహ్మద్ కమాండర్‌గా భావిస్తున్న ఆషిక్ నెంగ్రూ ఇంటిని కూల్చివేశారు.

మధ్యప్రదేశ్

ఏప్రిల్ 10న ఎంపీలోని ఖర్గోన్‌లో రామనవమి సందర్భంగా రాళ్లదాడి జరిగింది. ఇందులో దాదాపు 80 మందిని అక్కడి ప్రభుత్వ అరెస్టు చేసింది. అయితే, హింసాకాండకు పాల్పడిన వారి 45 ఇండ్లను కూల్చివేశారని ఇండోర్ డివిజనల్ కమిషనర్ పవన్ శర్మ వెల్లడించడం గమనార్హం. అలాగే, షియోపూర్‌లో సామూహిక లైంగికదాడి కేసులో నిందితులుగా ఉన్న ముగ్గురు మైనారిటీ వర్గానికి చెందిన వారి ఇండ్లను శివరాజ్‌సింగ్ చౌహాన్ సర్కారు కూల్చివేసింది. పోలీసుల సమక్షంలోనే వారి ఇండ్లు బుల్డోజర్లతో నేలమట్టం కావడం గమనార్హం. మొరెనా జిల్లాలోని బాన్‌మోర్ పట్టణంలో లైంగికదాడి నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న గిర్రాజ్ రజాక్ అనే రోజువారీ కూలీ ఇంటిని 'అక్రమ నిర్మాణం'గా పేర్కొంటూ రాష్ట్ర ప్రభుత్వం కూల్చివేసింది.

గుజరాత్

ఏప్రిల్ 10న ఆనందద్ జిల్లాలోని ఖంబత్ పట్టణంలో రామ్‌నవమి ఊరేగింపు సందర్భంగా రాళ్ల రువ్విన ఆరోపణలు వచ్చాయి. అనంతరం ఆ జిల్లా కలెక్టర్.. ప్రభుత్వ భూమిలో ఉన్న అక్రమ కట్టడాలను కూల్చివేయాలని ఆదేశించారు. వీటిలో చాలా వరకు ఘర్షణల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఒక వర్గానికి చెందినవారివే కావడం గమనార్హం. ఏప్రిల్ 21న సూరత్ మునిసిపల్ కార్పొరేషన్ పోలీసులతో కలిసి గ్యాంగ్‌స్టర్ సోదరులు ఆరిఫ్, సజ్జు కొఠారీకి చెందిన ఆస్తులను కూల్చేసింది. అక్టోబరులో బెట్ ద్వారకా ద్వీపంలో సుమారు 10వేల మంది జనాభా ఉన్న 100 నిర్మాణాలు కూల్చివేయబడ్డాయి. వీటిలో ఎక్కువ భాగం మైనారిటీ సామాజికవర్గానికి చెందినవారివే కావడం గమనార్హం. నవంబర్‌లో, కచ్ జిల్లాలోని జఖౌ హార్బర్‌లో 300 ఇండ్లు, గుడిసెలు, గోడౌన్‌లు అక్రమంగా ఉన్నాయని భావించి కూల్చేశారు. దీంతో మత్స్యకారులు, చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు.

అసోం

మే 21న అసోంలోని నాగోన్ జిల్లాలోని ఎనిమిది ఇండ్లను అక్కడి అధికారులు కూల్చేశారు. జంతు హక్కుల కార్యకర్త వినీత్ బగారియా ఆత్మహత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న బైదుల్లా ఖాన్ నివాసాన్ని జులై 12న దిబ్రూఘర్ జిల్లా యంత్రాంగం కూల్చివేసింది. అదేనెలలో, కరీంగంజ్‌లోని ముస్లిం ప్రాబల్యం ఉన్న ప్రాంతంలో 90 ఇండ్లు ఆక్రమణల వ్యతిరేక డ్రైవ్‌లో నేల మట్టమయ్యాయి. అయితే, తమ వద్ద భూమికి సంబంధించిన పత్రాలు న్నాయని బాధితులు వెల్లడించడం కొసమెరుపు. సెప్టెంబరులో 100 మెగావాట్ల సోలార్ ప్లాంట్ ఏర్పాటు కోసం బోర్కొల్లా నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ భూమిలో నివసిస్తున్నారని పేర్కొంటూ 299 కుటుంబాలను అక్కడి నుండి ఖాళీ చేయించారు. వీరిలో 243 మంది మైనారిటీ వర్గాలకు చెందిన కుటుంబాలే కావడం గమనార్హం.

బీహార్

బీజేపీతో జేడీ(యూ) కొనసాగించిన సంకీర్ణ ప్రభుత్వంలోనూ బుల్డోజర్ రాజకీయాలు సాగాయి. ఏప్రిల్‌లో బీహార్ రెవెన్యూ మంత్రి రామ్ సూరత్ రాయ్ (బీజేపీ) పరారీలో ఉన్న నేరస్థులు, రాష్ట్ర ప్రభుత్వ భూమిని ఆక్రమించే వారిపై బుల్డోజర్ డ్రైవ్‌ను ప్రారంభిస్తామని హెచ్చరించారు. అయితే, ఆయన ప్రకటనను సీనియర్ జేడీ(యూ) నాయకుడు ఉపేంద్ర కుష్వాహా వ్యతిరేకించడం గమనార్హం. అయినప్పటికీ కొన్ని చోట్ల బీజేపీ మంత్రుల ఒత్తిళ్లతో నిర్మాణాల కూల్చివేతలు జరిగాయి. అయితే, ఇలాంటి విషయాల్లో పాట్నా హైకోర్టు అధికారుల తీరునే తప్పుబట్టడం గమనార్హం.

రిషబ్ పంత్‌కు చిన్నపాటి ప్లాస్టిక్ సర్జరీ



న్యూఢిల్లీ : రోడ్డు ప్రమాదానికి గురై డెహ్రాడూన్‌లో చికిత్స పొందుతున్న టీమ్‌ఇండియా యువ క్రికెటర్ రిషభ్ పంత్‌కు చిన్నపాటి ప్లాస్టిక్ సర్జరీ జరిగినట్టు ఢిల్లీ క్రికెట్ అసోసియేషన్ డైరెక్టర్ శ్యామ్ తెలిపారు. ముఖం మీద అయిన గాయాలకు డెహ్రాడూన్‌లోని మ్యాక్స్ ఆసుపత్రిలో ఈ సర్జరీ చేసినట్టు పేర్కొన్నారు. తొలుత ఢిల్లీకి ఎయిర్ అంబులెన్స్ ద్వారా తరలించాలని భావించినప్పటికీ.. మ్యాక్స్‌లోనే శస్త్రచికిత్సను నిర్వహించారు. ఈ మేరకు శ్యామ్ శర్మ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

బస్సు డ్రైవర్, కండక్టర్‌కు ప్రశంసలు

వికెట్ కీపర్ రిషభ్ పంత్ రోడ్డు ప్రమాదం నుంచి ప్రాణాలతో క్షేమంగా బయటపడడానికి సాయపడిన బస్సు డ్రైవర్ సుశీల్, కండక్టర్ పరమ్ జీత్ కు హర్యానా రోడ్ వేస్ అధికారులు ప్రశంసా పత్రాలు, షీల్డ్‌ను బహూకరించి, వారిని అభినందించారు. మానవత్వానికి వీరు (డ్రైవర్, కండక్టర్) నిదర్శనమని హర్యానా రాష్ట్ర రవాణా మంత్రి మూల్ చంద్ శర్మ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం వీరిని ప్రశంసించింది.

రూ.4400కోట్లకు రొనాల్డోతో
సౌదీ అరేబియా క్లబ్ ఒప్పందం



న్యూఢిల్లీ : ఫుట్‌బాల్ దిగ్గజ ఆటగాడు క్రిస్టియానో రొనాల్డో సౌదీ ఆరేబియా క్లబ్‌తో ఒప్పందం చేసుకున్నాడు. రూ.4400కోట్లకు రొనాల్డోతో ఒప్పందం చేసుకున్నట్టు సౌదీ అరేబియా ఫుట్ బాల్ క్లబ్ అల్ నాసర్ ప్రకటించింది. 37 ఏళ్ల రొనాల్డో అల్ నాసర్ క్లబ్ మూడేండ్ల పాటు ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో ఫుట్‌బాల్ చరిత్రలోనే అత్యధిక ధర కలిగిన ఆటగాడిగా రొనాల్డో సరికొత్త రికార్డు సృష్టించనున్నాడు. అల్ నాసర్ క్లబ్ తరపున మైదానంలోకి దిగనున్న రొనాల్డో తన జెర్సీని ఆవిష్కరించాడు. "అల్ నాసర్ క్లబ్ తరపున ఆడేందుకు ఆతతగా ఎదురుచూస్తున్నా.. ఇప్పటికే అనేక లీగ్‌లు, టోర్నీలను గెలిచాను. ఆసియా ఆటగాళ్లతోనూ నా అనుభవాన్ని పంచుకునేందుకు ఇదే సరైన సమయమని భావిస్తున్నా" అని తెలిపాడు.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి
- హైదరాబాద్‌లో కాగడాల ప్రదర్శన

ఐద్వా జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జనవరి మూడు నుంచి తొమ్మిది వరకు కేరళలోని త్రివేండ్రంలో జరగనున్న అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి పిలుపునిచ్చారు. ఐద్వా ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయం ఐలమ్మ భవనం నుంచి బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య పార్క్ వరకు కాగడాలతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లు లక్ష్మి మాట్లాడుతూ మూడేండ్లకోసారి ఐద్వా చేసిన కృషిని సమీక్షించుకుని భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకోవడానికి మహాసభలు జరుగుతాయని చెప్పారు.

ఈ మూడేండ్లలో అనేక ఒడిదుడుకులు ఎదుర్కొని సంఘం పనిచేసిందన్నారు. సమాజంలో ఎక్కువమంది మొత్తం కోవిడ్-19 బారిన పడి అనేక అవస్థలు పడ్డారని అన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, ధరల పెరుగుదల, మహిళలపై పెరిగిన దాడులు వంటి అంశాలపై మహాసభల్లో చర్చిస్తామని వివరించారు. ఇంకోవైపు మోడీ ప్రభుత్వం దోషులకు అండగా నిలబడడం ప్రమాదకర సంకేతమని చెప్పారు. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లోనూ ఐద్వా మహిళ పక్షాన, ప్రజలకు అండగా నిలబడి పోరాడిందని గుర్తు చేశారు. ప్రజాపంపిణీ వ్యవస్థ కోసం, అధిక ధరలకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేశామన్నారు. మహిళలపై దాడులు జరిగిన సందర్భాల్లో బాధితుల పక్షాన నిలబడి పోరాడి విజయాలు సాధించామని అన్నారు. రాబోయే మూడేండ్ల కాలంలో స్త్రీలకు ఉపాధి కోసం ప్రయివేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా విద్యావైద్యం పేదలకు ఉచితంగా ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహిళల రక్షణ కోసం చట్టాలను పటిష్టంగా అమలు జరపాలనీ, చట్టసభల్లో స్త్రీలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లు కోసం తీర్మానాలు చేసి కార్యాచరణ రూపొందిస్తామన్నారు. రాబోయే కాలంలో మహిళలు రాజ్యాంగం ఇచ్చిన హక్కులను కాపాడుకోవాలనీ, ఐద్వా చేపట్టే పోరాటాలు, పిలుపుల్లో భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ఆర్ అరుణజ్యోతి, ఉపాధ్యక్షులు కెఎన్ ఆశాలత, పి శశికళ, ఎమ్ వినోద, కె నాగలక్ష్మి, రాష్ట్ర నాయకులు ఎ పద్మ, ఎం లక్ష్మమ్మ, షబానా, ఎన్ పద్మ, సత్తెమ్మ, బి కవిత తదితరులు పాల్గొన్నారు



ఆహ్లాదంగా కళ్యాణం కమనీయం


సంతోష్ శోభన్, ప్రియా భవానీ శంకర్

యువకథానాయకుడు సంతోష్ శోభన్ నటిస్తున్న కొత్త సినిమా 'కళ్యాణం కమనీయం'. ఈ చిత్రంలో కోలీవుడ్ తార ప్రియా భవానీ శంకర్ నాయికగా నటిస్తోంది. ఈ చిత్రంతో ఆమె టాలీవుడ్ అరంగేట్రం చేస్తోంది. ఈ చిత్రాన్ని యూవీ కాన్సెప్ట్స్ సంస్థ నిర్మిస్తోంది. పెళ్లి నేపథ్యంతో సాగే ఆహ్లాదకర కథతో నూతన దర్శకుడు అనిల్ కుమార్ ఆళ్ల ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు.

సంక్రాంతి పండుగ సందర్భంగా జనవరి 14న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. తాజాగా ఈ సినిమా నుంచి 'హో ఎగిరే' అనే లిరికల్ పాటను విడుదల చేశారు. ఈ పాటకు కృష్ణకాంత్ సాహిత్యాన్ని అందించారు. శ్రావణ్ భరద్వాజ్ కంపోజ్ చేయగా, కపిల్ కపిలన్ పాడారు. 'ఓ కాటుక కన్నే, కన్నే.. మీటెను నన్నే కాటుక కన్నే కన్నే దాచెను నన్నే...'అంటూ ఓ యువ జంట మధ్య ప్రేమను వ్యక్తపరుస్తూ సాగిందీ పాట. ఇటీవలే రిలీజైన ఈ చిత్ర టైటిల్ మోషన్ పోస్టర్, ఫస్ట్ లుక్‌కు మంచి స్పందన వస్తోంది. లిరికల్ సాంగ్స్ ఒక్కొక్కటిగా రిలీజ్ చేస్తూ వస్తున్నారు. ఈపాటలు అందమైన సంగీత. సాహిత్యాలతో ఆకట్టుకుంటున్నాయి. యూవీ కాన్సెప్ట్స్ నుంచి మరో కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ రాబోతోంది.

ఓ రచయిత జీవిత సంఘర్షణ..

చాయ్ బిస్కెట్ యూట్యూబ్ వీడియోలతో తన నటనా జీవితాన్ని ప్రారంభించిన సుహాస్ అద్భుతమైన ప్రతిభ గల నటుడిగా వైవిధ్యమైన పాత్రలు, చిత్రాలతో అందరినీ ఆకట్టుకున్నాడు. 'కలర్ ఫోటో'లో అద్భుతమైన నటన కనబరిచాడు. ఈ చిత్రం జాతీయ అవార్డును కూడా గెలుచుకుంది. ఇటీవలే 'హిట్-2'లో కూడా సైకోగా అందరినీ ఆశ్చర్యపరిచాడు. హిలేరియస్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న తన తాజా చిత్రం 'రైటర్ పద్మభూషణ్'. ఇందులో స్ట్రగులింగ్ రైటర్‌గా కనిపించనున్నాడు. ఈ సినిమా థియేట్రికల్ విడుదల తేదీని మేకర్స్ ప్రకటించారు.

ఈ ఏడాది ఫిబ్రవరి 3న ఈ సినిమా థియేటర్లలోకి రానుంది. విడుదల తేదీ పోస్టర్ జీవితంలో పెద్ద లక్ష్యాలను కలిగి ఉన్న సాధారణ యువకుడిగా కనిపించాడు సుహాస్. చక్కని చిరునవ్వుతో ప్రకాశం బ్యారేజీపై నిలబడి ఫోజు ఇవ్వడం అందర్నీ ఆకట్టుకుంటోంది.

విజయవాడ నేపథ్యంలోసాగే ఈ చిత్రంలో టీనా శిల్పరాజ్ కథానాయికగా నటిస్తోంది. లహరి ఫిల్మ్స్‌తో కలిసి చాయ్ బిస్కెట్ ఫిల్మ్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి నూతన దర్శకుడు షణ్ముఖ ప్రశాంత్ దర్శకత్వం వహిస్తున్నారు.


సుహాస్

అనురాగ్, శరత్, చంద్రు మనోహర్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని మనోహర్ గోవిందస్వామి సమర్పిస్తున్నారు.శేఖర్ చంద్ర సంగీతం అందించిన చిత్రంలోని ఫస్ట్ సింగిల్ 'కన్నుల్లో నీ రూపమే' చార్ట్‌బస్టర్‌గా నిలిచింది. ఈ చిత్రానికి వెంకట్ ఆర్ శాకమూరి సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. చిత్రం ట్రైలర్‌ను త్వరలో విడుదల చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. సుహాస్, టీనా శిల్పరాజ్, ఆశిష్ విద్యార్థి, రోహిణి మొల్లేటి, గోపరాజు రమణ, శ్రీ గౌరీ ప్రియ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి రచన, దర్శకత్వం: షణ్ముఖ ప్రశాంత్, నిర్మాతలు: అనురాగ్, శరత్, చంద్రు మనోహర్, సమర్పణ: మనోహర్ గోవింద్ స్వామి, సంగీతం: శేఖర్ చంద్ర, డీవోపీ : వెంకట్ ఆర్ శాకమూరి, ఎడిటర్: పవన్ కళ్యాణ్ కోదాటి, సిద్ధార్థ్, బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్: కళ్యాణ్ నాయక్, ఆర్ట్: ఎల్లయ్య ఎస్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సూర్య చౌదరి.

ఈ సినిమాలో ఓ రచయితగా నేను పడే జీవిత సంఘర్షణ ఆద్యంతం అందర్నీ ఆకట్టుకుంటుంది. ఇలాంటి పాత్రలు చాలా అరుదుగా వస్తాయి. అసలు ఓ రచయితగా నేను సాధించాలనుకున్న లక్ష్యం ఏమిటి?, ఈ లక్ష్య సాధనలో నేను ఎదుర్కొన్న సమస్యలు ఏంటి? వంటి తదితర అంశాలతో ఈ చిత్రాన్ని దర్శకుడు ఎంతో అద్భుతంగా తెరకెక్కించాడు.
- హీరో సుహాస్


సాహూ గారపాటి, బాలకృష్ణ, హరీష్ పెద్ది, అనిల్ రావిపూడి

బాలయ్య సెట్లో న్యూ ఇయర్ సెలబ్రేషన్స్

బాలకృష్ణ, అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో రూపొందుతున్న క్రేజీ ప్రాజెక్ట్ ఎన్‌బికె 108 షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ప్రొడక్షన్ డిజైనర్ రాజీవన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో వేసిన భారీ జైలు సెట్‌లో మాసీవ్ యాక్షన్ సీక్వెన్స్‌తో తాజాగా టీమ్ మొదటి షెడ్యూల్‌ను పూర్తి చేసింది. ఈ యాక్షన్ సీక్వెన్స్‌కి వెంకట్ మాస్టర్ యాక్షన్ కొరియోగ్రఫీ చేశారు. ఈ షెడ్యూల్‌లో బాలకృష్ణ, శరత్ కుమార్‌తో పాటు మరికొంతమంది ఆర్టిస్టులపై కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ సెట్‌లోనే ఎన్‌బికె 108 యూనిట్ నూతన సంవత్సర వేడుకలని గ్రాండ్‌గా సెలబ్రేట్ చేశారు.

షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి, హరీష్ పెద్ది ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. బాలకృష్ణ మునుపెన్నడూ పోషించని పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమాలో బాలకృష్ణ మార్క్ మాస్ యాక్షన్, అనిల్ రావిపూడి మార్క్ ఎలిమెంట్స్ ఉండబోతున్నాయి. బాలకృష్ణ స్టార్‌డమ్‌ని దృష్టిలో పెట్టుకుని దర్శకుడు అనిల్ రావిపూడి ఓ పవర్‌ఫుల్ కథను రాశారు.

ఈ చిత్రంలో హీరోయిన్ శ్రీలీల కీలక పాత్ర పోషిస్తోంది. మ్యూజికల్ సెన్సేషన్ ఎస్ తమన్ సంగీతం అందిస్తున్నారు. ప్రముఖ నటీనటులు, సాంకేతిక నిపుణులు పనిచేస్తున్నారు. సి రామ్ ప్రసాద్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా. తమ్మి రాజు ఎడిటర్‌గా, రాజీవ్ ప్రొడక్షన్ డిజైనర్‌గా పని చేస్తున్నారు. యాక్షన్ పార్ట్‌కి వి.వెంకట్ కొరియోగ్రఫీ అందిస్తున్నారు అని చిత్ర బృందం తెలిపింది. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్ కృష్ణ, డీవోపీ: సి రామ్ ప్రసాద్, ఎడిటర్: తమ్మి రాజు, ప్రొడక్షన్ డిజైనర్: రాజీవ్, ఫైట్స్: వి.వెంకట్.

నవచిత్రం

రెండింటిలోనూ పవర్‌ఫుల్ యాక్షన్ సీక్వెన్స్‌లు

ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నిర్మాతలు నవీన్ యెర్నేని, వై రవిశంకర్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న చిరంజీవి-బాబీ కొల్లి కాంబినేషన్‌లో 'వాల్తేరు వీరయ్య', బాలకృష్ణ -గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో 'వీరసింహారెడ్డి'. ఈ చిత్రాలు సంక్రాంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానున్నాయి.

ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్న 'వాల్తేరు వీరయ్య' జనవరి 13న రిలీజ్ అవుతుండగా, 'వీరసింహారెడ్డి' జనవరి 12న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. భారీ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్స్‌గా రూపొందిన ఈ రెండు చిత్రాలకు రామ్ లక్ష్మణ్ మాస్టర్స్ యాక్షన్ కొరియోగ్రఫీ అందించారు.

ఈ సందర్భంగా విలేఖరుల సమావేశంలో ఈ రెండు చిత్రాల విశేషాలను షేర్ చేసుకున్నారు.


రామ్, లక్ష్మణ్

'క్యారెక్టరైజేషన్, బాడీ లాంగ్వేజ్ ప్రకారం కూడా యాక్షన్ డిజైన్ చేయాలి. 'వీరసింహారెడ్డి'లో బాలయ్య బాబు చైర్‌లో కూర్చుని ఉంటారు. ఎదురుగా రౌడీలు వస్తుంటారు. బాలయ్య క్యారెక్టరైజేషన్ ప్రకారం.. ఈ రౌడీలని కూడా నిల్చునికొట్టాలా? అనే ఆలోచన వచ్చింది. దీంతో ఆయన చైర్‌లో కూర్చునే ఒక పవర్ ఫుల్ ఫైట్‌ని కంపోజ్ చేశాం. చైర్‌లో కూర్చునే ఫైట్ చేయొచ్చు అనే మూడ్ చాలా అద్భుతంగా క్రియేట్ అయ్యింది. అది బాలయ్య క్యారెక్టరైజేషన్‌లో ఉన్న మ్యాజిక్. అలాగే చిరంజీవిగారి 'వాల్తేరు వీరయ్య'లో ఇంటర్వెల్ సీక్వెన్స్ చేశాం. లుంగీ కట్టుకొని, శ్రీకాకుళం యాస మాట్లాడుతూ అందరితో సరదాగా కలిసిపోయే చిరంజీవి ఇంటర్వెల్‌లో సడన్‌గా రెండు గన్స్ పట్టుకొని స్టయిలీష్‌గా కనిపిస్తారు. ఈ యాక్షన్ సీక్వెన్స్ అద్భుతంగా వచ్చింది. అలాగే చిరంజీవి, శ్రుతి హాసన్ మధ్య ఒక సరదా ఫైట్ కూడా కంపోజ్ చేశాం. దీన్ని ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తారు. అలాగే 'వీరసింహా రెడ్డి' ఇంటర్వెల్ ఫైట్ టర్కీలో చేశాం. అక్కడ భారీగా ఖర్చు అయ్యింది. అయితే ఫైట్ మాత్రం చాలా పవర్ ఫుల్‌గా ఉంటుంది. చిరంజీవి 'వాల్తేరు వీరయ్య', బాలకృష్ణ 'వీరసింహారెడ్డి' సినిమాలు సంక్రాంతి వస్తున్నాయి. ఇద్దరి ఫ్యాన్స్‌లో భారీ అంచనాలు ఉంటాయి. అభిమానులు అంచనాలు అందుకునే విధంగా రెండు సినిమాల్లో భిన్నమైన కథలు. దర్శకులు బాబీ, గోపీచంద్ మలినేని రెండు భిన్నమైన క్యారెక్టరైజేషన్స్, బాడీ లాంగ్వేజ్ రాసుకున్నారు. రెండు డిఫరెంట్‌గా ఉండటం వలన క్యారెక్టరైజేషన్, బాడీ లాంగ్వేజ్ తగ్గట్టు యాక్షన్ కంపోజ్ చేశాం. బాలకృష్ణ 'వీరసింహారెడ్డి'లో ఎమోషనల్ ఇంటర్వెల్ బ్యాంగ్ చూస్తే ప్రతి ఒక్కరూ కంటతడి పెట్టాల్సిందే. మేము స్పాట్‌లోనే కన్నీళ్లు పెట్టుకున్నాం. అలాగే 'వాల్తేరు వీరయ్య'లో అన్నయ్య, రవితేజ మధ్య ఒక ఎమోషనల్ డ్రామా ఉంటుంది. అన్నయ్య చిరు అద్భుతంగా చేశారు. ఇదీ కన్నీళ్లు తెప్పిస్తుంది' అని తెలిపారు.

నవ్వకుండా ఉంటే రూ.లక్ష బహుమతి

సాయిరోనక్, అంకిత సాహా, బిస్మి నాస్ హీరో, హీరోయిన్లుగా నటించి ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చిన సినిమా 'రాజయోగం'. ఈ చిత్రాన్ని శ్రీ నవబాలా క్రియేషన్స్, వైష్ణవి నటరాజ్ ప్రొడక్షన్స్ పతాకాలపై మణి లక్ష్మణ్‌రావు నిర్మించారు. దర్శకుడు రామ్ గణపతి తెరకెక్కించిన ఈ సినిమా విడుదలైన అన్ని చోట్లా మంచి రెస్పాన్స్ తెచ్చుకుని ఘన విజయాన్ని సాధించింది. ఈ సందర్భంగా చిత్ర బృందం హైదరాబాద్‌లో సక్సెస్ మీట్ నిర్వహించింది.

దర్శకుడు రామ్ గణపతి మాట్లాడుతూ, 'మా సినిమాకు థియేటర్ల నుంచి సూపర్బ్ రెస్పాన్స్ వస్తోంది. ఒక్క క్షణం కూడా స్క్రీన్ నుంచి చూపు తిప్పుకోకుండా చూస్తున్నామని ప్రేక్షకులు చెబుతున్నారు. ఇది నా మొదటి సినిమా అయినా, అనుభవజ్ఞుడైన దర్శకుడిలా తెరకెక్కించానని అనే ప్రశంసలు వస్తున్నాయి. ఇంకా సినిమా చూడని వారు త్వరగా చూసేయండి. ఎంత మంచి సినిమా అయినా మూడు రోజులకు మించి థియేటర్లలో ఉంచడం లేదు. సినిమా చూసి ఎంజాయ్ చేయండి. అలాగే ఈ చిత్రం చూసి నవ్వకుండా ఉండగలిగితే వాళ్ళకు లక్ష రూపాయల బహుమతి ఇస్తాం అని మా నిర్మాతలు ప్రకటించారు అంటే మాకెంత నమ్మకమో మీరు అర్థం చేసుకోండి' అని అన్నారు. 'ఈ సినిమాకి వస్తున్న రెస్పాన్స్ చూస్తుంటే మేము పడిన కష్టానికి ఫలితం దక్కిందని అనిపిస్తోంది. అయితే మంచి చిత్రానికి కూడా థియేటర్స్, షోస్ దొరకడం లేదు. ప్రేక్షకులు చూడాలని అనుకున్నా, ఆ టైమ్‌కు షోస్ ఇవ్వకుంటే ఎలా చూస్తారు?, నా లాంటి కొత్త హీరోలు, దర్శకులు ఎన్నో ఆశలతో ఇండస్ట్రీకి వచ్చాం. చేసిన మంచి సినిమాలకైనా థియేటర్ల పరంగా సపోర్ట్ దొరక్కపోతే ఎలా?, మా సినిమా లాంటి మంచి చిత్రాలను ఎంకరేజ్ చేయాలని కోరుతున్నా. మంచి సినిమాలో నటించానని హ్యాపీగా ఉంది' అని హీరో సాయి రోనక్ తెలిపారు.


విజయానందంలో 'రాజయోగం' చిత్ర బృందం

శాంతియుతంగా న్యూ ఇయర్ వేడుకలు

నవతెలంగాణ-కోదాదరూరల్

శాంతియుతమైన వాతావరణంలో నూతన సంవత్సరపు వేడుకలు జరుపుకోవాలని పట్టణ టౌన్ ఎస్సై ఎం రామాంజనేయులు అన్నారు. శనివారం పట్టణములో త్రివేణి డిగ్రీ కళాశాలలో జరిగిన కమ్యూనిటీ పోలీస్ వ్యవస్థపై విద్యార్థులను ఉద్దేశించి వారు మాట్లాడినారు. విద్యార్థులు, యువత మద్యం తాగి బైక్ రైడింగ్ చేయరాదని, ఎలాంటి ఘర్షణ వాతావరణం లేకుండా చూడాలని, నిర్ణయించిన సమయం మేరకు వేడుకలు జరుపుకోవాలని, ప్రతి పౌరుడు యూనిఫామ్ లేని పోలీస్, కాబట్టి శాంతి భద్రతలకు భంగం కలగకుండా చూడవలసిన బాధ్యత ప్రజలపై ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ కె పి చారి, హెచ్ సి మండవ హుస్సేన్ గౌడ్, కోటి,విద్యాసంస్థల చైర్మన్ బాణాల వసంత వెంకటరెడ్డి, ప్రిన్సిపాల్ సిరికొండ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ శివకుమార్, సీనియర్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుత్తా అమిత్ రెడ్డిని కలిసిన ఉదయ్

నవతెలంగాణ- ఆలేరురూరల్ .



ఆలేరు మండలం సారాజీపేట యువకుడు దూడల ఉదయ్ కుమార్ శనివారం తెలంగాణ శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తనయుడు గుత అమిత్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా శనివారం వారి నివాసంలో కలిసి పుష్పగుచ్చం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట శ్రీను, రోహిత్ తదితరులు ఉన్నారు.



న్యూ ఇయర్ జోష్

- వేడుకలకు యువత సిద్ధం
- ఉత్సాహంగా గడిపేందుకు ముందస్తు ప్లాన్

నవతెలంగాణ- నల్లగొండ

న్యూయర్ జోష్‌కు నల్లగొండ ఉమ్మడి జిల్లా సిద్ధమవుతున్నది. 2022 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ 2023 కొత్త ఏడాదికి జిల్లా వాసులు స్వాగతం పలికారు. ఈ క్రమంలో కొందరు శనివారం నుంచి ప్రణాళికలు సిద్ధం చేసుకుంటుండగా, పలువురు రిసార్ట్‌లు, బ్యాంకెట్ హాల్‌లు, హాలిడే ట్రిప్‌లు బుక్ చేసుకుని వేడుకలకు సిద్ధమయ్యారు. రాబోయే కొత్త సంవత్సరం తమ జీవితంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని, సంతోషంగా గడవాలని ఆకాంక్షిస్తూ వేడుకలకు సిద్ధమవుతున్నారు. అలాగే, పలు కళాశాలలు, పాఠశాలల్లో సైతం వేడుకల కోసం నిర్వాహకులు సమాయత్తమవుతున్నారు.

నగరవాసులకు కొత్త కల్చర్

న్యూ ఇయర్ వేడుకల్లో భాగంగా యువత కొత్త కల్చర్‌కు తెరలేపుతున్నారు. పట్టణాలు, నగరాల్లో వేడుకలకు దూరంగా ఉంటూ, ఫాం హౌస్‌లు, రిసార్ట్స్, బ్యాంకెట్ హాల్స్‌ను ముందుగా బుక్ చేసుకుని, వేడుకలను అక్కడే నిర్వహించుకునేందుకు సిద్ధమయ్యారు. ఇందుకు జిల్లా పరిసరాల్లోని పలు రిసార్ట్స్, ఫాంహౌస్‌ల నిర్వాహకులు సైతం ధరలను అందుబాటులోకి తీసుకువచ్చి తక్కువ ధరలో సేవలు అందిస్తున్నారు. ఈ క్రమం వారికి ఆయా రిసార్ట్‌లలోనే మద్యం, మాంసం, స్విమ్మింగ్ పూల్స్, క్యాంప్ ఫైర్, బార్బీక్యూ ఇలా యువతను ఆకట్టుకునే స్థాయిలో ఏర్పాటు చేస్తున్నారు. వీటితో పాటు యువత ఆసక్తిని బట్టి డీజేలు, లేజర్ లైటింగ్, ఓపెన్ బార్, రేన్ డ్యాన్స్ ఇలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తున్నది. అలాగే, పది నుంచి 30 వరకు ఉన్న సభ్యులు బ్యాంకెట్ హాల్స్ బుక్ చేసుకుని వేడుకలు నిర్వహించుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఇందులో తమకు కావాల్సిన మెనూకు 600 నుంచి 900 వరకు వెచ్చిస్తున్నారు.

బిజీగా మారనున్న బేకరీలు. . .

ప్రజల అభిరుచులకు అనుగుణంగా వ్యాపారులు నోరూరించే కేక్‌లను తయారు చేసి జిల్లాలలో ప్రత్యేక ఆఫర్లను ప్రకటించారు. వెనీలా కేక్, స్ట్రాబెర్రీ, బట్టర్ స్కాచ్, ఫ్రూట్స్‌కేక్, కూల్‌కేక్‌తో పాటు పలు రకాలైన కేక్‌లను అమ్మకాలకు సిద్ధం చేశారు. యువతను ఆకర్షించేందుకు కేక్‌లను కేజీకి 250 నుంచి 800 వరకు అమ్మకాలకు పెట్టారు. ఎగ్‌లెస్, కూల్ కేక్‌లు కేజీ 350 నుంచి 1500 వరకు విక్రయిస్తున్నారు. వీటితోపాటు ప్రత్యేక ధరలతో చికెన్, మటన్, చికెన్ ధమ్ బిర్యానీ, వెజ్ బిర్యానీ, విజిటేబుల్ బిర్యానీలను విక్రయిస్తున్నారు. వీటికి కూల్ డ్రింక్స్ బహుమతిగా ఇస్తూ పలు చోట్ల వ్యాపారులు జనాలను ఆకట్టుకున్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన పలు బిర్యానీ కేంద్రాల నిర్వాహకులు తక్కువ ధరలకు కేజీ, 2 కేజీలు, 5 కేజీలు, 10 కేజీల బిర్యానీని బకెట్ల ద్వారా కస్టమర్లకు అందించనున్నారు.

రాత్రి 10 నుండి ఆంక్షలు విధించిన పోలీసులు. ..

31వ తేది రాత్రి 10 గం. నుండి పోలీసులు స్పెషల్ డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం మత్తులో వాహనాలు నడిపితే అలాంటి వారిని అదుపులోకి తీసుకుని జరిమానా, వాహనం సీజ్ చేయడం, లైసెన్స్ రద్దు చేయడం, బైయిండోవర్ లాంటి చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని ఇప్పటికే హెచ్చరించారు. ట్రిబుల్ రైడింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండ వాహనం నడిపితే కూడా చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు ప్రకటన చేయడంతో ముందస్తుగా యువకులు అప్రమత్తమయ్యారు. మఫ్టీ టీమ్స్, స్పెషల్ బ్రాంచ్ సిబ్బందితో అక్రమ సిట్టింగులు, ఆరుబయట మద్యం సేవించడం, గుంపులు గుంపులుగా తిరుగుతూ మహిళలను వేదింపులకు గురి చేస్తూ,ఇబ్బందులను పెట్టే వారిపై ఎప్పడికప్పుడు పర్యవేక్షణ నిర్వహిస్తామని తెలపడంతో యువకులు ఫామ్ హౌస్ లు, రిసార్ట్స్ హెూటల్స్, బుక్ చేసుకున్నారు.



వ్యాపార సంస్థగా రాజకీయం

- జానకమ్మ ఆశయాలను సాధించాలి
- మజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

నవతెలంగాణ- మిర్యాలగూడ

వ్యాపార సంస్థగా రాజకీయం మారిపోయిందని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. కట్టబోయిన జానకమ్మ 12వ వర్ధంతి సందర్భంగా శనివారం నందిపాడు చౌరస్తా వద్ద ఆమె స్థూపానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి గెలవడం లక్ష్యంగా పనిచేసి ఆ తర్వాత కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్నారని విమర్శించారు. డబ్బులతో ఏదైనా చేయవచ్చుని పాలకులు భావిస్తున్నారని భవిష్యత్తులో ప్రజలు చైతన్యవంతులై అలాంటి వారికి బుద్ధి చెప్తారని హెచ్చరించారు. మిర్యాలగూడ పరిసర ప్రాంతంలో కమ్యూనిస్టు ఉద్యమానికి జానకమ్మ పునాది వేశారని గుర్తు చేశారు. ఎంతోమంది కార్యకర్తలకు అన్నం పెట్టిన అన్నపూర్ణగా జానకమ్మ నిలిచారని అన్నారు. ఆమె సాధన కోసం కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు లక్ష్మీనారాయణ, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, జిల్లా కమిటీ సభ్యులు రవి నాయక్, రాగిరెడ్డి రంగారెడ్డి,పి వరలక్ష్మి, శశిధర్ రెడ్డి, పరుశు రాములు, ఆయూబ్, తిరుపతి రామ్మూర్తి, సీనియర్ నాయకులు జగదీష్ చంద్ర, సత్యనారాయణ రావు, గాదె పద్మ, పాపి రెడ్డి, రామారావు, బిఎం నాయుడు, గోవర్ధన, ఊర్మిళ పాల్గొన్నారు.

క్రీడలు మానసికోల్లాసానికి దోహదం

నవతెలంగాణ-చౌటుప్పల్



క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడ్తాయని మాజీ ప్రభుత్వ విప్ కర్నె ప్రభాకర్ అన్నారు. శనివారం చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలోని తంగడపల్లిలోని ముస్కు మధుసూదన్‌రెడ్డి స్టేడియంలో జెజెఆర్ ఫౌండేషన్ ప్రీమియర్ లీగ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయన్నారు. క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత కల్పిస్తుందన్నారు. జెజెఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న క్రీడలతో మట్టిలో మాణిక్యాలు వెలుగులోకి వస్తాయన్నారు. యువత క్రీడల్లో పాల్గొనాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ వెన్‌రెడ్డి రాజు, కౌన్సిలర్ ఆలె నాగరాజు, మాజీ వార్డు సభ్యులు దండ అరుణ్‌కుమార్, బత్తుల విప్లవ్‌కుమార్, ఫౌండేషన్ ఛైర్మన్ జొర్రిగల జ్ఞానేశ్వర్, వేణుయాదవ్, పెద్దగోని రమేశ్‌గౌడ్, దర్శన్, శ్రీరాములు పాల్గొన్నారు.

నైతిక విలువలతో కూడిన విద్యనందించాలి

- కలెక్టర్ పమేలా సత్పతి



నవతెలంగాణ -భువనగిరి రూరల్

విద్యార్థులకు పాఠ్య అంశాలతో పాటు నైతిక విలువలకూడిన విద్యనందించాలని కలెక్టర్ పమేలా సత్పతి ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు . బడుగు , బలహీన ఆర్థికంగా వెనకబడిన వర్గాల పిల్లలు విద్యను అభ్యసించే ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం అన్ని రకాల వసతులు కల్పిస్తుందన్నారు . ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి విద్యార్థులను తీర్చిదిద్దాలని పేర్కొన్నారు . కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రేపాక ఉమ , ప్రధాన కార్యదర్శి కొమిరెల్లి భాస్కర్ రెడ్డి , రాష్ట్ర క్రీడా కో కన్వీనర్ కొత్తకొండ శ్రీధర్ , జిల్లా గౌరవ అధ్యక్షులు పల్లా రామకృష్ణ రెడ్డి , ఆర్థిక కార్యదర్శి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి , జిల్లా బాధ్యులు నవీన్ , రాగిరు పాండు గౌడ్, పాండు , హరి ప్రసాద్ , ఇరుగు యాదగిరి , సంతోష్ , లింగయ్య లు పాల్గొన్నారు

రాములు మృతి లారీ మోటార్ వర్కర్స్ యూనియన్‌కు తీరని లోటు



నవతెలంగాణ-చౌటుప్పల్

చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రానికి చెందిన అన్నెమోని రాములు మృతి లారీ మోటార్ వర్కర్స్ యూనియన్‌కు తీరని లోటు అని ఎఆర్‌టీడబ్ల్యుఎఫ్ అధ్యక్షులు ఎమ్‌డి.పాషా అన్నారు. శనివారం రాములు మృతదేహాన్ని పాషాతోపాటు నాయకులు సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా పాషా మాట్లాడుతూ కార్మిక సమస్యల పరిష్కారం కోసం రాములు అనేక పోరాటాలు నిర్వహించినట్లు తెలిపారు. ట్రాన్స్ పోర్టు యూనియన్ సమస్యల పరిష్కారం కోసం అనేక ఉద్యమాలు నిర్వహించారని పేర్కొన్నారు. నివాళులర్పించిన వారిలో సీపీఐ(ఎం) మున్సిపల్ కార్యదర్శి బండారు నర్సింహా, చేనేత కార్మికసంఘం జిల్లా అధ్యక్షులు గోశిక స్వామి, సీఐటీయు జిల్లా కమిటీ సభ్యులు బత్తుల దాసు, ఆదిమూలం నందీశ్వర్, కొంతం శ్రీనివాస్‌రెడ్డి, రాములు పాల్గొన్నారు.



అర్హులైన వారికే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు

నవతెలంగాణ - చౌటుప్పల్ రూరల్

అర్హులైన వారందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తామని దండు మల్కాపురం గ్రామ సర్పంచ్ ఎలువర్తి యాదగిరి తెలిపారు. దండు మల్కాపురం గ్రామపంచాయతీ ఆవరణలో శనివారం గ్రామసభ నిర్వహించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తుందని అన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు గ్రామంలో నిర్మించడం అభినందనీయమని అన్నారు. సొంత జాగా ఉన్నవారికి ఇండ్ల నిర్మాణం చేసుకునేవారికి ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తుందని తెలిపారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్ధిదారుల కోసం మొదటి గ్రామసభ నిర్వహించారు. అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. మూడు రోజుల్లో దరఖాస్తులు తీసుకుంటామని స్పష్టం చేశారు. చివరి గ్రామసభ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి మాన్యా నాయక్, మండల తహసిల్దార్ శ్యాంసుందర్ రెడ్డి, ఎంపీడీవో సందీప్ కుమార్, ఎంపీటీసీ చిట్టంపల్లి శ్రీనివాస్, గ్రామపంచాయతీ పాలకవర్గం సభ్యులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

4న కాసర్ల కమలమ్మ సంతాప సభ

నవతెలంగాణ- నల్లగొండ



తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు కాసర్ల కమలమ్మ సంతాప సభ ఈ నెల 4న ఉదయం భాదేగూడెంలో నిర్వహిస్తున్నట్లు సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి ఎండి సలీం తెలిపారు. శనివారం పట్టణంలోని బాదేగూడెంలో సీపీఎం శాఖ కార్యదర్శి పిన్నపురెడ్డి మధుసూదన్ రెడ్డి అధ్యక్షతన శాఖా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాసర్ల కమలమ్మ పోరాట స్ఫూర్తిని నేటి తరానికి తెలియజేయడానికి 4న బాదేగూడెంలో సంతాప సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యేలు జూలకంటి రంగారెడ్డి, నంద్యాల నరసింహారెడ్డి, జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సయ్యద్ హాశం పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు దండేపల్లి సత్తయ్య, సీనియర్ నాయకులు ఊట్కూరి నారాయణరెడ్డి, వంగర సత్తయ్య, అద్దంకి నరసింహ, కాసర్ల గౌతంరెడ్డి, రాపోలు చంద్రయ్య కర్నాటి శ్రీరంగం మండడి శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ మీట్‌కు తిరుమలగిరి పాఠశాల విద్యార్థులు

నవతెలంగాణ -చివ్వేంల



నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్స్ మీట్ కు తిరుమలగిరి (జి)పాఠశాల విద్యార్థినిలు స్రవంతి, కీర్తన (600 మీటర్ల పరుగు పందెం)కు ఎంపికయ్యారు. జనవరి 12, 13, 14 తేదీలలో పాట్నాలో జరిగే 18వ నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్స్ మీట్ -2023లో అండర్ 14,16 ఎంపిక కావడం పట్ల వారి తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అర్హులకు డబుల్ బెడ్రూం ఇండ్లు ఇవ్వాలి

నవతెలంగాణ-మఠంపల్లి



అర్హులైన అన్నివర్గాల పేదలకు డబుల్ బెడ్రూమ్ ఇండ్లు కట్టించాలని కోరుతూ సీపీఐ(ఎం) మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం తహసిల్దార్ సాయాగౌడ్‌కు మెమోరాండం ఇచ్చారు. ఈసందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. ఇల్లుకావాలని దరఖాస్తు చేసుకున్న 400 మందికి డబల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వాలని ప్రభుత్వానికి డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు భూక్య పాండు నాయక్, పార్టీ మండల కార్యదర్శి మాలోతు బాలు నాయక్ ,ప్రజా సంఘాల నాయకులు సయ్యద్ రన్‌మియా, కంటు కోటయ్య, పొదిల సైదులు, బి శంబయ, నరసింహ, రవి, మక్త ఆలీబాబా, పి రాము, ఆర్ వినోద్, కావ్య, సుక్కమ్మ పాల్గొన్నారు.

ఆపద్బాంధవుడు సీఎం కేసీఆర్



నవతెలంగాణ- నకిరేకల్

రాష్ట్రంలోని పేద ప్రజలు ఆపదకాలంలో ఉన్నపుడు ఆదుకునే ఆపద్బాంధవుడు సీఎం కేసీఆర్ అని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య కొనియాడారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేతపల్లి మండలం కొత్త పేట గ్రామానికి చెందిన ఇట్టమల్ల నరేష్ కు రూ. 2.50 లక్షలు, ఉప్పలపహాడ్ గ్రామానికి చెందిన ఎర్పుల నాగరాజు కు మంజూరైన రూ ఒక లక్ష ఎల్వోసి చెక్కులను అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల ప్రాణాలకు విలువిచ్చి వారి కోసం తాను అహర్నిశలు కృషి చేస్తున్నానని తెలిపారు. ప్రాణపాయ స్థితిలో ఉండి వైద్య ఖర్చులు చెల్లించలేని పరిస్థితుల్లో పేద ప్రజల కోసం అండగా నిలుస్తానని పేర్కొన్నారు.

క్యాలెండర్ఆవిష్కరణ : పీఆర్‌టీయూ టీఎస్ ఆధ్వర్యంలో రూపొందించిన 2023 క్యాలెండర్ను శనివారం స్థానిక ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్ గౌడ్ తో పాటు పిఆర్టియు సంఘం బాధ్యులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకానికి బాలారిష్టాలు

- ఏజెన్సీల నడ్డి విరుస్తున్న గుడ్డు..
- అప్పుల పాలవుతున్న ఏజెన్సీలు

నవతెలంగాణ- నల్లగొండ

సర్కారి పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని ప్రభుత్వం అమలుచేస్తున్న మధ్యాహ్న భోజన పథకం బాలా రిష్టాలు ఎదుర్కొంటుంది. నల్లగొండ జిల్లాలో 1404 పాఠశాలలలో 1 నుండి 5 తరగతి వరకు 62,526 విద్యార్థులు, 6 నుండి 10 తరగతి వరకు 52,297 మంది విద్యార్థులు పాఠశాలలో



విద్యను అభ్యసించుచున్నారు. వీరికి విద్యా హక్కు చట్టం ప్రకారం పాఠశాల కు వస్తున్న ప్రతి విద్యార్థికి బలమైన పౌష్టికాహారం అందించాలని నిర్దేశించారు. ఈ నేపథ్యంలో నిత్యం విద్యార్థులకు అందించవలసిన పౌష్టికాహారం మెనూను ప్రభుత్వం ప్రకటించింది. మెనూలో వారానికి మూడు రోజులపాటు గుడ్డు పెట్టాలని ఆదేశాలు జారీ చేశారు. మూడు రోజులు గుడ్డు తో పాటు భోజనంలో కూర సాంబారు పెట్టాలని నిర్ణయించారు. బియ్యం ప్రభుత్వం సరఫరా చేస్తూ , గుడ్డు, కూరగాయలు, కూరకు కావలసిన పచారీ సామాగ్రి ఏజెన్సీలు పెట్టుబడులు పెట్టి తయారు చేయాల్సి ఉంటుందని ఆదేశించారు. కూర తయారీ కి ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి ప్రాథమిక పాఠశాలలో రోజుకు నాలుగు రూపాయల తొంభై పైసలు, ఉన్నత పాఠశాలలో ఏడు రూపాయల 90 పైసలు నిర్ణయించారు. గుడ్డు అందజేసే మూడు



రోజుల్లో అదనంగా గుడ్డుకు నాలుగు రూపాయలు కేటాయించారు.

నడ్డి విరుస్తున్న గుడ్డు..

గుడ్డుకు ప్రభుత్వం ఇస్తున్న ఖర్చు నాలుగు రూపాయలు మాత్రమే. కానీ మార్కెట్లో కోడిగుడ్డు 7 రూపాయల నుండి 8 రూపాయల మధ్య ఉంది. ప్రభుత్వం చెల్లించేది నాలుగు రూపాయల కావడంతో మధ్యాహ్న భోజనంలో గుడ్డు వడ్డించడం పెను భారంగా మారిందని ఏజెన్సీ మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంద మంది విద్యార్థులు హాజరై భోజనం చేసిన పాఠశాలలో కోడిగుడ్డు ఖర్చు 700 రూపాయలు వస్తుందని, ప్రభుత్వం ఇచ్చేది 400 రూపాయలు మాత్రమేనని దీంతో గుడ్డు పెట్టి నప్పుడల్లా రెండు మూడు వందల రూపాయలు నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్లో నూనె కారం ఉప్పు పప్పు ఇతర సామాగ్రి ధరలు మండి పోతూ ఉండడంతో వంటావార్పు చేయడం భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అప్పుల పాలవుతున్న ఏజెన్సీలు. ..

వారంలో మూడు రోజులు గుడ్డు అందించడం సాధ్యం కాదని కొన్ని పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులతో ఏజెన్సీలో ఘర్షణకు దిగుతున్నాయి. మరికొన్ని చోట్ల వంటావార్పు గిట్టుబాటు కాలేదని చేతులెత్తేస్తున్నారు. బయట కూలికి వెళ్తే రోజుకు 800 రూపాయలు వస్తుందని కూలీ, వంటావార్పు చేస్తే నెలకు వెయ్యి రూపాయలు వేతనం మాత్రమే చెల్లిస్తున్నారని, విద్యార్థులకు యూనిట్ కాస్ట్ కి ఇచ్చే దానిలో ఏమీ మిగలడం లేదని పెట్టుబడులు పెట్టి అప్పులపాలు అవుతున్నామని ఏజెన్సీ మహిళలు వాపోతున్నారు. మార్కెట్ లో పెరిగిన ధరలను బట్టి కూర ఖర్చు ఒక విద్యార్థికి 15 నుండి 20 రూపాయలు చెల్లించాలని , కోడిగుడ్లను బియ్యం మాదిరిగా ప్రభుత్వమే సరఫరా చేయాలని ఏజెన్సీలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ పథకంలో ఏజెన్సీలను ఎత్తివేసి సంక్షేమ హాస్టల్ లో మాదిరిగా పర్మినెంటు కుక్, హెల్పర్, ఇతర సిబ్బంది నియామకం చేసే అమలు చేయాలని ఉపాధ్యాయ వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి.



పోరు పథమే...!



ముగిసిన వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు

- జర్నలిస్టుల సమస్యలపైనా మహాసభల్లో తీర్మానం
- ముదిగొండ లాంటి మరో భూ పోరాటానికి సమాయత్తం

రాష్ట్ర కమిటీలోకి 87మంది ఎన్నిక

సక్సెస్ కోసం కృషి చేసిన వాలంటీర్లు కృతజ్ఞతలు

రైతుసంఘం రాష్ట్ర నాయకులు నున్నా నాగేశ్వరరావు

వ్యవసాయ కార్మికులు కదనానికి సిద్ధమయ్యారు. కర్తవ్య మార్గంలో ముందుకెళ్లేందుకు సన్నద్ధమవుతున్నారు. ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రం వేదికగా వేదగిరి శ్రీనివాసరావు నగర్ లో మూడు రోజుల పాటు నిర్వహించిన తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మూడో మహాసభ శనివారం విజయవంతంగా ముగిసింది. బహిరంగ సభ ప్రభం'జనం' సృష్టించడంతో 700 మంది ప్రతినిధులు మహాసభలో రెట్టించిన ఉత్సాహంతో భాగస్వాములయ్యారు. ఏఐఏడబ్ల్యూయూ నిర్ణయాలే తమ జెండా.. ఎజెండాగా తీసుకుని వెళ్లారు. రుచికరమైన వంటలు.. చక్కని పాటలు.. ఎక్కడా అలుపూసొలుపూ లేకుండా డెలిగేట్స్ ఆహ్లాదంగా గడిపారు. జయహో వ్యవసాయ కార్మిక... 'పోరాడితే పోయేదేమీ లేదు.. హక్కుల సాధన తప్ప' అనే నేతల మాటలతో ఎత్తిన పిడికిళ్లు ముందుకు కదిలాయి.







జనగామ జిల్లా బృందం ఆటా పాట





సభకు హాజరైన డెలిగేట్స్



సభలో మాట్లాడుతున్న నరసింహులు(కామారెడ్డి)



కమల(కొమరం బీం)



సభలో మాట్లాడుతున్న పోతినేని





సభలో మాట్లాడుతున్న బి.వెంకట్



మహాసభలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

ముదిగొండ భూ పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలి...

నున్నా నాగేశ్వరరావు, రైతుసంఘం రాష్ట్ర నాయకులు

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ముదిగొండ భూ పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలని రైతుసంఘం రాష్ట్ర నాయకులు నున్నా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక భక్త రామదాసు కళాక్షేత్రం (వేదగిరి శ్రీనివాసరావు నగర్)లో జరిగిన తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం 3వ మహాసభల ముగింపు వేడుకలను ఉద్దేశించి శనివారం ఆయన మాట్లాడారు. ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రం ప్రయత్నిస్తుందన్నారు. దీనిపై ఈ మహాసభల్లో నిర్ణయం తీసుకొని ఉద్యమించాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘాన్ని మరింతగా బలోపేతం చేయాలన్నారు. మహాసభలను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ మహాసభల సక్సెస్ కోసం కృషి చేసిన వాలంటీర్లు, సోషల్ మీడియా టీం, ఐద్వా, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, సీఐటీయూ, రైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, గిరిజన సంఘం తదితరులకు ధన్యవాదాలు తెలిపారు.



మహాసభకు హాజరైన సీనియర్ నాయకులు

ఖమ్మం జిల్లా నుంచి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీకి ఎన్నికైన సభ్యులు



పొన్నం వెంకటేశ్వరరావు



మెరుగు సత్యనారాయణ



పొన్నెకంటి సంగయ్య



బంధం రాజ్యం



వత్సవాయి జానికిరాములు



ఎర్ర శ్రీనివాసరావు



కొండబోయిన నాగేశ్వరరావు



జాజిరి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న శ్రీరామ్ నాయక్

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886